లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక

# జనబలం

ప్రజలే ప్రభువులు

ఏప్రిల్ 2021 రూ.10/-




## వ్యవసాయ చట్టాలు

## విశాఖ స్టీల్ ప్లాంట్

## రాజ్యవ్యవస్థ




## తెలుగు రాష్ట్రాల ఎన్నికలు - 'మహా' పరిణామాలు - ధన రాజకీయాలు



# అంబేద్కర్ అనుమానమే నిజమైంది..

## రాజ్య వ్యవస్థ పాత్రను సరిచేయటమే తక్షణం మనం చేయాల్సింది

"రాజ్యాంగం అమల్లోకి వచ్చిన ఆరేళ్ల తర్వాత బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఎంతో లోతైన, నిర్మొహమాటమైన వ్యాఖ్యలు చేశారు. ఈ పరిశీలనకు చాలా ప్రాధాన్యత ఉంది. చట్టబద్ధంగా మినహాయింపు కల్పించిన హక్కులు ముఖ్యమైనవే, కానీ విద్య, ఆర్థిక, సామాజిక అసమానతని తొలగించటానికి నిరంతర పోరాటం అవసరం.. అని ఆయన స్పష్టంగా గుర్తించారు. తాను పోరాడి రాజ్యాంగంలో పొందుపరిచేలా చేసిన హక్కుల నుంచి లాభం పొందిన కొద్దిమంది, సొంత ఆదాయాలను పోగేసుకోవటంలో తలమునకలై ఉన్నారని అంబేద్కర్ వేలెత్తి చూపారు. జడలు పరచుకొని ఉన్న అసమానతల్ని, సమాజంలోని అవకాశాలకు నోచుకోని కోట్లాదిమందిని వీరు విస్మరించారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వోద్యోగం కోసం ఎదురుచూసే యువత సమాజాన్ని విముక్తం చేయలేరని మందలించారు. అజ్ఞానం వల్ల దోపిడీకి, అన్యాయానికి గురికావటాన్ని నిర్మూలించి తీరాలని ఉద్ఘాటించారు. అప్పటి నుంచి, ఆరు దశాబ్దాలకుపైగా గడిచిపోయాయి. అంబేద్కర్ శంకించినదే భవిష్యవాణి అని రుజువైంది. మనం సమానత్వాన్ని, అవకాశాల్ని పెంపొందించటానికి న్యాయాన్ని పొందటానికి చట్టబద్ధ వ్యవస్థల్ని ఏర్పాటు చేసుకున్నాం. కానీ వాస్తవంలో మాత్రం.. నిజమైన సమానత్వం, అవకాశాలు, న్యాయం మన ప్రజల్లోని అత్యధిక సంఖ్యాకులకు అందటం లేదు. మన రాజ్య వ్యవస్థ, విధానాలు, పనితీరుల్లోని లోపాల్ని గుర్తించి ఒక క్రమపద్ధతి ప్రకారం సరిచేయటాన్ని మించి ప్రయోజనకరమైన పని ఈవేళ దేశం పట్ల మరొకటి లేదు".

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్,
ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు
(ఏప్రిల్ 14 - అంబేద్కర్ జన్మదినోత్సవం)

ప్రజలే ప్రభువులు

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక


సంపుటి 24 సంచిక 04

ఏప్రిల్ 2021



సంపాదకవర్గం

బండారు రామ్మోహనరావు

శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్

దూసనపూడి సోమసుందర్


## జనబలం చందా రుసుము వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | రూ. 1200.00 |

*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*

### చందాదారులకు విజ్ఞప్తి

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

### కార్టూన్ కార్నర్







కార్యాలయ చిరునామా : తులిప్స్ అపార్ట్‌మెంట్స్ 6-3-655, ప్లాట్ నెం 407, సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక, సోమాజిగూడ, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288

Email: janabalam.loksatta@gmail.com, loksattaudyamasamstha@gmail.com

సంపాదకీయం

# అప్పుల ఊబిలో ఆంధ్రప్రదేశ్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నానాటికీ అప్పుల ఊబిలో కూరుకుపోతున్నది. రుణ భారం పెరిగిపోతున్న రాష్ట్రాల జాబితాలో ఆంధ్రప్రదేశ్ ప్రస్తుతం నాలుగో స్థానంలో ఉంది. అయితే ప్రభుత్వం మేలుకోకపోతే త్వరలో మొదటి స్థానంలోకి వచ్చినా ఆశ్చర్యపోవలసిన పనిలేదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇటీవల కాగ్ విడుదల చేసిన నివేదికలో ఆంధ్రప్రదేశ్ ఆర్థిక స్థితిగతులపై ఆందోళన వ్యక్తం అయ్యింది. మొత్తం వ్యయంలో అప్పుల సొమ్ము యాభైశాతానికి చేరుకుందన్న చేదు నిజాన్ని ప్రభుత్వ పెద్దలు ఇంకా గ్రహించినట్లు లేదు. రాష్ట్ర ముఖ్యమంత్రిగానీ, ఆర్థిక మంత్రిగానీ ఆర్థిక స్థితిగతుల గురించి పెద్దగా మాట్లాడటం లేదు. సీనియర్ మంత్రులు ఒకరిద్దరు మాట్లాడినా అనుమతించదగిన పరిమితుల్లోనే రుణాలు ఉన్నాయని అనునయిస్తున్నారు. అయితే కాగ్ నివేదిక వెల్లడించిన గణాంకాలు వేరుగా ఉన్నాయి.

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి గల రుణ భారం 3,73,140 కోట్ల రూపాయలుగా ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రుణ సేకరణ లక్ష్యం 48,295 కోట్లుగా గత బడ్జెట్‌లో అంచనా వేశారు. కానీ కాగ్ వెల్లడించిన గణాంకాల ప్రకారం 2020 ఏప్రిల్ నవంబర్ నెలల మధ్యలో 78,811 కోట్ల రూపాయల రుణం తీసుకున్నట్లు తేలింది. ఒక్క నవంబర్ నెలలోనే 13,000 కోట్ల రూపాయలు రుణం తీసుకున్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

రాష్ట్ర రెవెన్యూ లోటు మొత్తం ఆర్థిక సంవత్సరానికి 18,434 కోట్లుగా బడ్జెట్‌లో అంచనా వేశారు. కానీ 2020 నవంబర్ నెలాఖరు నాటికి రెవెన్యూ లోటు 57,925 కోట్ల రూపాయలకు చేరుకున్నది. సగటున నెలకు 9,226 కోట్ల రూపాయల అప్పు చేస్తున్నట్లుగా తేలింది. వేతనాలు, పింఛన్లు ప్రతినెలా 1వ తేదీ నాటికే అలవాటున్న ఆంధ్రప్రదేశ్‌లో గత కొన్ని నెలలుగా చెల్లింపులు ఆలస్యం అయిపోతున్నాయి.

2019 సాధారణ ఎన్నికల నాటికి గత ప్రభుత్వం చేసిన అప్పులు 70,000 కోట్ల రూపాయలు కాగా, కొత్త ప్రభుత్వం కేవలం అర్నెళ్ల వ్యవధిలో లక్షా ఆరువేల కోట్ల రూపాయల రుణాలు తీసుకున్నది. పాత ప్రభుత్వం చేసిన బకాయిలను తీర్చడానికే రుణం తీసుకున్నామని జగన్ ప్రభుత్వం వివరణ ఇచ్చింది. అయితే పాత ప్రభుత్వం చేయాల్సిన చెల్లింపుల పద్దు వేల కోట్ల రూపాయలు ఉంది. పాత బిల్లులను చెల్లించకుండా తొక్కిపెట్టి ఉంచడంతో వివిధ శాఖలు చేయించిన అభివృద్ధి కార్యక్రమాల బాపతు బిల్లులపై వివాదం నడుస్తూనే ఉంది. రాజకీయ ప్రత్యర్థులను ఆర్థిక దెబ్బ తీసేందుకు బిల్లులు చెల్లింపులు నిలిపివేస్తున్నారన్న విమర్శ వినిపిస్తోంది. అయితే ప్రభుత్వ ఆర్థిక నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందన్న వాస్తవాన్ని కూడా గమనించాలి.

గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే రాష్ట్ర రెవెన్యూ పెరుగుదల కేవలం 2వేల కోట్ల రూపాయలుగా బడ్జెట్‌లో చూపించారు. కానీ రుణాలు మాత్రం 46,503 కోట్ల రూపాయల నుంచి 73,912 కోట్ల రూపాయలకు పెరిగినట్లు చూపించారు. పాతరుణాలకు ప్రభుత్వం చెల్లిస్తున్న వడ్డీ ఏటా 35000 కోట్ల రూపాయలకు చేరుకున్నది. రెవెన్యూ వ్యయం 70వేల కోట్లుగా ఉన్న బడ్జెట్‌లో 35వేల కోట్ల రూపాయలు వడ్డీగా చెల్లించడం రాష్ట్ర ఆర్థిక స్థితిని వెల్లడిస్తున్నది. గత 20 నెలల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన రుణాలు 1,50,000 కోట్ల రూపాయలు కాగా, ప్రజలపై వేసిన పన్నుల భారం 75,000 కోట్ల రూపాయలుగా ఉందని ఆర్థిక నిపుణులు అంచనా వేశారు. వ్యయం పెరగడం, జీఎస్టీ వసూళ్లు తగ్గడం, కేంద్రం వాటా తగ్గడం, గ్రాంట్లు తగ్గడంతో రాష్ట్ర ప్రభుత్వం ఒక పక్క రుణాలు చేస్తూ మరో పక్క పన్నులను పెంచుతోంది. రాష్ట్రంలో గత ఏడాది పరోక్ష పన్నుల రూపంలో 9వేల కోట్ల రూపాయల అదనపు ఆదాయాన్ని ప్రభుత్వం సంపాదించింది. ఆస్తిపన్ను లెక్కించే విధానంలో చేసిన చిన్న మార్పు ద్వారా గతంలో 2900 కోట్లుగా ఉన్న ఆస్తి పన్ను ఈ సంవత్సరం 176శాతం పెరిగి 8000 కోట్ల రూపాయలకు చేరుకున్నది.

రాష్ట్ర ప్రభుత్వం 'నవరత్నాలు' పేరుతో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల కోసం బడ్జెట్‌లో అత్యధిక భాగాన్ని ఖర్చు చేస్తోంది. భారత ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారు సుబ్రహ్మణ్యం కృష్ణమూర్తి ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలు పాటిస్తున్న ఆర్థిక నిర్వహణపై పెదవి విరుస్తున్నారు. మూల ధన వ్యయాన్ని పెంచాలని ఆయన ఆంధ్రప్రదేశ్‌కు సూచించారు. అప్పులు తెచ్చిన సొమ్మును ఆస్తుల కల్పనకు వినియోగించాలని ఆయన గట్టిగా చెబుతున్నారు. ఆస్తుల సృష్టితో ఉద్యోగాలు, ఆదాయాలు పెరుగుతాయని ఆయన గుర్తు చేశారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కూడా ఉద్యోగ కల్పనపై దృష్టి సారించాలని రాష్ట్రానికి హితవు చెబుతున్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక రంగం వాటా తగ్గిందని, వచ్చిన ఆదాయంలో 42శాతం వడ్డీల చెల్లింపునకే ఖర్చవుతోందని, ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.


పన్నుల భారం పెంచుతూ, అనుచిత పథకాల కోసం నిధుల్ని ఖర్చు చేయడంతో రుణ భారం పెరుగుతోందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. త్వరలో ఆంధ్రప్రదేశ్ ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడే పరిస్థితిని చవి చూడనున్నదన్న హెచ్చరికలు వినవస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం దగ్గర సంక్షోభ నివారణకు తగిన మార్గాలు కనిపించడం లేదు.

డి. సోమ సుందర్

# నూతన వ్యవసాయ చట్టాలు.. విశాఖ స్టీల్ ప్లాంటు.. రాజ్య వ్యవస్థ!

భారత ప్రభుత్వం ఇటీవల తెచ్చిన నూతన వ్యవసాయ చట్టాలు, సవరణలపై ఒక ప్రముఖ తెలుగు దినపత్రిక సంపాదకుడు ఆసక్తికర వ్యాఖ్య చేశారు. ఈ చట్టాలపై లాభనష్టాల పరిధిలో మాట్లాడటం వల్ల పెద్ద ప్రయోజనం ఉండదని, అసలు ఆ తరహా వ్యవస్థ పర్యవసానంగా రూపుదిద్దుకునే జీవిత నమూనా గురించే చర్చ జరగాలన్నారు.

కొత్త వ్యవసాయ చట్టాల వల్ల రైతులకు ఇప్పుడు లభిస్తున్న ఆదాయం కంటే ఎక్కువ దక్కుతుందనటంలో సందేహం లేదు. కొన్ని స్థానిక పరిస్థితుల వల్ల, సాంస్కృతిక కారణాలు, అపోహల వల్ల రైతులు ఆందోళనలు చేస్తుండవచ్చు, మోదీని బలహీనపరచటానికి కొన్ని విపక్షాలు, ప్రజాసంఘాలు వాటిని ప్రోత్సహిస్తుండవచ్చు, ప్రధాని నరేంద్ర మోదీ కూడా కొవిడ్ కాలం కాబట్టి వ్యతిరేకత రాదనే ఉద్దేశంతో వీటిని ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా ఏకపక్షంగా ఆమోదింప చేసుకుని ఉండవచ్చు, రైతులు ఆందోళన ఉధృతంగా చేపట్టాక కూడా నిర్లక్ష్యం వహించటానికి ఇందిరాగాంధీలాగే మోదీలో కూడా స్వీయవిధ్వంసక లక్షణాలుండుండవచ్చు (పంజాబ్‌లో వ్యక్తమవుతున్న ఆందోళనల గురించి నూతన వ్యవసాయ చట్టాలపై ఆర్డినెన్స్‌లు వచ్చినప్పటి నుంచి చెబుతున్నా ప్రభుత్వ పెద్దలు వినిపించుకోలేదని, ఆ చట్టాలు ఆమోదం పొందాక రాజీనామా చేయటం తప్ప గత్యంతరం లేకపోయిందని మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వంలో ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిగా ఉన్న శిరోమణి అకాలీదళ్‌కు చెందిన హర్‌సిమ్రత్ కౌర్ చెప్పారు. కొద్దిపాటి మార్పులు బిల్లుల్లో చేసి ఉంటే ఆందోళనల దాకా పరిస్థితి వచ్చేది కాదన్నారు), లేదా ఆయనకు వేరే వ్యూహాలు ఉండొచ్చు.. కానీ రైతు లాభం, దేశ ఆర్థిక ప్రయోజనాల దృష్ట్యా చూస్తే మాత్రం వ్యవసాయ చట్టాలు (ప్రస్తుతానికి వీటిని అధికారికంగా స్తంభింపచేశారు) మార్కెట్ పరంగా పెద్ద అడుగులు అనటంలో సందేహం లేదు. ఇదేసమయంలో సదరు సీనియర్ సంపాదకుడు అన్నట్లు, అసలు ఆ రకంగా మెరుగైన ఆదాయం పొందే క్రమంలో రూపుదిద్దుకునే జీవిత నమూనా రైతుల కలల్ని, ఆకాంక్షల్ని నెరవేర్చగలదా? అలాంటి జీవితం కోసమేనా మనం రాజ్యవ్యవస్థతో సామాజిక ఒప్పందాన్ని కుదుర్చుకున్నది?.. వ్యవసాయ చట్టాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న బృందాలు, వారిలోనూ వామపక్షవాదులు ఎక్కువగా ఉన్న శిబిరంలో ఆయన ఆ వ్యాఖ్యలు చేశారు.




వ్యవసాయ చట్టాలు, వాటిని అనుసరించే అనివార్య పరిణామాల వల్ల రైతులకు లాభం వచ్చే అవకాశాలు పెరుగుతాయి, కొంత జీవన భద్రత సమకూరుతుంది, కానీ అదేసమయంలో జీవితం కూడా యాంత్రికమవుతుంది. ఏ స్టార్టప్‌లయితే భవిష్యత్ స్వయం/ఉపాధి అవకాశాలని పాలకులే చెబుతున్నారో, అలాంటి చిన్నపాటి స్టార్టప్‌ల తరహాలో వ్యవసాయం చేసుకుంటున్న రైతుల్లో అనేకమంది ఇతరుల వద్ద చిరుద్యోగులుగా మారిపోతారు. కానీ సమస్య – ఇంతకంటే మెరుగైన ప్రత్యామ్నాయం ఉందా రైతులకి? ఉంటే, తమ పిల్లల్ని వ్యవసాయంలో కొనసాగించకూడదని ఎందుకనుకుంటున్నారు?

ఇప్పుడేదైతే చర్చించాలని ప్రతిపాదిస్తున్నారో.. ఆ ప్రత్యామ్నాయ జీవిత నమూనా మీద సదరు సోషలిస్టు భావజాలురు ఇన్ని దశాబ్దాలుగా ఎందుకు ఆలోచన చేయలేకపోయారు? నువ్వు మా నోట్లో వేలు పెట్టు, మేం నీ కంట్లో వేలుపెడతాం.. తరహాలో రైతుల్ని నాశనం చేసిన వ్యవసాయ విధానాల్లో ఎందుకు భాగమయ్యారు? స్వతంత్రం వచ్చిన నాటి నుంచీ వ్యవసాయ రంగంలో అదే తరహా దుర్మార్గ విధానాలు అమలవున్నా, ఎందుకు ఆ దోపిడీని అడ్డుకోలేకపోయారు? రైతుల్ని సంకెళ్లలోనే ఎందుకు కొనసాగించారు? తమ పిల్లల్ని వ్యవసాయం కాకుండా ఇతర రంగాలకు ఎందుకు మళ్లిస్తున్నారు?

సోషలిస్టు భావజాలురు కావచ్చు, ఆర్థిక సంస్కరణల్ని వ్యతిరేకించే ఇతర సాంప్రదాయ వర్గాలు కావచ్చు.. సరైన

ప్రత్యామ్నాయాన్ని, అమలు మార్గాన్ని చూపకుండా (ఏమైనా ఉంటే), ఉన్న వ్యవస్థను ప్రక్షాళన చేసే ప్రయత్నమూ చేయకుండా కేవలం విమర్శల దాడులతో లబ్ధి పొందే రాజకీయమే చేస్తున్నారు. ఆ సోమరితనపు అవకాశవాద రాజకీయం వల్లే దేశానికి ఇన్నేళ్లలో ఇంత నష్టం జరిగింది.

ఒకప్పుడు మన కంటే వెనుకబడిన దేశాలు కూడా ఈవేళ మన కంటే ఎన్నో రెట్లు ముందుండటానికి విధానపరంగా ఆ దేశాల్లోని రాజకీయ వ్యవస్థ సాధించిన పరిణతి ప్రధాన కారణం. కానీ మన దేశంలో వైఫల్యాలు స్పష్టంగా కనిపిస్తున్నా.. రాజకీయ వ్యవస్థ, ముఖ్యంగా సోషలిస్టు భావజాలురు అపరిపక్వ రాజకీయ దృక్పథాన్నే కొనసాగించారు. ఇప్పుడు కూడా రైతుల ఆకాంక్షలు పెరిగాయి కాబట్టి మద్దతు ధరలో భారీ పెంపు గురించి మాట్లాడుతున్నారు తప్ప, వ్యవసాయ రంగంలో సంక్షోభాన్ని పరిష్కరించే, దేశాభివృద్ధికి దోహదం చేసేలా సంస్కరణల్ని ప్రవేశపెట్టే ధోరణి కనిపించటం లేదు. తప్పిదాలు పునరావృతమవుతున్నా సరే, చేసిందే చేస్తాం, చేసినట్లే చేస్తామంటే.. అందుకు ఉద్యమాలు, నాయకులు అక్కర్లేదు, రోబోలు సరిపోతాయి. రోబోలు, కృత్రిమ మేధ యంత్రాలు చేయలేని పనిని మనం ఎంతమేర చేస్తున్నాం? అన్న మథనం ఈవేళ్టి రాజకీయ వ్యవస్థలో, పౌర సమాజంలో మొదలవ్వాలి.

ఇంకో అంశం విశాఖ స్టీల్ ప్లాంట్ (రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్) ప్రైవేటీకరణ. ఈ ప్లాంట్‌ను 100% అమ్మేస్తామని కేంద్ర ప్రభుత్వం విస్పష్టంగా ప్రకటించింది. నష్టాల్లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను వారసత్వం పేరుతో నడపటం దేశ ఆర్థిక వ్యవస్థకు భారమని, వాటిని నడపలేమని, ప్రభుత్వమే స్వయంగా వ్యాపారం చేయాల్సిన అవసరం లేదని ప్రధాని మోదీ తేల్చి చెప్పారు. 100 పబ్లిక్ రంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా రూ.2,50,000 కోట్లు రాబట్టాలని నిర్ణయించినట్లు చెప్పారు. నాలుగు వ్యూహాత్మక రంగాలు తప్ప అన్ని పీఎస్‌యూలను ప్రైవేటీకరిస్తామన్నారు. పీఎస్‌యూలలో పెట్టుబడుల ద్వారా ప్రైవేటు రంగం అధునాతన సాంకేతికతను తీసుకువస్తుందని, యాజమాన్య ధోరణిలో మార్పులు కనిపిస్తాయన్నారు. అగ్రశ్రేణి మేనేజర్లతో ప్రపంచంలోని ఉత్తమ విధానాలను అనుసరించడానికి ఆస్కారం ఉంటుందని, మొత్తం వ్యవస్థ సమర్థతను ఇది పెంచుతుందన్నారు.

అయితే ప్రయివేటీకరణ చేయాల్సిన అవసరం లేదంటూ, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను తిరిగి లాభాల బాటలోకి తేవటానికి ఏం చేయాలో కొందరు నిపుణులు, సామాజికవేత్తలు సూచిస్తున్నారు. ఎన్ఎండీసీతోగాని, సెయిల్‌తోగాని విలీనం చేయటం, లేదంటే ఎన్ఎండీసీ, సెయిల్ సంస్థలను, వాటి ఆధ్వర్యంలో ఉన్న కర్మాగారాలన్నింటినీ విలీనం చేయటం ద్వారా కర్మాగారం ఆదాయాన్ని పెంచవచ్చంటున్నారు. అలాగే భూములను విశాఖ ఉక్కు కర్మాగారం పేరు మీదకు బదిలీ చేయటం వల్ల ప్లాంట్ విలువ పెరిగి బ్యాంకు రుణాలు అందుబాటులోకి వస్తాయని, నష్టాలను అధిగమించే చర్యలకు అవకాశం ఏర్పడుతుందని చెబుతున్నారు. వీటిల్లో వాస్తవం ఉండొచ్చు. స్టీల్ ప్లాంట్ తిరిగి లాభాల్లోకి రావచ్చు. లోపం భారత ప్రభుత్వంలో ఉంది తప్ప ప్రభుత్వ రంగ సంస్థల్లో లేదని గణాంకాల్ని, బీబీసీ లాంటి ప్రపంచ వ్యాప్త సంస్థల ఉదాహరణలను కూడా వారు చూపుతుండొచ్చు. కానీ సమస్య అది కాదు. స్టీల్ ప్లాంట్ వాటాలను ప్రభుత్వం పూర్తిస్థాయిలో విక్రయించటం వల్ల ఖజానాకు ఎక్కువ ఆదాయం సమకూరుతుంటే, స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వమే నిర్వహించాలని పట్టుబట్టాల్సిన అవసరం ఏమిటి?.. స్టీల్ ప్లాంట్ ఎవరి ప్రయోజనాల కోసం? కేవలం ఉద్యోగుల ప్రయోజనాల కోసమా, లేక మొత్తం ప్రజల ప్రయోజనాల కోసమా?

ప్రభుత్వమే లాభం వచ్చే రేటుతో రైతుల వద్ద నుంచి వ్యవసాయోత్పత్తుల్ని సేకరించాలి లేదా అందుకు పూచీ తీసుకోవాలి, ఏం చేసైనా స్టీల్ వ్యాపారాన్ని నిర్వహించాలి.. ఈ రెండు వాదనలూ ఆధునిక ప్రజాస్వామ్యంలో రాజ్యవ్యవస్థ చేయాల్సిన పనులేంటి? అనే మౌలిక ప్రశ్నను తాజాగా మన ముందుకు బలంగా తెచ్చాయి.

వ్యవసాయాన్నే తీసుకుంటే.. దేశంలో ఆహార కొరత ఏర్పడకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలకు ఉంటుంది కాబట్టి, ఇతర వృత్తుల్లాగా వ్యవసాయాన్ని ప్రభుత్వం పూర్తిగా విస్మరించలేదు. దేశ జనాభాలో ఇప్పటికీ ఎక్కువమంది వ్యవసాయం మీదే ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి ఉన్నారు కాబట్టి.. ఇంకొంత ఎక్కువగా కూడా పట్టించుకోవాలి. కానీ రైతులు పండించిన పంటనంతా మొత్తం ఖర్చులకు 50 శాతం జోడించి మద్దతు ధరగా ప్రకటించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలంటే అసంబద్ధమవుతుంది. ఈ ధరకు ప్రభుత్వ పూచీకత్తునిస్తూ కఠిన చట్టాలు చేయటం వల్ల కూడా ప్రయోజనముండదని గత కొన్నేళ్లుగా మన వ్యవసాయ మార్కెటింగ్ అనుభవాలను చూస్తే అర్థమవుతుంది. అలాగే స్టీలు వ్యాపారం చేయటం కూడా ప్రభుత్వం పని కాదు. ఎక్కువ మందికి ఉపాధి అవకాశాలు వచ్చేలా చేయటం, ప్రజల అవసరాలకు, దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రయోజనకరమైన రీతిలో అవసరమైనంత ఉక్కు అందుబాటులో ఉండేలా చూడటం వరకు మాత్రమే ప్రభుత్వ పాత్ర. ఇప్పుడున్న విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల ప్రయోజనాలను పరిరక్షించటం, స్టీల్‌ప్లాంట్ ఆస్తులను మార్కెట్‌లో గరిష్ఠ ధర లభించేలా సరైన పద్ధతిలో పారదర్శకంగా విక్రయించటం, ఆ వచ్చిన డబ్బుల్లో ఎక్కువ శాతం స్థానికంగా, ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువగా ఉత్పాదకంగా, ఉపాధిదాయకంగా వినియోగించటం వంటి డిమాండ్లను మనం చేయవచ్చు. కానీ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించకూడదు అని కోరటంలో అర్థమేముంది? ఒకప్పుడు ఉద్యమం ద్వారా సాధించాం కాబట్టి ఇప్పుడు కొనసాగించాలనటం ఎంతమేర సమంజసం? స్టీల్‌ప్లాంట్‌ను ఏదోకరకంగా గట్టెక్కించే ప్రయత్నం చేయటం, కొంతమంది సంఘటిత రంగంలోని ఉద్యోగుల ఊహాజనిత ఆందోళలను చూపి.. కోట్లాది అసంఘటిత రంగ ఉద్యోగుల,

నెలకు 10 లక్షల దాకా కొత్తగా ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకుంటున్న యువత భవిష్యత్తును ఫణంగా పెట్టటం ప్రభుత్వం చేయాల్సిన పనా?

ప్రభుత్వం చేయాల్సిన పనులు ప్రధానంగా వ్యక్తులు తమంతట తాము చేసుకోలేని ఉమ్మడి అవసరాలు! ఇందుకోసమే రాజ్య వ్యవస్థతో ప్రజలు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఏ ఒక్కరూ దోపిడీకి, వివక్షకు గురికాకుండా, సమాజంలో అందరికీ సమానంగా ఎదిగే అవకాశాలుండేలా ప్రభుత్వం చేసే పనులుండాలి. వాటిల్లో దేశ సరిహద్దుల్లోపల ముఖ్యమైన అంశాలను తీసుకుంటే.. మొట్టమొదదిటి చట్టబద్ధపాలన. ఆ తర్వాత మౌలిక వసతులు, విద్య, ఆరోగ్యం, స్థానిక స్వయంపాలన, ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిరహిత సేవలు మొదలైనవి. ఈ అంశాల్లో మన ప్రభుత్వాల పనితీరు స్వతంత్రం వచ్చిన నాటి నుంచీ అధ్వాన్నంగా ఉన్నప్పటికీ, దాని వల్ల కోట్లాదిమంది ప్రజలు నివారించదగ్గ బాధలతో కన్నీరు కారుస్తున్నప్పటికీ, పేదరికం నిరంతరాయంగా కొనసాగుతున్నప్పటికీ మనం ఆ సంక్షోభానికి ఇప్పటికీ తొలి ప్రాధాన్యమివ్వటం లేదు. ప్రభుత్వం ఏం చేయనక్కర్లేదో ఆ పనులకు మాత్రం విపరీత ప్రాధాన్యతనిస్తున్నాము. ప్రభుత్వం తన మౌలిక బాధ్యతల్ని నెరవేర్చకుండా ఆ డబ్బుని ఉచితాలు, తాత్కాలిక తాయిలాల కోసం పందేరం చేస్తుంటే, వాటిని ఇంకా ఇంకా పెంచాలని డిమాండ్లు చేస్తున్నాం.

పెట్టుబడుల కోసమో, పొరపాటునో, నిజంగానే సదుద్దేశంతోనో ప్రభుత్వాలు తమ మౌలిక బాధ్యతల్ని కొంతయినా నెరవేర్చటానికి ముందుకొస్తే, అందుకు వెచ్చించే డబ్బును కూడా వృధాగా, అనుత్పాదకంగా ఖర్చు చేసేలా ప్రోత్సహిస్తున్నాం. ఉదాహరణకు విద్య, ఆరోగ్య రంగాలు. మన దేశంలోని చాలా రాష్ట్రాల్లో తలసరి ఒక్కో విద్యార్థి మీద ఏటా రూ.80,000 దాకా ఖర్చు చేస్తున్నారు. ఇదేమీ తక్కువ మొత్తం కాదు. ఈ డబ్బును సరైన పద్ధతుల్లో సద్వినియోగం చేస్తే చాలు.. మన దేశంలో ప్రతి బిడ్డకూ నాణ్యమైన చదువు అందుతుంది, చాలా సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. అలాగే ఆరోగ్యం విషయంలో కూడా. ప్రాథమిక ఆరోగ్యాన్ని పట్టించుకోకుండా ప్రయివేటు పాత్ర ఎక్కువగా ఉన్న తృతీయ స్థాయి వైద్యానికి పెద్దపీట వేయటం వల్ల వైద్య నిపుణులు, మందులు, టీకాల తయారీలో మనకున్న బలాలు కూడా సద్వినియోగం కావటం లేదు. గ్రామీణ, చిన్న పట్టణ ప్రాంతాల్లో ప్రజలు కనీస వైద్య సౌకర్యాలు లేక అవస్థ పడుతున్నారు. కేవలం వైద్య చికిత్సల ఖర్చు భరించలేక ఏటా కోట్ల మంది దేశంలో పేదలుగా మారుతున్నారు, పనిచేసే సామర్థ్యాన్ని కోల్పోతున్నారు. మనకున్న వనరుల్లోనే కొద్దిపాటి నిధుల్ని పెంచి, సరైన పద్ధతుల్లో ఖర్చు చేస్తే చాలు.. మనం దేశంలో పేదరికాన్ని చాలామేర పారదోలవచ్చు, ఉత్పాదక సామర్థ్యాన్ని పెంపొందించవచ్చు.

మరోపక్క ప్రభుత్వాల విధానాల్లో ప్రజల ఆకాంక్షలకు తగిన ప్రాధాన్యత లభించకపోవటం, అమలు అధ్వాన్నంగా ఉండటం.. భారత్ వంటి ఎంతో వైవిధ్యమున్న దేశంలో సమస్యల్ని గొలుసుకట్టులా కొనసాగిస్తున్నాయి. ప్రజల ఆకాంక్షల పేరుతో ప్రలోభపెట్టే రాయితీల్ని పైనుంచి రుద్దుతున్నారు. జనజీవితంతో సంబంధం లేకుండా రావటం వల్ల పలు చట్టాలు కాగితాలకే పరిమితమై ఆచరణకు నోచుకోవటం లేదు. ప్రజల అవసరాలకు, ఆకాంక్షలకు తగ్గ పాలన లభించాలంటే స్థానిక ప్రభుత్వాలకు సాధికారతనిచ్చే మూడో అంచె ఫెడరలిజం అవసరం. బలమైన స్థానిక ప్రభుత్వాలు ఎన్నికలకు మధ్యకాలంలో కూడా ప్రజల పాత్ర ఉండేందుకు దోహదం చేస్తాయి. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య అంతరాలు తొలగించేలా చేయటం, ప్రజలకు సేవలు అందుబాటులో ఉండేలా చూడటం ప్రజాస్వామ్యంలో రాజ్యవ్యవస్థ చేయాల్సిన ముఖ్యమైన పని. చరిత్రలో మొట్టమొదటిసారిగా భారతదేశాన్ని ఒక జాతిగా ఏకం చేసిన మహాత్మాగాంధీ కూడా ఐక్యత అంటే మూసపోసిన ఏకత్వం కాదని గుర్తించారు కాబట్టే, వైవిధ్యాన్ని, స్థానికతను గౌరవించారు కాబట్టే జాతి నిర్మాణం చేయగలిగారు. మితిమీరిన కేంద్రీకృత పాలన స్థానంలో బలమైన స్థానిక ప్రభుత్వాలున్న సమాఖ్య వ్యవస్థను నెలకొల్పితే ప్రజల అవసరాలు, ఆకాంక్షలు ప్రతిఫలించే చట్టాలు రూపొందుతాయి, తాగునీరు, పారిశుద్ధ్యం, శాంతి భద్రతలు, పాఠశాల విద్య, ఆరోగ్యం, వ్యాధుల నివారణ, పర్యావరణ పరిరక్షణ వంటి నిత్యావసరాలు సవ్యంగా నెరవేరతాయి. ప్రజలకు సాధికారత, భాగస్వామ్యం ఉంటే గొప్ప పరిజ్ఞానం, నైపుణ్యాలు లేకున్నా కూడా అద్భుతాలు సృష్టించగలరనటానికి 1986 ప్రాంతంలో జిల్లా కలెక్టర్‌గా లోక్‌సత్తా జేపీ నేతృత్వంలో సాగునీటి రంగంలో ప్రకాశం జిల్లా సాధించిన అద్భుత విజయమే నిదర్శనం. జనం చేతికి జవాబుదారీతనంతో అధికారం ఇవ్వటం వల్ల అలవోకగా సాధ్యమయ్యే అసాధారణస్థాయి ఫలితాలకు ఓ గొప్ప కేస్ స్టడీగా ఇది భారత ప్రజాస్వామ్య చరిత్రలో నిలిచిపోతుంది.

అలాగే ప్రజల సులభతర జీవితానికి, దేశంలో సులభతర వాణిజ్యానికి ప్రధాన అవరోధంగా ఉన్నది మన ప్రభుత్వోద్యోగ వ్యవస్థలో పాతకుపోయిన అవినీతి! అనేక దేశాలు ఆ సమస్యను తగిన చట్టాలు, వ్యవస్థలతో అదుపు చేయగలిగాయి. ఆ దేశాల్లో కంటే మన ప్రజలేమీ తక్కువ నిజాయతీపరులు కాదు. మన ప్రభుత్వోద్యోగుల్లో కూడా పలువురు వ్యక్తిగత నిజాయతీ కలిగినవారే. కానీ వలసకాలపు నాటి ప్రభుత్వోద్యోగ్య వ్యవస్థను సంస్కరించి ప్రజలను లంచాల బారి నుంచి రక్షించే చట్రాన్ని మన ప్రభుత్వాలు ఇంతవరకూ సమగ్రంగా నిర్మించలేకపోయాయి. ఎన్నో ఏళ్లుగా ప్రపంచ దేశాల అనుభవాలు మనకు ఉదాహరణగా కనిపిస్తున్నా, మనం నేర్చుకున్నది, అమలు చేసింది బహు స్వల్పం. పెట్టుబడులు పెట్టటానికి వచ్చేవారు ఇక్కడి అధికార నిబంధనలు, వాటిని అడ్డం పెట్టుకుని లంచాలకు చేస్తున్న డిమాండ్లను చూసి ఎందుకొచ్చిన గొడవని పొరుగు దేశాలకు మళ్లుతున్నారు. లైసెన్స్ రాజ్ ఆనవాయితీల్ని, ఆంక్షల్ని పూర్తిగా ఎత్తివేసి అవినీతికి

అస్కారం లేని పద్ధతుల్ని అధికార యంత్రాంగంలో ప్రవేశపెట్టాలి. మరోవైపు, ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి కోట్లాది భారతీయుల రోజువారీ జీవితాల్ని దుర్భరం చేస్తోంది. ఓ పక్కన పన్నులు కడుతూ, మరోపక్క ఒక్కో పనికి అదనంగా ఫీజు చెల్లిస్తున్నా కూడా ప్రభుత్వ కార్యాలయాల్లో పనికి లంచాలివ్వాల్సి వస్తోంది. అవమానాలు, వేధింపులు, జాప్యాల్ని భరించాల్సి వస్తోంది. ప్రతి పనికీ సిటిజన్స్ చార్టర్లను ఏర్పాటు చేసి గడువులోగా ప్రజల దరఖాస్తుల్ని పరిష్కరించాలి, గడువు దాటితే రోజుకు ఇంతని పరిహారం చెల్లించాలి. ఇలా హక్కుగా ప్రభుత్వ కార్యాలయాల్లో సేవలకు తగిన చట్టబద్ధ ఏర్పాట్లు చేయాలి.

ఇక చట్టబద్ధపాలన బాధ్యతలో ప్రభుత్వాలు విఫలమవుతుండటం వల్ల మన దేశం ఆర్థికంగా, సామాజికంగా కూడా చాలా మూల్యం చెల్లిస్తోంది. జనాభాలో సగభాగమున్న మహిళలు స్వేచ్ఛగా విద్య, ఉపాధి అవకాశాలను అందుకోలేకపోతున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ పట్ల ప్రజల్లో నమ్మకం సడలుతోంది. ప్రజలకు వేగంగా, చౌకంగా, సులభంగా, గౌరవప్రదంగా న్యాయం అందించటానికి పోలీసు, ప్రాసిక్యూషన్, న్యాయవ్యవస్థల్లో తక్కువ ఖర్చుతో, ఆమోదయోగ్యమైన రీతిలో ఎలాంటి మార్పుల్ని తక్షణం తీసుకురావచ్చో తెలియజేస్తూ ఇటీవల ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా ఆధ్వర్యంలో ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ), యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (హెచ్‌సీయూ) భాగస్వామ్యంతో 'ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్' వేదికగా జరిగిన 9 రోజుల సదస్సు 'చట్టబద్ధపాలనపై హైదరాబాద్ డిక్లరేషన్ 2021'ను వెలువరించింది. ఈ సంస్కరణల్ని అమలు చేస్తే ప్రజల వ్యక్తిగత భద్రత, ఆదాయావకాశాలకు, సామాజిక స్థిరత్వానికి కనీస భరోసా లభిస్తుంది.

ఎలాగోలా ఎన్నికల్లో గెలవటం, అధికార కేంద్రీకరణ, పెత్తందారీ పాలన మన రాజకీయానికి జన్యులక్షణాల్లా కొనసాగుతుండటంతో.. పోలీసు స్టేషన్లు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు చేసి పెట్టేందుకు చట్టసభ సభ్యులు ప్రభుత్వ వ్యవస్థలో జోక్యం చేసుకుంటున్నారు. ఈ వైకల్యం సర్కారీ కార్యాలయాల్లో అవినీతి జాడ్యాన్ని కొనసాగిస్తుండటంతోపాటు.. రాజకీయ అవినీతికి, ఎన్నికల్లో నల్లధనానికి కూడా కారణమవుతోంది. ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక వంటి ఎన్నికల సంస్కరణల్ని కూడా తీసుకురాగలిగితే ప్రభుత్వ కార్యాలయాల ప్రక్షాళన జరగటంతోపాటు స్థానిక ప్రభుత్వాలు, చట్టబద్ధపాలన పటిష్ఠమవటానికి సైతం అవరోధాలు తొలగుతాయి.

ఉపాధి అవకాశాలకు ఎంతో కీలకమైన మౌలిక సదుపాయాల విషయానికొస్తే, 49 పెద్ద దేశాలతో పోలిస్తే భారత్ అట్టడుగు 5 స్థానాలలో ఉంది. మంచినీరు, పారిశుద్ధ్యం, వరదనీటి పారుదల, మురుగునీటి పారుదల, విద్యుత్తు, రోడ్లు, రవాణా– అన్నిట్లో భారత్ ప్రగతి అధ్వాన్నంగా ఉంది. అయిదేళ్లలో మౌలిక వసతుల ఏర్పాటుకు 13 కీలక రంగాల్లో రూ. 2,00,000 కోట్ల దాకా ఈ ఏడాది బడ్జెట్‌లో కేటాయించటం ఓ పెద్ద అడుగు. మౌలిక వసతుల రంగానికి నిధులు సమకూర్చటం కోసం డెవలప్‌మెంట్ ఫైనాన్స్ ఇన్‌స్టిట్యూషన్ (డీఎఫ్‌ఐ)ను జవసత్వాలతో పునరుజ్జీవింప చేయటం కూడా సానుకూల చర్య. జాతీయ మౌలిక వసతులు, అభివృద్ధి పెట్టుబడుల బ్యాంకు (నేషనల్ బ్యాంక్ ఫర్ ఫైనాన్సింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్‌మెంట్ – నాబ్‌ఫిడ్)కు పార్లమెంటు ఆమోదం తెలిపింది. ఈ బ్యాంకు నేరుగా రిజర్వుబ్యాంకు నుంచి రుణాల్ని పొందుతుంది. ప్రభుత్వం రూ. 5,000 కోట్లు గ్రాంట్‌గా ఇవ్వటంతోపాటు రూ. 20,000 కోట్లు పెట్టుబడి పెడుతుంది. ఈ నేపథ్యంలో 2024 సంవత్సరం నాటికి 7671 మౌలిక ప్రాజెక్టుల్లోకి 111 లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడిగా ప్రవహిస్తాయని మోదీ ప్రభుత్వం లెక్కలేస్తోంది. అయితే ప్రభుత్వ అంచనా పొల్లుపోకుండా ఆచరణలోకొచ్చినా కూడా.. డిమాండ్‌తో పోలిస్తే ఈ సప్లయ్ పంటి కిందకు కూడా ఆనదు. ఒక స్పష్టమైన విశ్వసనీయ రోడ్‌మ్యాప్‌తో మౌలిక వసతుల్లోకి పెద్దఎత్తున ప్రయివేటు పెట్టుబడులు ప్రవహించేలా సంస్కరణలు తేవటం అవసరం. ఈ సదుపాయాల కల్పనలో పర్యావరణాన్ని కూడా పరిగణలోకి తీసుకుని కాలుష్యరహితానికి నూతన సాంకేతికతలను వినియోగించటం ప్రభుత్వం చిత్తశుద్ధితో చేయాలి.

ఎటువంటి ప్రత్యామ్నాయం చూపకుండా, ఏదో గాల్లో నుంచి అద్భుతం జరుగుతుందన్నట్లు భ్రమింప చేసే రాజకీయ క్రీడను సాగించకుండా రాజ్య వ్యవస్థ చేయాల్సిన ఈ పనుల మీద దృష్టి పెట్టి ఉంటే.. దేశంలో 1991 నుంచి మొదలైన ఆర్థిక సంస్కరణలు అనేకరెట్లు ఎక్కువ ఫలితాల్ని ఇచ్చి ఉండేవి. హరిత విప్లవం, పాల వెల్లువ లాగా పేదరికాన్ని తుడిచిపెట్టి అందరికీ ఎదిగే అవకాశాలనిచ్చే పెద్ద వెల్లువలాంటి పరిణామమేదీ దేశంలో చోటు చేసుకుని ఉండేది. కేవలం రాజ్య వ్యవస్థ పాత్రను సక్రమంగా నిర్వచించుకుని, సరైన ఆలోచనలతో నిధుల వినియోగం వల్లే మనకంటే వనరుల్లో ఎంతో వెనుకబడిన జపాన్ వంటి దేశాలు మన కళ్ల ముందే సంపన్న దేశంగా ఎదిగాయి.

రాజ్య వ్యవస్థ ఈ పనుల్ని– ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్య, ప్రతి కుటుంబానికీ మంచి ప్రమాణాల ఆరోగ్యం, ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు, వేధింపులు లేని సేవలు, చట్టబద్ధపాలన, పర్యావరణహిత మౌలిక వసతులు, స్థానిక సాధికారతతో జనం చేతికి అధికారం ఇస్తే ప్రజలకు నివారించదగ్గ బాధలు చాలావరకు తొలగిపోతాయి, వివక్ష లేకుండా ఎదిగే అవకాశాలు అందరికీ అందుబాటులోకి వస్తాయి, ప్రజాస్వామ్యం పటిష్టంగా వేళ్లూనుకుంటుంది. ప్రభుత్వాలు ప్రభుత్వ రంగ సంస్థల పేరుతో వ్యాపారం చేయాల్సిన అవసరం లేకుండానే పన్నుల డబ్బు ద్వారా పాలనకు కావలసిన ఆదాయం ఆరోగ్యకరంగా సమకూరుతుంది. సంపద సృష్టించేది ప్రభుత్వం కాదు ప్రజలు! సాంకేతిక ఆర్థికవృద్ధి

పెరుగుతున్నకొద్దీ పన్నుల ఆదాయానికి గ్యారంటీ పెరుగుతుంది. ప్రభుత్వం తాను చేయాల్సిన ఈ పనులు చేయకుండా, తన వనరుల్ని ఇందుకోసం వినియోగించకుండా.. ప్రభుత్వ రంగంలో పనిచేసే కొద్దిశాతం మంది ప్రయోజనాలను అవాస్తవిక స్థాయిలో పరిరక్షిస్తే సామాజిక విప్లవం సంభవిస్తుందనే అసంబద్ధ వాదనల్ని ఇకనైనా మనం వదిలించుకోవాలి. ప్రయివేటు రంగం వల్ల ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయని వాదిస్తున్నవారు.. ప్రభుత్వోద్యోగులకు– ఈ దేశంలోని 90 శాతం మంది ప్రజలకు మధ్య తీవ్ర అంతరం ఎందుకుందో కూడా గుర్తించాలి. వ్యక్తుల నుంచి సమాజాన్ని కాపాడేందుకు ప్రయివేటు గుత్తాధిపత్యాలను నియంత్రించగలిగే శక్తి నాణ్యమైన పన్నుల ఆదాయంతో పనిచేసే, చట్టబద్ధపాలన అమలు చేసే ప్రభుత్వాలకు ఉంటుంది. కానీ ప్రభుత్వంలోని వారి ప్రయివేటు సంస్థలుగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థల వల్ల ప్రజల పన్నుల డబ్బు దుర్వినియోగమైతే అది సుపరిపాలనపై తీవ్ర దుష్ప్రభావం చూపుతుంది. ప్రభుత్వ రంగంలోని వారు కావచ్చు, ప్రభుత్వ కార్యాలయాల్లోని ఉద్యోగులు కావచ్చు.. వారికి అపరిమిత రక్షణ, మిగిలిన 90 శాతం మంది ప్రజలకు సంక్షేమం పేరుతో తాయిలాలు అనే ఫార్ములాకు ఇండియా స్వస్తి చెప్పాలి. ప్రభుత్వ వైఫల్యం వల్లే సమస్యలు అని స్పష్టంగా కనిపిస్తున్నా, మళ్లీ ప్రభుత్వమే అన్నీ చేయాలనటం.. ప్రభుత్వ రంగంలో ఉంటే ఎంత విఫల వ్యక్తులనయినా నెత్తిన పెట్టుకోవటం, ప్రయివేటు రంగంలో అంతకంటే సమర్థవంతంగా, నిజాయతీగా పనిచేస్తున్నా, పన్నులు కడుతున్నా వారిని పాపాత్ముల్లా చూడటం అనే అపరిపక్వ భావజాలాన్ని మనం అధిగమించాలి. ఏ పనీ చేయలేని నిస్సహాయులకు ప్రభుత్వం అన్నీ ఉచితంగా ఇవ్వటం వేరు, ఉపాధిని కల్పించే సమర్థతలేక ఉచితాల్ని, ప్రలోభాల్ని అమలు చేయటం వేరు. అందరికీ ప్రభుత్వోద్యోగాలుండవు కాబట్టి.. ప్రభుత్వోద్యోగుల ప్రయోజనాలు, ప్రభుత్వ రంగ సంస్థల నిర్వహణ.. ఈ దేశంలోని అత్యధిక శాతం ప్రజల, ఏటా 1 కోటీ 30 లక్షల దాకా ఉద్యోగావకాశాల కోసం కొత్తగా వస్తున్న యువత ప్రయోజనాలకు భంగం కలిగించని రీతిలో ఉండాలి. అందుకు అవరోధమైతే ప్రభుత్వ రంగ సంస్థల్ని అమ్మటానికి సంకోచించనక్కర్లేదు. ప్రభుత్వాలు తాము చేయాల్సిన మౌలిక బాధ్యతలను విస్మరించి వ్యాపారాల్లో తలదూర్చటం అర్థరహితమని లోక్‌సత్తా ఎప్పటి నుంచో చెబుతోంది. అందుకే కొన్ని వ్యూహాత్మక రంగాలు తప్ప మిగిలిన ప్రభుత్వ రంగ సంస్థల నుంచి వాటాలను ఉపసంహరించుకుంటామని ఇటీవల ఎన్‌డీయే ప్రభుత్వం చేసిన ప్రకటనను స్వాగతించింది. మనం ప్రభుత్వం చేయాల్సిన పనులు, మన డబ్బు అందుకు సద్వినియోగం కావటం గురించి, తద్వారా మానవ వనరుల అభివృద్ధి గురించి మాట్లాడకుండా కొద్దిమంది అహేతుక ప్రయోజనాలు, తాత్కాలిక తాయిలాల గురించి మాత్రమే డిమాండ్లు చేస్తుంటే ప్రజాప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలిగించినవారమవుతాం. తమ బిడ్డల భవిష్యత్తు గురించి స్పష్టతతో ఆలోచిస్తే ప్రభుత్వరంగ ఉద్యోగులు కూడా ఈ వాస్తవాల్ని గుర్తించి మద్దతిస్తారు.

"వ్యాపారాలను ప్రోత్సహించటం తప్ప, వ్యాపారం చేయటం ప్రభుత్వ విధి కాదు. యువ అధికారుల ప్రతిభను ప్రభుత్వ సంస్థల నిర్వహణ పేరిట వృథా చేస్తున్నట్లుగా అనిపిస్తోంది. ప్రజాసంక్షేమం చూడటమే సర్కారు ప్రథమ ప్రాధాన్యం. 50–60 ఏళ్ల క్రితం ప్రభుత్వ రంగ సంస్థలు స్థాపించిన నాటి పరిస్థితులు వేరు. కాలానికి అనుగుణంగా వీటిలో సంస్కరణలు తీసుకురావాలి. ప్రజాధనాన్ని సద్వినియోగం చేయడమే మా లక్ష్యం. దేశాన్ని వృద్ధి ప్రస్థాన దిశగా తీసుకెళ్లేందుకు స్పష్టమైన మార్గసూచీని బడ్జెట్ ఇచ్చింది.

"కొన్ని ప్రభుత్వ రంగ సంస్థలు నష్టాలను చవిచూస్తున్నాయి. వాటిలో కొన్నింటికి పన్ను చెల్లింపుదారుల డబ్బు ద్వారా మద్దతు ఇవ్వాల్సి ఉంటుంది. పేదలు హక్కుదారులుగా ఉన్న డబ్బును పీఎస్‌యూల కోసం వెచ్చించాల్సి వస్తుంది. ఆర్థిక వ్యవస్థపై అధిక భారం పడుతుంది. చాలా సంవత్సరాల నుంచి నడుస్తున్నాయనో, కొందరి కలల ప్రాజెక్టులనో చెప్పి పీఎస్‌యూలను కొనసాగించరాదు. ప్రభుత్వం స్వయంగా సంస్థలను నడపటం, వాటికి యజమానిగా ఉండటం ప్రస్తుత కాలంలో అవసరం లేదు. అది సాధ్యం కూడా కాదు. ప్రభుత్వమే వ్యాపారం చేయటం ప్రారంభిస్తే కొన్నిసార్లు నష్టాలకూ దారితీస్తుంది. అందువల్ల ప్రభుత్వం వ్యాపారంలో ఉండరాదు. 1) అణు ఇంధనం, అంతరిక్షం, రక్షణ 2) రవాణా – టెలికమ్యూనికేషన్లు 3) విద్యుత్తు, పెట్రోలియం, బొగ్గు, ఇతర ఖనిజాలు 4) బ్యాంకింగ్, బీమా, ఆర్థిక సేవలు.. ఈ నాలుగు రంగాల్లో మాత్రమే ప్రభుత్వ వాటా వీలైనంత కనిష్ఠ స్థాయిలో ఉంటుంది. ప్రజాధనం సద్వినియోగమే లక్ష్యంగా సంస్కరణలు చేపట్టటం అవసరం" అని ఇటీవల ప్రధాని విస్పష్టంగా ప్రకటించారు.

ఇప్పుడున్న పరిస్థితుల్లో మౌలిక వసతులు వంటి కీలక రంగాల్లో భారీ ఊపు తేవాలంటే.. వ్యవసాయ సంస్కరణలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాల వ్యూహాత్మక ఉపసంహరణ వంటి చర్యల ద్వారా ప్రయివేటు పెట్టుబడులను సేకరించటం తప్ప ప్రభుత్వానికి మార్గం కూడా లేదు.

పెట్టుబడుల ఉపసంహరణపై ప్రభుత్వ విధానాన్ని తప్పు పట్టటం కంటే, విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించటం ద్వారా, పెట్రో ధరల పెంపు ద్వారా, ఇతరత్రా ఖజానాకు సమకూరిన మన డబ్బుని ఉచితాలు, ప్రభుత్వ రంగ సంస్థల నష్టాలు పూడ్చటం వంటి దుబారాలు, వృథాల పాలు చేయకుండా పైన పేర్కొన్న మౌలిక బాధ్యతలు, ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాల్ని, యువతకికఆదాయాల్ని ఇచ్చే ఇతర ఉత్పాదక అంశాల కోసం ఖర్చు చేసేలా చూడటం ఎంతో ముఖ్యం. ఉదాహరణకు, పెట్రోలు, డీజిల్‌లపై జాతీయ స్థాయి ప్రభుత్వానికి వచ్చే ఆదాయం గత ఏడేళ్లలో 556 శాతం మేర పెరిగింది. సహజ వాయువుపై వేసిన పన్నును కూడా కలిపితే

## స్టీల్‌ప్లాంట్ నిర్వాసితుల ప్రయోజనాల్ని కాపాడటంలో కీలక పాత్ర పోషించిన జేపీ



విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ నిర్వాసితులకప్రయోజనాలను కాపాడటంలో, వారికి ఉద్యోగాలిప్పించటంలో కీలక పాత్ర పోషించారు లోక్‌సత్తా జయప్రకాష్ నారాయణ్! ఆనాడు ప్రత్యేక అధికారిగా ప్లాంట్‌కు భూ సేకరణ చేయటంతోపాటు ఆ భూమికి న్యాయమైన పరిహారం ఇవ్వాలని పోరాడారాయన. అప్పట్లో భూసేకరణ అంటే ప్రభుత్వం ఎవరి భూమినైనా లాక్కోవటం, నామమాత్రపు డబ్బు విదల్చటం తప్ప.. న్యాయంగా బేరీజు వేసి పరిహారం చెల్లించటమన్నదే లేదు. అలాంటి పరిస్థితుల్లో నిర్వాసితుల ప్రయోజనాల్ని పరిరక్షించేందుకు జేపీ ఫైళ్లు పట్టుకుని గుమాస్తా నుంచి ముఖ్యమంత్రి దాకా తిరుగుతూ రాత్రింబవళ్లు శ్రమించారు. ఒక్కోసారి ఆయా కార్యాలయాల్లో బంట్రోతులు కూర్చునే పీట మీద కూర్చుని వేచిచూడాల్సి వచ్చేది. నిర్వాసితుల భూములకు గరిష్ఠ ధరను చెల్లించటంతోపాటు వారి కుటుంబంలో ఒకరికి ప్లాంట్‌లో ఉద్యోగం కూడా ఇవ్వాలని జేపీ వాదించారు. చదువులేని వాళ్లను ఎట్లా తీసుకుంటామన్న ప్లాంట్ ఉన్నతాధికారుల ధోరణిపై పోరాడి నిర్వాసితులకు ఉచితంగా శిక్షణనిచ్చి మరీ ఉద్యోగంలోకి తీసుకునేలా ఒప్పించారు. దీనివల్ల స్టీల్‌ప్లాంట్‌కు భూములిచ్చినవారికి అప్పట్లో అత్యధిక పరిహారం దక్కటంతోపాటు, దాదాపు 8,000 మంది యువతకు ప్రత్యేక శిక్షణ అనంతరం విశాఖ ఉక్కు కర్మాగారంలో ఉద్యోగాలు లభించాయి. వేల మందికి జీవన భద్రత, ఎదిగే అవకాశాలు లభించాయి.. స్టీల్‌ప్లాంట్, ఉద్యోగుల ప్రయోజనాలపై జేపీ కంటే ఎవరికి ఎక్కువ పట్టింపు ఉంటుంది! జయప్రకాష్ నారాయణ్ చెబుతున్నట్లు రాజ్య వ్యవస్థ వ్యాపారాల నుంచి వైదొలిగి తాను చేయవలసిన పనుల్ని సక్రమంగా చేయటం మీద దృష్టి కేంద్రీకరించటం వల్ల.. ప్రభుత్వ రంగ ఉద్యోగులకు దీర్ఘకాలంలో ఇంకా ఎక్కువ లాభమే సమకూరుతుంది తప్ప నష్టం ఉండదు.

మొత్తం ఎక్సయిజ్ సుంకం ద్వారా 2014-15లో రూ. 74,158 కోట్ల ఆదాయం రాగా, ఈ ఆర్థిక సంవత్సరంలో జనవరి నాటికే అది రూ. 2,95,000 కోట్లకు పెరిగింది. పెట్రో ఉత్పత్తులపై 2015-16లో రూ. 1,55,638 కోట్లు, 2016-17లో 2,17,488 కోట్లు, 2017-18లో 2,04,910 కోట్లు, 2018-19లో 1,54,178 కోట్లు, 2019-20లో 2,03,010 కోట్లు ఆదాయం వచ్చిందని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. రాష్ట్రాల ఆదాయాల్ని కూడా కలిపి చూస్తే.. 2016 నుంచి 2020 వరకు పెట్రోలియం రంగం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఖజానాలకు ఏటా సుమారు అయిదున్నర లక్షల కోట్ల రూపాయలు సమకూరుతున్నాయి. కానీ ఇదే కాలంలో దేశంలో జరిగిన అభివృద్ధిని చూస్తే మాత్రం, ఈ డబ్బంతా ఏమయిందన్న విస్మయం కలుగక మానదు.

మనం ఇకనైనా పాత ఆలోచనలు, యాంత్రిక నినాదాల్ని పక్కనపెట్టి తెల్ల కాగితం మీద రాతలా వర్తమాన పరిస్థితులు, భవిష్యత్ అవసరాల దృష్టితో సరైన ఎజెండాను గుర్తించటం, దాని చుట్టూ వనరుల్ని, రాజకీయాన్ని తిప్పే నాయకత్వ సామర్థ్యాన్ని ప్రదర్శించటం అవసరం. ✦

## పెట్టుబడుల ఉపసంహరణలో విశ్వసనీయత ముఖ్యం: పార్లమెంటు స్థాయీ సంఘం

ప్రభుత్వరంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ విశ్వసనీయంగా, ప్రయోజనకరంగా, పారదర్శకంగా జరగాలని భారత ఆర్థిక శాఖ పార్లమెంటు స్థాయీ సంఘం తన నివేదికలో పేర్కొంది. ఇందుకు శాశ్వత ప్రాతిపదికన పెట్టుబడుల ఉపసంహరణ విధానాన్ని ఖరారు చేసి, అందులో స్పష్టమైన కొలమానాలను నిర్దేశించాలని ప్రతిపాదించింది. ముఖ్యంగా ప్రపంచస్థాయి అత్యుత్తమ పెట్టుబడుల ఉపసంహరణ విధానాన్ని అనుసరించాలని సూచించింది. "జాతీయ స్థాయి ప్రభుత్వం 2021-22 బడ్జెట్‌లో ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణకు సంబంధించి విధాన ప్రకటన చేసింది. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్), ఎయిర్ ఇండియా, షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, కంటెయినర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, బీఈఎంఎల్, పవన్‌హన్స్, నీలాంచల్ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్‌ల నుంచి పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 1.75 లక్షల కోట్లు సేకరించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకొంది. ఎల్ఐసీలో వాటాల విక్రయం (ఐపీవో).. రెండు ప్రభుత్వరంగ బ్యాంకులు, ఒక జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రయివేటీకరణ.. మిగులు భూముల విక్రయం (మానిటైజేషన్) చేపట్టేందుకు కంపెనీ రూపంలో ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని కూడా ప్రభుత్వం సంకల్పించింది. బడ్జెట్ అంచనాలు వాస్తవం కావడానికి విశ్వసనీయరీతిలో పెట్టుబడుల ఉపసంహరణ చాలా ముఖ్యం" అని స్థాయీ సంఘం పేర్కొంది.

# వ్యవసాయాన్ని వ్యాపారంగా మార్చటం వల్లే
# ఇజ్రాయెల్ రైతుకి అంత భరోసా!

- అమిర్నేని హరికృష్ణ, సీనియర్ జర్నలిస్టు



ఉత్పత్తికి విలువ చేకూర్చితే అదనపు ఆదాయానికి అవకాశాలుంటాయి. వ్యవసాయోత్పత్తులకు విలువ జోడింపు జరగక భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో రైతులకు స్థిరమైన ఆదాయం లభించడం లేదు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు విస్తరించిన కొద్దీ సహజంగా వ్యవసాయరంగానికి, అంతిమంగా సగటు రైతులకు మంచి ధరలు వస్తాయి. సేద్యంలో ఇటువంటి పరిశ్రమలు విస్తరిస్తున్నప్పుడు రైతులెంతగానో లాభపడతారు. ఆగ్రోప్రాసెసింగ్ పరిశ్రమల స్థాపన విషయంలో శ్రద్ధ చూపకపోవడం వల్ల భారత్‌లోని మొత్తం వ్యవసాయోత్పత్తిలో కేవలం 7 శాతం పంటకే మనం విలువ జోడించగలుగుతున్నాం. ఇది చైనాలో 23 శాతం, ఫిలిప్పైన్స్‌లో 45 శాతం, బ్రిటన్‌లో 188 శాతం ఉండగా ఇజ్రాయెల్ అగ్రస్థానంలో ఉంది. ఒక్క పాడిపరిశ్రమలోనే ఇజ్రాయెల్ వెయ్యి రకాల ఉప ఉత్పత్తులను ప్రాసెస్ చేస్తూ లాభాలు గడిస్తోంది. ఇజ్రాయెల్‌లోని కిబుట్జ్ రైతు సహకార సంఘాలే విలువ జోడింపుతో నేరుగా విదేశాలకు ఎగుమతులు చేస్తూ అపార ఆదాయాలను పొందుతున్నాయి.

- 2017 గణాంకాల ప్రకారం ఇజ్రాయెల్ మొత్తం వ్యవసాయ ఎగుమతులు 2199 మిలియన్ డాలర్లు.
- ఆహారశుద్ధి పరిశ్రమ ద్వారా ఇజ్రాయెల్ ఏటా ఐదు వేల రకాల కొత్త ఉత్పత్తులను మార్కెట్ చేస్తోంది.
- 2016 లెక్కల ప్రకారం ఇజ్రాయెల్ ఆహారశుద్ధి పరిశ్రమ వర్గాల సాలుసరి ఆదాయం 15.9 బిలియన్ డాలర్లు.
- 2017లో 55.9% వ్యవసాయోత్పత్తుల్ని ఇజ్రాయెల్ ప్రధానంగా యూరోపియన్ యూనియన్ (ఇ.యు)కి ఎగుమతి చేసింది (18.3 బిలియన్ డాలర్ల విలువ).
- 2017 లెక్కల ప్రకారం ఇజ్రాయెల్ మొత్తం ఎగుమతుల్లో డైమండ్స్ (12.3 బిలియన్ డాలర్ల విలువ కలిగినవి) 20.1 శాతం.
- కంప్యూటర్లు, ఎలక్ట్రానిక్, ఆప్టికల్ ప్రొడక్ట్స్ (10.5 బిలియన్ డాలర్ల విలువ) 17.2 శాతం.
- రసాయనాలు, రసాయన ఉత్పత్తులు (7.8 బిలియన్ డాలర్ల విలువ) 12.7 శాతం.
- ఔషధాలు (7.5 బిలియన్ డాలర్ల విలువ) 12.3%.

ఇజ్రాయెల్ పంటలసాగు మొత్తంలో కూరగాయల వాటా 28 శాతం, గోధుమ వంటి సాధారణ పంటలు 18 శాతం, పండ్లు 15 శాతం, ఆక్వారంగం వాటా 2 శాతం ఆక్రమిస్తున్నాయి. మరో 17 శాతం డెయిరీ, మాంసం ఉత్పత్తులు ఉన్నాయి. 2016 లెక్కల ప్రకారం ఇజ్రాయెల్ మొత్తం ఉత్పత్తిలో నిమ్మజాతి సహా పండ్లు 48 శాతం, కూరగాయలు 30.5 శాతం, ఇతర పంటలు

16 శాతం, పూలు, తోట పంటలు 5.5 శాతం ఆక్రమిస్తున్నాయి. ఇజ్రాయెల్ మొత్తం ఎగుమతుల్లో దాదాపు 68 శాతం అమెరికా, యూరోప్, కెనడా, మెక్సికోలకు చేస్తోంది. 16 శాతం ఆసియాకు ఎగుమతవుతాయి. అదే సమయంలో అవసరమైన ఉత్పత్తుల్ని దిగుమతి చేసుకుంటారు. 1960 నుంచి కట్‌ఫ్లవర్స్‌ను ఎగుమతి చేస్తున్న ఇజ్రాయెల్, యూరోప్‌కు ప్రధాన కట్‌ఫ్లవర్స్ సరఫరాదారుగా నిలిచింది. ఇజ్రాయెల్ ప్రధానంగా పాలిష్ చేసిన డైమండ్స్, నిమ్మజాతి, ఇతర పండ్లు, వస్త్రాలు, ఎరువులు, రసాయన ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేస్తోంది. ఉప్పునీటి నుంచి ఉప్పును వేరుచేసే ప్రక్రియ చాలా ఖర్చుతో కూడిన పని. నెగెవ్ ఎడారి ప్రాంతంలో రైతులు ఈ నీటితోనే అద్భుతాలు సాధిస్తున్నారు. శాస్త్రవేత్తలు సృష్టించిన పరిజ్ఞానంతో ఇలా శుద్ధి చేసిన నీటితోనే మొక్కలకు పోషకాలు అందేలా చేసి బ్రాకిష్ వాటర్‌తో ఎడారి వ్యవసాయాన్ని సుసంపన్నం చేశారు. ముఖ్యంగా ఈ ఎడారిలో పండే టమాటోలకు యూరోపియన్ మార్కెట్లలో మంచి గిరాకీ ఉంది. ఇవి ప్రత్యేక రుచి కలిగి ఉండటమేగాక కనీసం నెల రోజుల పాటు చెడిపోకుండా నిల్వ ఉండే స్వభావాన్ని కలిగి ఉంటాయి. ఏటా ఇజ్రాయెల్‌లో పండే టమాటోల్లో 50 శాతం ఎగుమతువుతున్నాయంటే వీటి ప్రత్యేకత ఏమిటో అర్థమవుతుంది.

గుడ్లు, బ్రాయిలర్, టర్కీ కోళ్ల మాంసం తలసరి వినియోగంలో ఇజ్రాయెలీలది ప్రపంచ రికార్డు. దేశంలో ఏటా 1.75 బిలియన్ గుడ్లు, 4.30 లక్షల టన్నుల కోళ్ల మాంసం ఉత్పత్తవుతోంది. టర్కీ మాంసం లక్ష టన్నులుగా ఉంది. మొత్తం వ్యవసాయ ఎగుమతుల్లో 29 శాతం పూలదే. ఏటా ఇజ్రాయెల్ 53 మిలియన్ డాలర్ల విలువైన పూలను ఎగుమతి చేస్తోంది. ఏటా 2 బిలియన్ డాలర్ల విలువైన కూరగాయల్ని ఉత్పత్తి చేస్తోంది. దేశంలో మొత్తం కూరగాయల ఉత్పత్తి అరవలోయ, నెగెవ్ ఎడారి ప్రాంతం నుంచి వస్తోంది. అలానే 90 శాతం పుచ్చపంట అరవ ప్రాంతం నుంచే వస్తోంది.

ఇజ్రాయెల్ రైతుల కోసం విదేశీ దిగుమతిదారులు పోటీ పడుతుంటారంటే అతిశయోక్తి కాదు. తాము కోరుకున్నరీతిలో ఉత్పత్తిని అదే నాణ్యతతో అందించే రైతులంటే ఎందుకు ఇష్టపడరు? అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాలను అత్యుత్తమ స్థాయిలో అందుకునే ఇజ్రాయెల్ రైతులంటే యూరోప్, అమెరికా తదితర దేశాలకు మక్కువ. వీటికి తోడు ఆయా దేశాలకు తక్కువ ధరలో ఎక్కువ ఉత్పత్తిని ఇచ్చే వంగడాలు, మొక్కలను వీరు సరఫరా చేస్తుంటారు. యూరోప్, అమెరికా దేశాలకు పలు కాలాలలో అన్ని రకాల ఉత్పత్తులు అందుబాటులో ఉండటం కష్టం. దీన్ని గుర్తెరిగి సరిగ్గా అక్కడ గిరాకీ ఉన్న సమయంలో పంట చేతికొచ్చేలా నియంత్రిత ఉష్ణోగ్రతల మధ్య పంటలు సాగుచేస్తారు కాబట్టి ఇజ్రాయెల్ రైతుల్ని పోటీపడి మరీ యూరోప్ వ్యాపారులు సంప్రదిస్తుంటారు.

పాల సగటు దిగుబడిలో ఇజ్రాయెల్ ప్రపంచం కంటే ముందుంది. మామిడిని ఎక్కువగా ఉత్పత్తి చేసే దేశం భారత్. మధురఫలంగా పేరొందిన మామిడిని పండ్లలో రారాజుగా వ్యవహరిస్తారు. ప్రపంచ మామిడి సాగు, ఉత్పత్తిలో భారతదేశం రారాజు. విశ్వవ్యాప్తంగా సుమారు కోటిన్నర టన్నులకు పైగా మామిడి ఉత్పత్తి జరుగుతోంటే అందులో దాదాపు 60 శాతం వరకు అంటే కోటి టన్నుల వరకు భారత్‌లోనే జరుగుతుండటం గమనార్హం. ఇంతకీ ప్రపంచంలో అత్యధికంగా మామిడి ఎగుమతి చేస్తున్న దేశం ఎవరో తెలుసా...? మనం కాదు ఇజ్రాయెల్ అంటే అందరూ ఆశ్చర్యపోవాల్సిందే. కాని ఇది వాస్తవం. ఇంత చిన్న దేశం ప్రపంచంలో అత్యధికంగా మామిడి పండ్లను ఎగుమతి చేయగలుగుతుందంటే ఎగుమతి అవకాశాలను అందిపుచ్చుకోవటంలో వారి చొరవను, కార్యశీలతను అభినందించాల్సిందే.

ప్రపంచ మామిడి ఎగుమతుల్లో ముందున్న దేశంగా ఇజ్రాయెల్ నిలిచిందంటే వారి కృషిని ప్రశంసించాల్సిందే. పంటకోత అనంతరం సాంకేతిక పరిజ్ఞానంపై ఇజ్రాయెల్‌కున్న ఆధిపత్యమే ఇన్ని విజయాలకు కారణం. ప్రపంచంలో 60 శాతం ఉత్పత్తి జరుగుతున్న భారత్ నుంచి సుమారు లక్ష టన్నులు కూడా ఎగుమతి జరగటం లేదంటే అతిశయోక్తి కాదు. విదేశాల నుంచి తీవ్ర గిరాకీ ఉన్నా మన దేశం ఎగుమతుల్ని పెంపొందించుకోవడంలో విఫలం అవుతోంది. ముఖ్యంగా ప్రపంచ మార్కెట్లోకి భారత మామిడి పండ్లు వచ్చే నాటికి మనకు మెక్సికో నుంచి తప్ప ఇతర దేశాల నుంచి పెద్దగా పోటీ కూడా లేదు. భారత్ నుంచి గల్ఫ్ దేశాలకు మాత్రమే మామిడి పండ్లు ఎగుమతి అవుతున్నాయి. ఇజ్రాయెల్, మెక్సికో వంటి దేశాలు యూరోప్, అమెరికా మార్కెట్లపై ఆధిపత్యం సాధిస్తున్నాయి. అమెరికా, యూరోప్ ప్రజల అవసరాలకు తగిన నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ఇజ్రాయెల్ ప్రపంచంలో అత్యధిక మామిడి ఎగుమతిదారుగా అగ్రస్థానంలో నిలిచింది.

పంటకోత అనంతరం సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంలో ఇజ్రాయెల్ తీరే వేరు. ఏ పంటనైనా పాడవకుండా మార్కెట్‌కు తరలించగలిగితేనే మంచి ధర వస్తుంది. ముఖ్యంగా త్వరితంగా పాడయ్యే పండ్లు, కూరగాయల్లో ఇది ఎంతో అవసరం. టమాటో కోశాక 30 నుంచి 40 రోజుల వరకు పాడవకుండా నిల్వ చేసే సాంకేతికతను వాళ్లు సాధించారు. ఈ పరిజ్ఞానం మన దేశంలో రైతు స్థాయికి చేరనందువల్లనే ధర లేనప్పుడు రైతులు మార్కెట్లలోనే టమాటోలను పారబోస్తున్నారు. ఇజ్రాయెల్‌లో ముందుగానే ధర మాట్లాడుకుని శీతలీకరించిన వాహనాల్లో ఉత్పత్తుల్ని స్థానిక, ఎగుమతి మార్కెట్లకు తరలిస్తారు. ఇలా వ్యవసాయాన్ని వ్యాపారంగా మార్చడం వల్లనే ఇజ్రాయెల్ రైతులు నష్టభయం లేకుండా సేద్యం సాగించగలుగుతున్నారు.

**(ఇజ్రాయెల్‌లో వ్యవసాయ పర్యటన అనంతరం రాసిన 'ఎడారిలో ఒయాసిస్సు ఇజ్రాయెల్ వ్యవసాయం' పుస్తకం నుంచి)**


# దేశంలో చట్టబద్ధపాలన కొనసాగుతోందా?

- బండారు రామ్మోహనరావు

న్యాయ, పోలీసు సంస్కరణల ద్వారా దేశంలో సత్వర న్యాయం, ముంగిట న్యాయం అందించినప్పుడు కోర్టుల మీద నమ్మకం పెరుగుతుంది. కోర్టుల సంఖ్యను పెంచాలి. న్యాయమూర్తుల నియామకం నుండి బదిలీల వరకు స్వతంత్ర వ్యవస్థలను అభివృద్ధి చేయాలి. అలాగే పోలీసుల నేర పరిశోధనలో రాజకీయ జోక్యం లేకుండా వేరు చేయాలి. సమస్యను వర్ణించటం కాకుండా సమస్య పరిష్కారం వైపు నుంచి ఆలోచించినప్పుడు సమాజంలో దారుణాలకు తెర పడుతుంది. మంచి పరిష్కారం లభిస్తుంది. లేకపోతే గొంగడిపైనే కూర్చుని వెంట్రుకలు ఏరుతున్నట్టుగానే ఉంటుంది. ప్రస్తుతం గొంగడిని మార్చే ప్రక్రియ కావాలి.




ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో హత్రాస్ అనే పట్టణంలో సరిగ్గా రెండేళ్ల క్రితం 2018లో గౌరవ శర్మ అనే నిందితుడు ఒక దళిత యువతిపై అత్యాచారం చేశాడు. ఆ సంఘటన దేశమంతా సంచలనంగా మారింది. బాధితురాలి కుటుంబం పోలీసుస్టేషన్‌లో దరఖాస్తు ఇచ్చినందుకుగాను నిందితుడు గౌరవ శర్మ అత్యాచార బాధితురాలి కుటుంబానిపై అందరూ చూస్తుండగానే బహిరంగంగా దాడి చేశాడు. ఆ సంఘటనలను పౌర సమాజం ఖండించిన తర్వాత ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం మేల్కొని నిందితుడిని అరెస్టు చేసింది.




ఆ తర్వాత నిందితుడికి బెయిల్ దొరికింది. కోర్టులో కేసు పెడతారా అనే కక్షతో ఆ కుటుంబంపై పగ పెంచుకున్న గౌరవ శర్మ అత్యాచార సంఘటన జరిగిన రెండేళ్ల తర్వాత స్థానిక ఆలయం వద్ద మొన్న 2021 మార్చి 1న అత్యాచార బాధితురాలి తండ్రిని విచక్షణారహితంగా తుపాకితో కాల్చి చంపేశాడు. ఇలాంటి సంఘటనల తర్వాత దేశంలో చట్టబద్ధపాలన ఉందా అనే ప్రశ్న తలెత్తుతుంది. బాధితురాలి కుటుంబాన్ని రక్షించాల్సిన ప్రభుత్వం చోద్యం చూడడం వల్ల ఈ హత్య జరిగింది. దీనికి ఎవరు బాధ్యులు అని ఆలోచిస్తే వ్యవస్థీకృతమైన నేరగాళ్లను పెంచి పోషిస్తున్న రాజకీయమే అని సమాధానం దొరుకుతుంది. రాజకీయం, నేరం కలగలిపి సాగుతున్న ఘనమైన భారత ప్రజాస్వామ్య ప్రస్థానంలో ఇలాంటి సంఘటనలను ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట జరుగుతూనే ఉన్నాయి. సమాజంలో రోజువారీ జరుగుతున్న అనేక అవకతవకలకు, మీడియాలో చూస్తున్న సంఘటనలకు వెనక ఎవరున్నారని సాధారణంగా ఆలోచిస్తే కొంతమంది వ్యక్తులు మాత్రమే కనిపిస్తారు. కొంచెం లోతుగా ఆలోచిస్తే సమాజంలో నేరం, రాజకీయాలు చెట్టాపట్టాలు వేసుకొని కొనసాగిస్తున్న నేరమయ రాజకీయాలు, చట్టబద్ధపాలన లోపించడమే అసలైన కారణంగా కనిపిస్తుంది. పెద్దపల్లి జిల్లా మంథని పట్టణానికి సమీపంలో న్యాయవాద దంపతులు గట్టు వామనరావు, నాగమణిల బహిరంగ హత్య తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్వసనీయతకు ఒక పరీక్షగా మారింది. రాష్ట్ర హైకోర్టు వ్యాఖ్యానించినట్లుగా ఈ హత్యపై సమగ్ర దర్యాప్తు జరిపి దోషులను పట్టుకొని విచారణ జరిపి శిక్షించాలి. పట్టపగలు నడిరోడ్డు మీద చుట్టూ జనం చూస్తుండగా న్యాయవాద దంపతులను అతిదారుణంగా నరికి చంపడం చూస్తే మనం నాగరిక సమాజంలో ఉన్నామా లేక అనాగరిక ఆదిమ కాలంలో ఉన్నామా అనిపిస్తుంది. రాజ్యం ప్రధాన కర్తవ్యం ధన, మాన, ప్రాణ రక్షణ. అది విస్మరించి ప్రభుత్వాలు, రాజకీయ పార్టీల నాయకులు తమ స్వప్రయోజనాల కోసం చేస్తున్న అక్రమాల వల్ల ఈ పరిస్థితి తలెత్తింది. చట్టబద్ధపాలన విషయంలో సమస్యలను వర్ణించడం కంటే సమస్య పరిష్కారమార్గం వైపు ఆలోచించాలనే మంచి ఉద్దేశంతో దేశంలో చట్టబద్ధపాలనను మెరుగుపరచటానికి అవసరమైన సూచనలు, సలహాలు తీసుకోవడానికి ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్), ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ), హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఏడాది ఫిబ్రవరి 20 నుంచి 28వ తేదీ వరకు చట్టబద్ధపాలనపై తొమ్మిది రోజుల జాతీయ సదస్సు జరిగింది. ఈ తొమ్మిది రోజుల సమావేశాలలో భారత సుప్రీంకోర్టు, హైకోర్టులకు చెందిన మాజీ న్యాయమూర్తులతోపాటు ప్రఖ్యాతి చెందిన సామాజిక శాస్త్రవేత్తలు, సివిల్ సర్వీస్ మాజీ అధికారులు 50 మందికిపైగా పాల్గొన్నారు. చట్టబద్ధపాలనలో రోజువారీ అవకతవకలు, పొరపాట్లను వివరిస్తూ తగిన న్యాయ, పోలీసు సంస్కరణలు రావాలని అన్నారు. చట్టబద్ధపాలన లోపిస్తే ప్రజాస్వామ్యానికే ప్రమాదం వాటిల్లుతుందని, ప్రస్తుతం

సమాజంలో జరుగుతున్న ఘటనలను గమనిస్తే ప్రజాస్వామ్యానికి ప్రమాద ఘంటికలు మోగినట్లేనని తేల్చి చెప్పారు. చట్టబద్ధపాలనను ఆచరణలోకి తేవాలంటే చేయాల్సిన సంస్కరణల గురించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. తాత కేసు వేస్తే మనవడి దాకా తెగని పంచాయతీలు కోర్టులలో నడుస్తున్నాయి. న్యాయవ్యవస్థలో జాప్యంతో సకాలంలో న్యాయం అందకపోవటం వల్ల 'ఇన్‌స్టంట్'గా న్యాయం అందించే గూండాల వ్యవస్థ పేట్రేగి పోతోంది. కోర్టుకు పోయినవాడు కాటికి పోయినవాడు ఒకటే అనే సామెత అందుకే పుట్టింది. కోర్టులో కేసు ఓడినవాడు కోర్టు ముందు బహిరంగంగా లబోదిబో అంటే, గెలిచినవాడు ఇంటికెళ్లి ఎవరూ చూడకుండా బోరుమని ఏడుస్తున్నాడు. ఇది మన న్యాయవ్యవస్థ పనితీరుపై ఉన్న సామాన్యమైన సెటైరు. కోర్టు కెళ్తే మన సమస్య త్వరగా పరిష్కారం కాదనుకున్న సందర్భంలో సామాన్య ప్రజలు గుండాలను, రాజకీయ నాయకులను ఆశ్రయిస్తారు. అలా సమాజంలో గుండాలే సమాంతరమైన కోర్టులను, సొంత న్యాయ దర్బారులను నడుపుతున్నారు. దుర్మార్గాలకు భయపడి మాట్లాడకుండా మౌనంగా ఉండే సమాజంలో సామాన్య ప్రజలకు రక్షణ కరవవుతోంది. దాంతో ఈ అనధికార కోర్టులు నడుపుతున్న గుండాలే తొండ ముదిరి ఊసరవెల్లి అయినట్లు రాజకీయ నాయకుల అవతారం ఎత్తి పంచాయతీ నుంచి పార్లమెంటు దాకా మద్యం, డబ్బు పంచి ప్రజల ఓట్లను కొల్లగొడుతున్నారు. నేరం, రాజకీయం కలగలిపిన సమాజంలో ఇలాంటి హత్యా రాజకీయాలు జరగడం సర్వసాధారణంగా మారుతుంది. వెనకటి కాలంలో నేరం చేసేవాడు వేరుగా ఉంటే రాజకీయాల్లో ఉన్నవాళ్లు వారిని రక్షించే సాధనాలుగా పనికివచ్చేవారు. కానీ ప్రస్తుతం రాజకీయాలలో నేరస్తులే అత్యున్నతమైన పదవులు పొందడం వల్ల నేర రాజకీయం సర్వత్రా వ్యాపిస్తోంది. ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. ఇక పోలీసుల పనితీరు చెప్పుకోవాలంటే వారు అధికార పార్టీకి కొమ్ముకాస్తున్నారు. దానికి కారణం వారి నియామకం నుండి బదిలీలు, చివరికి పదవీ విరమణ దాకా ప్రభుత్వ పెద్దల జోక్యం ఉండటమే కారణం. సమాజంలో న్యాయవ్యవస్థ, పోలీసు, రాజకీయ వ్యవస్థలు విఫలమైన సందర్భంలో దారుణ ఘటనలు చూస్తున్నాం. ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు సమాజమంతా స్పందిస్తుంది. మీడియా పెద్దఎత్తున ప్రసారం చేస్తుంది. కానీ తర్వాత షరామామూలుగా మారిపోతుంది. అందరం మర్చిపోతాం. మళ్లీ కొన్నాళ్లకు అలాంటి సంఘటనలు జరిగినప్పుడు ఈ చర్చలు మళ్లీ ముందుకు వస్తున్నాయి. హత్యారాజకీయాల మూలాలను పరిష్కరించలేకపోతే ఎప్పటికీ అది ముగిసిపోని కథగా మారుతుంది. న్యాయ, పోలీసు సంస్కరణల ద్వారా దేశంలో సత్వర న్యాయం, ముంగిట న్యాయం అందించినప్పుడు కోర్టుల మీద నమ్మకం పెరుగుతుంది. ముఖ్యంగా ప్రజల జనాభా నిష్పత్తికి అనుగుణంగా కోర్టుల సంఖ్యను పెంచాలి. న్యాయమూర్తుల నియామకం నుండి వారి బదిలీల వరకు స్వతంత్ర వ్యవస్థలను అభివృద్ధి చేయాలి. అలాగే పోలీసు నేర విచారణలో రాజకీయ జోక్యం లేకుండా వేరు చేయాలి. సమస్యను వర్ణించడం కాకుండా సమస్యా పరిష్కారం వైపు ఆలోచించినప్పుడు హత్యా రాజకీయాలు, ఇతర దారుణాలకు తెరపడుతుంది. మంచి పరిష్కారం లభిస్తుంది. లేకపోతే గొంగడిపైనే కూర్చొని వెంట్రుకలు ఏరుతున్నట్లుగానే ఉంటుంది. ప్రస్తుతం గొంగడిని మార్చే ప్రక్రియ కావాలి. ✦

## ఏ ప్రాతిపదికన జీతాలు, పదవీ విరమణ వయసు పెంచారు?

కమిటీ సిఫార్సును కూడా పరిగణలోకి తీసుకోకుండా ప్రభుత్వోద్యోగులకు ఏ ప్రాతిపదికన 30% ఫిట్‌మెంట్‌తో జీతాల పెంపును ప్రకటించారో రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు సమాధానం చెప్పాలని లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాసు డిమాండ్ చేశారు. ప్రజల ఆదాయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో సేవల ప్రమాణాలను పరిగణలోకి తీసుకుని హేతుబద్ధంగా ఉద్యోగుల జీతాల పెంపు ఉండాలని, నిజాం నవాబు ఫర్మానాలాగా నిర్ణయాలు తీసుకోవటానికి ఇదేమీ రాచరికం కాదన్నారు. రిటైర్మెంట్ వయసును 61 ఏళ్లకు పెంచటం కూడా అసంబద్ధ నిర్ణయమన్నారు. ఉద్యోగుల అనుభవాన్ని ఉపయోగించుకోవటం అవసరమేనని, అయితే అందుకు పదవీ విరమణ వయసు పెంచటం సరైన మార్గం కాదని, ఇది యువతను కూడా నిరాశకు గురిచేసిందన్నారు.



## నాణ్యమైన ప్రీ ప్రైమరీ విద్యకు 'ప్రథమ్'తో ఒప్పందం

రాష్ట్రంలోని వైఎస్సార్ ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆంధ్రప్రదేశ్ మహిళాశిశు సంక్షేమ శాఖ తెలిపింది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన సహకారాన్ని ఐటీసీ సునెహ్రాకల్ మిషన్ అందిస్తుంది. ప్రాజెక్టులో భాగంగా వైఎస్సార్ ప్రీ ప్రైమరీ పాఠశాలల్లోని పిల్లలకు 100 రోజుల బడి సంసిద్ధత కార్యక్రమం, ఆంగ్ల భాష బోధనతోపాటు పాఠశాల కార్యక్రమాలు ఉంటాయి. రెవెన్యూ డివిజన్ స్థాయిలో భాగస్వామ్య సంస్థ వారి మాస్టర్ ట్రైనర్లను అందుబాటులో ఉంచుతారు. వీరు అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలతో నిర్వహించవలసిన రోజువారీ కార్యకలాపాలను కార్యకర్తలకు (టీచర్లు) వాట్సాప్, ఎస్ఎంఎస్‌ల ద్వారా పంపుతారు. కార్యకర్తలు, ఆయాల్లో సామర్థ్యాన్ని పెంచటానికి శిక్షణ ఇస్తారు.

# న్యాయవ్యవస్థ ప్రజాస్వామీకరణ కోసం గొంతు కలపండి

పత్రికల్లో, టీవీల్లో వచ్చే హెడ్‌లైన్స్‌లో ఎక్కువ శాతం చట్టబద్ధపాలనకు సంబంధించినవే. సోషల్ మీడియా షేర్స్‌లో కూడా ఎక్కువ ఏదోకరూపంలో సమన్యాయానికి సంబంధించినవే. కానీ ఒక సమాజంగా మనం అతి తక్కువ పరిష్కారాల్ని ఆలోచించేది కూడా చట్టబద్ధపాలనకు సంబంధించే! మనందరి రోజువారీ జీవితానికి ఎంతో అవసరం కాబట్టే చట్టబద్ధపాలన అంశాన్ని ఈ ఏడాది చర్చనీయాంశంగా 'ఇండియన్ డెమోక్రసీ ఎట్ వర్క్' (ఆచరణలో భారత ప్రజాస్వామ్యం - ఐడీఏడబ్ల్యూ) వేదిక తీసుకుంది. ఈ వేదిక ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ చొరవతో ఏర్పాటైంది. మన దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలకు ఆచరణ సాధ్యమైన, వెంటనే అమలు చేయగల, తక్కువ ఖర్చుతో కూడిన పరిష్కారాల్ని అందించేందుకు, వాటిపై ఏకాభిప్రాయాన్ని సాధించేందుకు ఎఫ్‌డీఆర్, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ), యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (హెచ్‌సీయూ) కలిసి ఐడీఏడబ్ల్యూ వేదికగా 2020 నుంచి జాతీయ సదస్సుల్ని నిర్వహిస్తున్నాయి. మొదటి సదస్సులో 'ధనరాజకీయాలు'పై చర్చించారు. దేశవ్యాప్తంగా పార్లమెంటు, అసెంబ్లీ, స్థానిక ప్రభుత్వాలకు 'ఒకేసారి ఎన్నికల' ప్రతిపాదనను అవకాశంగా తీసుకుని మొదటి సదస్సులోని పరిష్కారాలను సాధించే ప్రయత్నాన్ని చర్చలో పాల్గొన్నవారి సహకారంతో ఎఫ్‌డీఆర్ కొనసాగిస్తోంది. ఐడీఏడబ్ల్యూ రెండవ జాతీయ సదస్సును 'చట్టబద్ధపాలన'పై 2021 ఫిబ్రవరి 20 నుంచి 28 వరకూ వెబ్ ద్వారా నిర్వహించారు.

ఒక రాజకీయ ఉద్యమ నేపథ్యమున్న సంస్థ చట్టబద్ధపాలన అంశం మీద ఇంత విస్తృత సదస్సు నిర్వహించటం బహుశా భారతదేశ చరిత్రలో ఇదే ప్రథమం. 9 రోజులు - 15 సమావేశాలు - వివిధ రాష్ట్రాలు, బ్రిటన్, అమెరికా, స్పెయిన్ నుంచి పాల్గొన్న 50కి పైగా నిష్ణాతులతో మారథాన్! ఎఫ్‌డీఆర్ అధ్యయన బృందం రూపొందించిన '21వ శతాబ్దంలో చట్టబద్ధపాలన' చర్చా పత్రంలోని అంశాలపై వీరంతా చర్చించారు. సమన్యాయానికి ఆచరణాత్మకంగా ఏం చేయవచ్చో విలువైన అభిప్రాయాల్ని అందించారు.

ప్రజాస్వామ్యానికి వెన్నెముక చట్టబద్ధపాలన. ప్రజాస్వామ్యాన్ని పెంపొందించటానికి.. ప్రజల యొక్క ప్రజల కోసం, ప్రజల ద్వారా అన్న భావోద్వేగం మాత్రమే చాలదు. మన ప్రయత్నం కూడా అవసరం. పౌరులుగా మన ఆలోచన,







భాగస్వామ్యం అవసరం. రీన్‌హోల్డ్ నీబర్ అన్నట్లు.. "మనిషికుండే న్యాయ సామర్థ్యం వల్ల ప్రజాస్వామ్యం సాధ్యం .. కానీ అన్యాయం వైపు మొగ్గు చూపే మనిషి సహజ స్వభావం వల్ల ప్రజాస్వామ్యం అవసరం'. మన జీవితాలకు ఇంత అవసరమైన ప్రజాస్వామ్యానికి నిత్యావసరం కాబట్టే చట్టబద్ధపాలనపై చర్చను ఎఫ్‌డీఆర్, ఐఎస్‌బీ, హెచ్‌సీయూ నిర్వహించాయి. మన స్వేచ్ఛను పరిరక్షించటం కోసమే కాకుండా, సామాజిక స్థిరత్వం, నగరాల, దేశ ఆర్థికాభివృద్ధి కోసం కూడా చట్టబద్ధపాలన అవసరం. కుటుంబ వ్యవస్థో, మరో సాంస్కృతిక విలువో బలంగా ఉండటం వల్ల మన దేశంలో పరిస్థితి అదుపులో ఉన్నట్లు కనిపిస్తుందిగానీ, మనకు పటిష్ఠ చట్టబద్ధపాలన లేదు. వేధింపులు, అత్యాచారాల్లో సమన్యాయంతో అరెస్టులు జరుగుతాయని, సకాలంలో న్యాయం అంది నేరస్తులకు శిక్షలు పడతాయని నమ్మకం ప్రజల్లో లేదు. పట్టణీకరణ వేగంగా జరుగుతున్న నేపథ్యంలో మన సామాజిక బలాలు కూడా సడలుతున్నాయి. సాంకేతిక వినియోగంలో పోలీసుల కంటే నేరస్తులు ముందుంటున్నారు. ఆటవిక రాచరికపు రోజుల్లో కూడా చట్టబద్ధపాలనకు తొలి ప్రాధాన్యత ఉండేది కానీ, భారత ప్రజాస్వామ్య పాలనలో ఇంకా చట్టబద్ధపాలన ప్రభుత్వ ప్రధాన బాధ్యతగా మారలేదు. చట్టాన్ని అందరికీ సమానంగా వర్తింపచేసి ప్రతి ఒక్కరికీ భద్రత, న్యాయం అందించటం.. దేశ రక్షణ తర్వాత ప్రభుత్వాలు చేయాల్సిన మొట్టమొదటి, ప్రయివేటీకరించలేని బాధ్యత. ఈ పని ప్రభుత్వాల

చేత పటిష్టంగా చేయించటం కోసమే.. పోలీసు, ప్రాసిక్యూషన్, న్యాయ ప్రక్రియ చట్టాలు, న్యాయవ్యవస్థలో సవాళ్లు అనే మౌలిక సంస్కరణలపై, 'పోటా', 'ఉపా' వంటి అసాధారణ చట్టాలు, సోషల్ మీడియాలో నకిలీ వార్తలు, మహిళల భద్రత, సైబర్ నేరాలు, చట్టబద్ధపాలన-ఆర్థిక వ్యవస్థ అంశాలపై ఐడీఏడబ్ల్యు సదస్సు చర్చించింది.

ముందే అనుకున్నట్లు.. చట్టబద్ధపాలన చుట్టూ ఘటనలకు చలించిపోవటం తప్ప చట్టబద్ధపాలనను పట్టించుకోవటం మన వద్ద తక్కువ. అందుకే సదస్సులో పాల్గొన్న వారు ఏయే అంశాలను స్పృశించారో సంక్షిప్త సందేశంలాగా అయినా తెలుసుకోకుండా మనం పరిష్కారంలో భాగం కాలేము. ఈ నేపథ్యంలోనే కొన్ని అభిప్రాయాల ప్రస్తావన.

26 ఏళ్లపాటు న్యాయవాదిగా, 22 ఏళ్లపాటు న్యాయమూర్తిగా దాదాపు యాభై ఏళ్ల పాటు న్యాయవ్యవస్థలో ఉన్న సుప్రసిద్ధ న్యాయకోవిదుడు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎంఎన్ వెంకటాచలయ్య సదస్సును ప్రారంభిస్తూ, న్యాయవ్యవస్థ పట్ల ప్రజల్లో అపనమ్మకం కొనసాగితే గొలుసుకట్టు పరిణామాలు విధ్వంసకర పరిస్థితులకు దారితీస్తాయని హెచ్చరించారు. చట్టబద్ధపాలన వ్యక్తులకే కాకుండా ప్రభుత్వాలకు కూడా వర్తిస్తుందన్నారు. అపరిమిత అధికారాలుంటే ఎంత గొప్ప వ్యక్తినైనా నమ్మలేమని, నియంత్రించటానికి చట్టబద్ధపాలన ఉండాలన్నారు. సంక్షోభం గురించి తెలుస్తున్నా కూడా.. మార్పు ఇప్పుడు కాదు తర్వాత రావాలని కోరుకుంటున్నారని, 'దేవుడా! నన్ను పవిత్రుడ్ని చెయ్యి. కానీ ఇవాళ కాదు. తర్వాత. ఇప్పుడు నేను చేయాల్సిన పనులు వేరే ఉన్నాయి" అనుకుంటున్నారన్నారు.

ఇంకా సదస్సులో.. చట్టబద్ధపాలనకు- పేదరిక నిర్మూలన, ఆర్థిక వృద్ధికి గల సంబంధం, సివిల్ కంటే క్రిమినల్ కేసుల సంఖ్య ఎక్కువుండటం, వ్యాపార ఒప్పందాల అమలు, వివాదాల పరిష్కారం వేగంగా, సమర్థవంతంగా జరగకపోవటంతో పెట్టుబడుల్లో వెనుకంజ, అమెరికాలో వెయ్యిమందికి 300కి పైగా ఫిర్యాదులుండగా మన బీహార్, జార్ఖండ్ రాష్ట్రాల్లో 3 నుంచి 5 కేసులు మాత్రమే వస్తుండటం, సహజ న్యాయ సూత్రాలకు - రాజ్యాంగ నిర్దేశాలకు మధ్య వైరుధ్యముందనే రీతిలో విచారణలు, తీర్పులు, ప్రజల్లో కేవలం 15% మాత్రమే పోలీసు సేవల్ని ఉపయోగించుకుంటుండటం, కేసుల విషయంలో కులం, మతం, వర్గం, మహిళ ప్రాతిపదికన వివక్ష, రాజకీయ జోక్యం, ఎఫ్ఐఆర్ల కోసం లంచాలు, తాము బలగాలు తప్ప సేవకులు కాదని పోలీసులు భావిస్తుండటం, పోలీసులకు సిబ్బంది, మౌలిక వసతుల కొరత, ఎక్కడికక్కడ మారుతుండే స్థానిక అవసరాలకనుగుణంగా ప్రజల సహకారంతో పోలీసింగ్తో కేరళ సాధించిన విజయాలు, తెలంగాణలో పోలీసు స్టేషన్ల రూపురేఖల్ని మారుస్తున్నా ఇంకా ప్రజల భాగస్వామ్యం పెరగకపోవటం, సాంకేతిక పరిజ్ఞానాన్ని సక్రమంగా వినియోగించుకోలేకపోవటం, తెలుగు రాష్ట్రాల్లో ఎమ్మెల్యేల కనుసన్నల్లో ఎఫ్ఐఆర్లు రూపొందుతుండటం, అవసరం లేకున్నా అరెస్టులు, రాజకీయ నాయకులను నిందించాల్సిన అవసరం లేకుండానే పోలీసు అధికారులు తేగల మార్పులు, బెయిలు సంస్కరణలు కొరవడటం, శాంతి భద్రతల విభాగం పోలీసులకే నేర పరిశోధన కేసులను కేటాయించటం, ఎఫ్ఐఆర్ ఎందుకు రాయాలో, రాయకూడదో తెలియని సిబ్బందిని తయారుచేస్తున్న పోలీసు శిక్షణ, పోలీసులు చట్టాన్ని చేతిలోకి తీసుకోవటం, పోలీసులు నమోదు చేసిన వాంగ్మూలానికి కోర్టుల్లో విలువ లేకపోవటం, బయట మీడియా ముందు నిజాలు చెప్పిన దోషులు కోర్టులో ప్రమాణం చేసి మరీ అబద్ధాలు చెప్పినా తగిన చర్యలు లేకపోవటం, కేవలం పేదరికం కారణంగా లక్షల మంది జైళ్లలో మగ్గుతుండటం, నారాయణ గురు లాంటి సంస్కర్తల ప్రభావమున్న కేరళలో దిగువ కోర్టుల్లో కూడా న్యాయవ్యవస్థ పనితీరు మెరుగ్గా ఉండటం, చాలా దిగువ కోర్టుల్లో ఏడాది దాటి విచారణలు జరుగుతుండటం, విచారణల్లో ప్రాసిక్యూషన్, డిఫెన్స్ న్యాయవాదులకు తప్ప జడ్జికి పాత్ర లేకపోవటం, దేశంలోని దిగువ కోర్టుల్లో 3.7 కోట్లు, హైకోర్టుల్లో 50 లక్షల కేసులు పెండింగ్లో ఉన్నా కేసుల భారాన్ని గణనీయంగా తగ్గించి సామాన్యులకు సులభంగా, చౌకగా, త్వరగా న్యాయాన్ని అందించే స్థానిక కోర్టుల్ని ఏర్పాటు చేయకపోవటం (స్థానిక కోర్టుల ఏర్పాటుకు ఎఫ్డీఆర్/లోక్‌సత్తా ప్రతిపాదించిన బిల్లు 2008లో గ్రామన్యాయాలయాల చట్టంగా పార్లమెంటు ఆమోదం పొందింది. పట్టణీకరణలో కీలక సవాలుగా మారిన మహిళల భద్రతకు భరోసా ఇచ్చేందుకు కూడా ఎంతో ఉపయోగపడే ఈ చట్టం కింద దేశవ్యాప్తంగా 5,000 - 6,000 కోర్టులు ఏర్పడాల్సి ఉండగా కేవలం 220 మాత్రమే పనిచేస్తున్నాయి), పాత కాలపు న్యాయవిద్య నుంచి వచ్చిన విద్యార్థులు న్యాయవ్యవస్థలో ఆధునిక ప్రజాస్వామ్య అవసరాలకనుగుణంగా పనిచేయలేకపోవటం, దేశంలో న్యాయ సంస్కరణలు మరీ ఆలస్యంగా మరీ చిన్న స్థాయిలో రావటం, సరైన డేటా అందుబాటులో లేకపోవటం, డేటా విశ్లేషణలో కొత్తదనం కొరవడటం, భారతీయ సమాజ వైవిధ్యాలు, అవసరాలకనుగుణంగా న్యాయవ్యవస్థ ప్రాథమ్యాలు మారకపోవటం, న్యాయనియామకాల్లో పారదర్శకత కొరవడటం, జడ్జిలు తప్పుడు తీర్పులు ఇచ్చినా చర్యలు తీసుకునే అవకాశం లేకపోవటం, తీర్పుల నాణ్యతను పరిశీలించేందుకు తగిన ఏర్పాటు కొరవడటం, కేసుల సంఖ్యను కాకుండా జనాభా నిష్పత్తినే జడ్జిల సంఖ్యకు ప్రమాణంగా తీసుకోవటం, సుప్రీంకోర్టు రాష్ట్రాల పరిధిలోని చట్టాల్లో జోక్యం చేసుకోవటం, వ్యక్తుల మధ్య లిటిగేషన్లను అత్యున్నత న్యాయస్థానం విచారణకు స్వీకరించటం, రాజ్యాంగ బెంచ్‌లలో ఇద్దరు జడ్జిలతో కూడా తీర్పులిస్తుండటం, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య పెంపుపై స్పష్టత కొరవడవడటం, ఎఫ్డీఆర్, ఐఎస్బీ, హెచ్‌సీయూ కాంబినేషన్‌లా వాణిజ్యం, సమాజం, విద్యార్జన కలగలసిన

కోర్సుల్ని జాతీయ విద్యావిధానానికనుగుణంగా రూపొందించాల్సిన ఆవశ్యకత, బ్రిటన్‌లో నేరాలు అనే మాటని తీసివేసి సంక్షోభాల పరిష్కారంగా కేసుల్ని దర్యాప్తు చేయటం, పోలీసు అధికారిని మార్చాలన్నా ప్రజల భాగస్వామ్యం ఉండటం, అధికార పార్టీ వారిని ప్రాసిక్యూటర్లుగా నియమించటం, పోలీసులు, ఫోరెన్సిక్, ప్రాసిక్యూషన్, జడ్జిలకు సైబర్ పరిజ్ఞానం కొరవడటం, 1857 తిరుగుబాటు నేపథ్యంలో బ్రిటిష్ పాలకులు 1861లో ఏర్పాటు చేసిన పోలీసు వ్యవస్థనే స్వతంత్రం వచ్చాక కూడా కొనసాగిస్తుండటం, అసాధారణ చట్టాలకు రాజ్యాంగంలో అవకాశం కల్పించిన సమయంలో కేంద్ర కేబినెట్‌లో మంత్రిగా ఉన్న శ్యామాప్రసాద్ ముఖర్జీ ఆ తర్వాత 1951లో నిర్బంధాల్ని వలసపాలన కాలపు క్రౌర్యాలుగా విమర్శించటం, 1992లో అంతర్గత భద్రతా చట్టం ద్వారా నిషేధానికి గురైనప్పుడు దాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేసిన ఆర్‌ఎస్‌ఎస్ ఇప్పుడు ఆ మాట ఎత్తకపోవటం, రాజ్యాంగపరమైన అభ్యంతరాలు లేకున్నా ప్రభుత్వాల విధాననిర్ణయాలలో న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోవటం, ప్రజాప్రయోజనవ్యాజ్యాలను (పిల్) ప్రోత్సహిస్తూ సంచలన తీర్పులివ్వటం ద్వారా సమస్యలో భాగమవటం, న్యాయవ్యవస్థ విఫలమవటం వల్ల గూండాలతోపాటు కొంతమంది పోలీసులు కూడా సెటిల్‌మెంట్ వ్యవస్థలో భాగ మవటం, న్యాయవ్యవస్థలోకి సమర్థులైన యువత రావటానికి ఇష్టపడకపోవటం తదితర అంశాలు చర్చలో వచ్చాయి.

ఈ మొత్తం అభిప్రాయాల సారాంశం.. న్యాయవ్యవస్థను ఆధునిక ప్రజాస్వామ్య అవసరాలకనుగుణంగా వ్యక్తుల మీద కాకుండా వ్యవస్థల మీద ఆధారపడేలా సంస్కరించటం. సదస్సులో పాల్గొన్న ఉద్దండులు వివిధ అంశాలపై కొంత భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేసినా స్థూలంగా ఏకాభిప్రాయానికొచ్చారు. తదనుగుణంగా 12 పరిష్కారాలతో 'చట్టబద్ధపాలనపై హైదరాబాద్ డిక్లరేషన్ 2021'ను విడుదల చేశారు. ఇందులో.. ఆధునిక సమాజ సవాళ్లకనుగుణంగా తగినంత మంది పోలీసు సిబ్బంది, ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేలా కమ్యూనిటీ పోలీసింగ్, పోలీసు శిక్షణ ప్రారంభంలోనే ప్రత్యేక తర్ఫీదు, ఆధునిక అవసరాలకు తగ్గట్టు ఫోరెన్సిక్ వసతుల విస్తృత పెంపు, పోలీసుల్లో శాంతి భద్రతల విభాగం నుంచి నేర పరిశోధనా విభాగాన్ని వేరు చేసి రాజకీయ జోక్యం లేకుండా జవాబుదారీతనంతో స్వతంత్ర దర్యాప్తు సంస్థ ఏర్పాటు, మూడేళ్లకు పైబడి శిక్ష పడే అవకాశమున్న నేరాల్ని ఆ సంస్థ పరిధిలోకి తేవటం, జిల్లా స్థాయిలో బలమైన ప్రాసిక్యూషన్ వ్యవస్థ, విచారణ సులభంగా, తక్కువ ఖర్చుతో ఉండేలా క్రిమినల్ ప్రొసీజర్ చట్టాల సవరణ, న్యాయవ్యవస్థ వైపు నుంచే కాకుండా సమాజ అనుభవాల నుంచి కూడా సంస్కరణల్ని రూపొందించటంలో భాగంగా స్టే ఉత్తర్వులకు కాలవ్యవధి, తీర్పులిచ్చే తేదీని ముందుగానే ప్రకటించటం వంటి చర్యలు, జడ్జిల సంఖ్య, జీతభత్యాలు, మౌలిక సౌకర్యాల పెంపు, స్థానిక కోర్టుల ఏర్పాటు, పాలనా వ్యవహారాలు చూడటానికి జ్యుడీషియల్ మేనేజర్లు, క్లర్కుల వ్యవస్థ, రాజ్యాంగ కోర్టుల్ని ప్రాథమికంగా రాజ్యాంగ అంశాల బాధ్యతకు పరిమితం చేయటం ద్వారా పటిష్ఠ పరచటం, శాశ్వత రాజ్యాంగ బెంచ్‌ల ఏర్పాటు, అత్యుత్తమ సామర్థ్యమున్న యువత జడ్జిలుగా ఎంపికయ్యేలా అఖిల భారత సర్వీసు, అనుచిత ప్రవర్తనపై ఫిర్యాదులను పరిష్కరించేందుకు ఉన్నత న్యాయస్థానాల్లో న్యాయ ప్రమాణాలు, జవాబుదారీ వ్యవస్థ ఏర్పాటు ఉన్నాయి.

మన భద్రత, స్వేచ్ఛ, ఉపాధి, ఆర్థిక వృద్ధి, సామాజిక స్థిరత్వాలకు కీలకమైన డిక్లరేషన్ ఎజెండాను సాధించేందుకు మిగిలిన వారి సహకారంతో జయప్రకాష్ నారాయణ్ తన వంతు ప్రయత్నాన్ని పూర్తి స్థాయిలో ప్రారంభించారు. అలాగే ఉన్నత న్యాయస్థానాల్లో నియామకాలు పక్షపాతం లేకుండా పారదర్శకంగా జరిగేందుకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ ఎంఎన్ వెంకటాచలయ్య, జస్టిస్ జేఎస్ వర్మ, న్యాయమూర్తి జస్టిస్ వి.ఆర్ కృష్ణ అయ్యర్‌ల ద్వారా జాతీయ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్ బిల్లును రూపొందించి, ప్రధాన జాతీయ పార్టీలను ఒప్పించి ఎన్‌జేఏసీ చట్టాన్ని 99వ రాజ్యాంగ సవరణగా జేపీ గతంలో సాధించారు. దురదృష్టవశాత్తూ ఆ చట్టాన్ని సుప్రీంకోర్టు 2015లో కొట్టివేసింది. తిరిగి ఏదోకరూపంలో ఆ చట్టాన్ని పట్టాలెక్కించాల్సి ఉంది. కానీ సంస్కరణలకు సమాజం అండ కూడా కావాలి. న్యాయవ్యవస్థను ప్రజాస్వామీకరించాలని ప్రజల నుంచి కూడా డిమాండ్ వస్తే మార్పులు వేగంగా వస్తాయి. శాంతియుత పరిస్థితుల్ని నెలకొల్పే పటిష్ఠ చట్టబద్ధపాలన కావాలా, గూండాల సెటిల్‌మెంట్లు, దిశ ఎన్‌కౌంటర్‌లోలా పోలీసులు బండన్యాయాన్ని అమలు చేసే అరాచకం కావాలా? మనం తేల్చుకోవాలి. 'ఆత్మనిర్భర భారత్'కి చట్టబద్ధపాలన ఎంతో ముఖ్యమని, అందుకే 1860ల నాటి ఐపీసీ, సీఆర్‌పీసీ, ఎవిడెన్స్ చట్టాలను సంస్కరించేందుకు అయిదుగురు సభ్యుల కమిటీని నరేంద్రమోదీ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని కేంద్ర హోం శాఖ సహాయమంత్రి కిషన్‌రెడ్డి సదస్సులో చెప్పారు. కమిటీ సభ్యులు ఇప్పటికే రాష్ట్రాల్లో పర్యటిస్తున్నారని, త్వరలో న్యాయ కళాశాలల్లో కూడా సమావేశాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని కూడా యువత, ఇతర ప్రజానీకం ఉపయోగించుకుని పైన పేర్కొన్న డిక్లరేషన్‌లోని ఎజెండా కోసం గళం విప్పాలి. ఏవోక మార్పులు కాకుండా, ప్రభుత్వం సరైన దిశలో మార్పులు తెచ్చేలా చేయాలి. జాతీయ పోలీస్ కమిషన్, రెబిరో కమిషన్, పద్మనాభయ్య కమిటీ, మాలిమత్ కమిటీ, జయప్రకాష్ నారాయణ్ సభ్యుడిగా ఉన్న రెండో పరిపాలనా సంస్కరణల సంఘం.. ఇలా ఎన్నో కమిటీలు, సంఘాలు చట్టబద్ధపాలనకు సంబంధించి చేసిన సిఫార్సులు పెండింగ్‌లో ఉన్నాయి. మరో కమిటీ అవసరం లేకుండా ఈసారి న్యాయసంస్కరణల్ని సాధించి తీరాలి. హైదరాబాద్ డిక్లరేషన్‌లోని అంశాలను సాధించుకుంటే మిగిలిన రాజ్యాంగపర న్యాయసంస్కరణల సాకారానికి పెద్ద సమయం పట్టదు. ✦

# మనం మరచిన అంబేద్కర్ హెచ్చరిక

**- రామచంద్ర గుహ, చరిత్రకారులు**

**రాజకీయాల్లో భక్తి, లేక నాయక పూజ పతనానికి, అంతిమంగా నియంతృత్వానికి దారి తీసే నిశ్చిత మార్గమని మన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ హెచ్చరించారు. వ్యక్తిపూజ అనేది ఎప్పుడు ఏ దేశంలో వర్ధిల్లినా అది ఆ దేశానికి వినాశకరంగా పరిణమించిందన్నది చరిత్ర చాటుతున్న సత్యం.**



సోవియట్ నియంత జోసెఫ్ స్టాలిన్ విషయంలో 'వ్యక్తిపూజ' అనే పదాన్ని మొట్టమొదటిసారి ఉపయోగించారు. రెండు దశాబ్దాలకుపైగా తిరుగులేని అధికారాన్ని చెలాయించిన స్టాలిన్ 1953లో మరణించారు. మూడు సంవత్సరాల అనంతరం, సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ 20వ మహాసభలో నికిటా కృశ్చేవ్ ఒక చరిత్రాత్మక ప్రసంగం వెలువరిస్తూ స్టాలిన్ పట్ల మితిమీరిన వ్యక్తిపూజ పార్టీ పైన, దేశం పైన హానికరమైన ప్రభావాన్ని నెరపిందని అన్నారు. కృశ్చేవ్ ఇంకా ఇలా అన్నారు: 'ఒక వ్యక్తిని మానవాతీతుడుగా, దైవసమానుడుగా పరిగణించడం మార్క్సిజంలెనినిజం స్ఫూర్తికి విరుద్ధం'.

వ్యక్తిపూజ అనే పదం 1956లో మాత్రమే ప్రజల మాటామంతీలోకి వచ్చినప్పటికీ స్టాలిన్‌కు పూర్వమే వ్యక్తిపూజలు వర్ధిల్లాయి. ఇటలీలో ముస్సోలినీ, జర్మనీలో హిట్లర్ మొదలైనవారు మానవాతీతులుగా ప్రజల దృష్టికెక్కేందుకు నవీన ప్రచార పద్ధతులను, ప్రభుత్వ యంత్రాంగాన్ని ఉపయోగించుకున్నారు. సహచరులు, సామాన్య ప్రజల కంటే తాము భిన్నమైనవారమని నమ్మించారు. స్టాలిన్ వలే ముస్సోలినీ, హిట్లర్ కూడా అపరిమిత అధికారాలను చెలాయించారు. తమ నిర్ణయాలకు (అవి ఎంత చపలచిత్తమైనవైనప్పటికీ) ప్రతి ఒక్కరూ కట్టుబడివుండేలా చేశారు.

స్టాలిన్‌కు పూర్వం వ్యక్తిపూజలు అందుకున్న వారందరూ పూర్తిగా మితవాద నియంతలే. స్టాలిన్ అనంతరం విపరీత ఆరాధనలందుకున్నవారు అందరూ కాకపోయినా అత్యధికులు వామపక్ష నియంతలే. క్యూబాలో కాస్ట్రో, వియత్నాంలో హోచిమిన్, వెనిజువెలాలో హ్యూగో ఛావెజ్, చైనాలో మావో అపరిమితమైన వ్యక్తిపూజలనందుకున్నారు. ముఖ్యంగా మావో నడయాడుతున్న దైవంగా ఆరాధింపబడ్డాడు. కోట్లాది ప్రజలు అమిత భక్తిప్రపత్తులతో ఆయనకు మోకరిల్లేవారు. ఆయన మాట్లాడిన ప్రతి మాట దైవవాక్కుగా పరిగణించారు.

స్టాలిన్ వ్యక్తిపూజ ఫలితంగా రష్యాకు జరిగిన నష్టం గురించి కృశ్చేవ్ మాట్లాడటానికి ఏడు సంవత్సరాల పూర్వమే డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భారతీయులకు అసాధారణ వీరారాధన స్వభావం ఉందని పేర్కొన్నారు. మన ప్రజాస్వామిక గణతంత్ర రాజ్య రాజ్యాంగం అమలులోకి వస్తున్న సందర్భంగా 1949 నవంబర్ 25న ఆయన రాజ్యాంగసభలో మాట్లాడుతూ ఇలా హెచ్చరించారు: 'సారభూతంగా అప్రజాస్వామికమైన భారతదేశపు నేలలో ప్రజాస్వామ్యమన్నది పై మెరుగు దిద్దడమే అవుతుంది.. ఈ దేశంలో భక్తి, లేక నాయకుడి పట్ల అతి గౌరవం చెప్పలేని పరిమాణంలో రాజకీయాల్లో పాత్ర వహిస్తుంది. ప్రపంచంలోని మరే దేశంలోనూ ఈ నాయకత్వ పూజ ఇంతగా రాజకీయాల్లో జోక్యం చేసుకోదు. మతపరంగా భక్తిపరుడైతే అది మోక్ష మార్గమనవచ్చును. ఆత్మకు విముక్తి కలగవచ్చు. అయితే, రాజకీయంలో భక్తి లేక నాయకపూజ పతనానికి, అంతిమంగా నియంతృత్వానికి దారితీసే నిశ్చింత మార్గం'.

1970 దశకం నాటికి డాక్టర్ అంబేద్కర్ హెచ్చరికలను భారతీయులు పూర్తిగా మరచిపోయారు. తమ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను ప్రధానమంత్రి ఇందిరాగాంధీ కాళ్ల ముందు సమర్పించారు. ఆమెను పూర్తిగా విశ్వసించారు. ఆమె

నాయకత్వాన్ని ఎటువంటి మినహాయింపులు లేకుండా అంగీకరించారు. 'ఇందిరే ఇండియా, ఇండియాయే ఇందిర' అని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు స్వయంగా కీర్తించాడు. అది తన అభిప్రాయం మాత్రమే కాదని, సకల భారతీయుల విశ్వాసమని ఆ మహానుభావుడు నిస్సిగ్గుగా అన్నాడు. అంబేద్కర్ అన్నట్లు, 'రాజకీయంలో భక్తి లేక నాయకపూజ పతనానికి, అంతిమంగా నియంతృత్వానికి దారితీసే నిశ్చిత మార్గం'.

హిట్లర్, ముస్సోలినీ, స్టాలిన్, కాస్ట్రో, మావోలు తమ జీవితాంతం అపరిమిత అధికారాలను చెలాయించారు. అయితే ఇందిరాగాంధీ దాదాపు రెండు సంవత్సరాలపాటు నిరంకుశ పాలన సాగించి, తాను విధించిన అత్యవసర పరిస్థితిని ఎత్తివేసి సార్వత్రిక ఎన్నికలు నిర్వహించారు. ప్రజలు ఆమెను, ఆమె పార్టీని పూర్తిగా తిరస్కరించారు. ఆమె ధ్వంసం చేసిన రాజ్యాంగ సంస్థలు, వ్యవస్థలు క్రమంగా కోలుకున్నాయి. తమ స్వతంత్ర ప్రతిపత్తిని పునఃసాధించుకున్నాయి. పత్రికారంగం మరింతగా స్వతంత్రంగా వ్యవహరించింది. పౌరసమాజం అభివృద్ధి చెంది వర్ధిల్లింది.

అత్యవసర పరిస్థితిని ఎత్తివేసిన రెండు దశాబ్దాలకు నేను నా 'ఇండియా ఆఫ్టర్ గాంధీ' పుస్తక రచనకు ఉపక్రమించాను. 2007లో అది ప్రచురితమయ్యేనాటికి భారత్‌ను ఒక 'ఫిఫ్టీఫిఫ్టీ ప్రజాస్వామ్య వ్యవస్థ'గా అభివర్ణించడం సముచితమని నేను భావించాను. ఏడు సంవత్సరాల అనంతరం నరేంద్రమోదీ ప్రధానమంత్రి అయ్యారు. మన ప్రజాస్వామిక వ్యవస్థ విశ్వసనీయత మళ్లీ క్షీణించడం ప్రారంభమయింది.

రాజ్యాంగ సంస్థల, వ్యవస్థల విధ్వంసానికి పెరుగుతోన్న వ్యక్తిపూజ తోడయింది. ఇందిరాగాంధీ విషయంలో వలే మోదీ ఆరాధన పెచ్చరిల్లిపోయేందుకు 'జాతీయ పత్రికారంగం' విశేషంగా తోడ్పడుతోంది. ప్రధాని మోదీ సర్వజ్ఞుడు, ఆయన ఎట్టి పరిస్థితులలోనూ పొరపాటు చేయడనే భావాన్ని ప్రజల మనసుల్లో సుప్రతిష్ఠం చేసేందుకు భారతీయ మీడియా శత విధాల కృషి చేస్తోంది.

ఈ వ్యక్తిపూజను మరింతగా పెంపొందించేందుకు కొవిడ్19 విపత్తు మరో అవకాశాన్ని కల్పించింది. కొవిడ్ బయటపడ్డ సమయంలో ఆకాశవాణి, దూరదర్శన్‌లలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన ప్రసంగాలకు ఆదరణ ఇండియన్ ప్రీమియర్ లీగ్ ఫైనల్ కంటే అత్యధికంగా ఉన్నదని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ వ్యక్తిపూజ మరో రూపాన్ని కూడా సంతరించుకున్నది. అదే పిఎమ్ కేర్స్ అనే కొత్త నిధి. 1948 నుంచి ప్రధానమంత్రి సహాయనిధి అనేది ఒకటి ఉన్నది. కరవు కాటకాలు, భూకంపాలు, తుఫానులు, మహమ్మారులు, యుద్ధం మొదలైన ఆపత్సమయాలలో బాధితులను ఆదుకోదలచినవారు ఈ నిధికి విరాళాలు అందించడం జరుగుతోంది. భారత ప్రజలపై కొవిడ్19 విరుచుకుపడిన తొలినాళ్లలో ఈ నిధిలో 8,000 కోట్ల రూపాయల మేర ఉన్నాయి. ప్రధానమంత్రి సహాయనిధితో పాటు ప్రతి రాష్ట్రంలోనూ ముఖ్యమంత్రి సహాయనిధి అనేది కూడా ఉన్నది. గతంలో వివిధ ఆపత్కాలాలలో ప్రధానమంత్రులు, ముఖ్యమంత్రులు ఈ నిధుల ఆసరాతో బాధితులను అన్ని విధాల ఆదుకోవడం జరిగింది. అయితే ప్రధాని మోదీ వాటిని కాదని ఒక కొత్త నిధిని సృష్టించారు. దానికి 'సిటిజెన్స్ అసిస్టెన్స్ అండ్ రిలీఫ్ ఇన్ ఎమర్జెన్సీ సిట్యుయేషన్స్' (దీనినే సంక్షిప్తంగా పిఎమ్ కేర్స్ అంటున్నారు) అని పేరు పెట్టారు.

నరేంద్ర మోదీ ఆరాధన, స్టాలిన్ ఆరాధనకు మధ్య చాలా పోలికలు ఉన్నాయి. మూర్తీభవించిన పార్టీగా నాయకుడిని ప్రచారం చేయడం వాటిలో ఒకటి. అలాగే ముస్సోలిని, హిట్లర్ ఆరాధనలనూ అది అనుకరిస్తోంది. ముఖ్యంగా నాయకుని విజ్ఞత అమోఘమైనదని, ఆయన ఎన్నడూ ఎట్టి పరిస్థితులలోనూ తప్పు చేయడని ప్రచారం చేసేందుకు ప్రభుత్వ యంత్రాంగాన్ని పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవడంలో ఈ సాదృశ్యం బాగా కన్పిస్తోంది. అయితే మావో ఆరాధనతోనే మోదీ ఆరాధనకు ఎక్కువ పోలికలు కొట్టొచ్చినట్లు కనిపిస్తాయి. డిమానిటైజేషన్ (పెద్ద నోట్ల రద్దు)తో ఆర్థిక వ్యవస్థ అతలాకుతలమవడం మావో 'గ్రేట్ లీప్ ఫార్వార్డ్' కార్యక్రమాన్ని గుర్తుకు తెస్తుంది. మావో విషయంలో వలే, మోదీ ఆదేశాలను (అర్థం చేసుకోలేకపోయినప్పటికీ) తప్పక పాటించాలని దేశ పౌరులను కోరుతున్నారు.

ఒక వ్యక్తిని దైవసమానుడుగా పరిగణించడమనేది 'మార్క్సిజం–లెనినిజం స్ఫూర్తికి విరుద్ధమన్న' కృశ్చేవ్ మాట నిజమైనా, కాకపోయినా వ్యక్తిపూజ అనేది భారతీయ జనతా పార్టీ చరిత్రకు పూర్తిగా విరుద్ధమైన విషయం. ఒక నాయకుడిని ఆరాధించడాన్ని బీజేపీ ఎప్పుడూ వ్యతిరేకిస్తూ వస్తోంది. పార్టీ ప్రయోజనాలనే కాక, జాతి ప్రయోజనాలను కూడా నెహ్రూ, ఇందిర, రాజీవ్, సోనియా గాంధీల ఇష్టాయిష్టాలకు వదిలివేయడం కాంగ్రెస్‌కు పరిపాటి అయిపోయిందన్నది బీజేపీ ఆక్షేపణ. ప్రధానమంత్రిగా వాజపేయి.. ఇందిర వలే ఎన్నడూ తన సహచరులపై ఆధిపత్యం నెరపలేదు. వాజపేయిని తమ 'త్రిమూర్తులు'లో ఒకరుగా మాత్రమే బీజేపీ భావించింది. మిగతా ఇరువురు లాల్ కృష్ణ అద్వానీ, మురళీ మనోహర్ జోషి. రాష్ట్రాలలో అధికారంలో ఉన్న బీజేపీ నాయకులు స్వతంత్రంగా వ్యవహరించేవారు. వాజపేయి వారి ఆలోచనలను, ఆచరణలను గౌరవించేవారు. అయితే మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఒకప్పుడు సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ, దాని పొలిట్ బ్యూరోకు స్టాలిన్ ఎలాంటివాడో ఇప్పుడు బీజేపీ, దాని ప్రభుత్వానికి మోదీ అలాంటివాడుగా పరిణమించారు. అధినేత మాటే అన్నిటా తుది నిర్ణయం.

వ్యక్తిపూజల చరిత్ర ఒక సత్యాన్ని స్పష్టం చేస్తోంది. వ్యక్తిపూజ అనేది ఎప్పుడు ఏ దేశంలో వర్ధిల్లినా అది ఆ దేశానికి వినాశకరంగా పరిణమించిందన్నదే ఆ సత్యం.

(కర్టెసీ: ఆంధ్రజ్యోతి)

# పంచాయతీరాజ్ చట్ట సవరణకు వైఎస్ జగన్ కట్టుబడి ఉండాలి

## -ధన రాజకీయాల కట్టడికి సంస్కరణలు ప్రారంభించాలి-

ఎన్నికల్లో అక్రమ డబ్బు ప్రభావాన్ని, ఇతర అక్రమాల్ని నిరోధించేందుకు ఆంధ్రప్రదేశ్ శాసనసభ నవంబర్ 30న 'పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లు -2020'ని ఆమోదించింది. ఆ బిల్లుపై చర్చకు సమయమివ్వాలని ప్రతిపక్ష తెలుగుదేశం సభ్యులు నినాదాలు చేస్తుండగా, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జోక్యం చేసుకున్నారు. "ఇది ఎన్నికల కమిషన్‌కు సంబంధించిన బిల్లు. 151 మంది సభ్యుల మద్దతుతో సభ ఈ బిల్లును గతంలో సుదీర్ఘంగా చర్చించి ఆమోదించింది. కౌన్సిల్ సవరణలు చేయాలని వెనక్కు పంపింది. దీన్ని మళ్లీ అసెంబ్లీ ఆమోదించటం కేవలం ఫార్మాలిటీ మాత్రమే. ఇదేదో కొత్త బిల్లు అన్నట్లుగా మళ్లీ చర్చ కావాలనటం ఆశ్చర్యంగా ఉంది. ఎన్నికల్లో డబ్బు ప్రభావాన్ని తగ్గించాలని, వ్యవస్థలో మార్పు తేవాలనే ఆరాటం, ఆలోచనతో ఈ బిల్లు తెచ్చాం" అన్నారు.












2021 ఫిబ్రవరిలో ఏపీ పంచాయతీ ఎన్నికలు జరిగాయి. కానీ చట్టసవరణ ప్రభావం గానీ .. ధనరాజకీయాలను అదుపు చేయాలని, వ్యవస్థలో మార్పు తేవాలని ఆరాటపడుతున్నాం అని అసెంబ్లీలో ఎంతో అభినందనీయంగా చెప్పిన మాటల్ని నిలబెట్టుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రయత్నించిన దాఖలాగానీ ఎన్నికల బరిలో ఎక్కడా కనిపించలేదు.

పంచాయతీ ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లోని పలు గ్రామాల్లో ఓటుకు నోట్లు, ప్రలోభాలు యధేచ్ఛగా ప్రవహించాయి. తొలుత ఓటుకు ఒక ప్రధాన పార్టీ వారు కొంత డబ్బు ముట్టచెప్పగా, ఆ తర్వాత ప్రత్యర్థి పార్టీ వారు అంతకంటే ఎక్కువ ఇవ్వటంతో ఓట్ల కొనుగోలు వేలం పాటలాగా మారిపోయింది. పెద్ద పార్టీల్లో వట్టి చేతులతో దాదాపు ఎవరూ ఓట్లు అడగలేదు. ఓటర్లు మొహమాట పడ్డ చోట ఐదొందలన్నా చేతిలో పెట్టే ప్రయత్నం చేశారు. కొన్ని పంచాయతీలలో కోటి రూపాయలకు పైగా ఖర్చు చేశారని అంచనా. ఇలాంటి చోట ఓటుకు రూ.3,000 దాకా పంచారు. కచ్చితంగా గెలిచితీరాలి అనుకున్న చోట్ల, రెబెల్స్‌కి ప్రత్యర్థి పార్టీ మద్దతిస్తున్న చోట ఓటుకు రూ.5,000 నుంచి 15,000 దాకా పంచినట్లు చెబుతున్నారు. ఇక చీరలు, భరిణెలు, ఇతర కానుకల పంపిణీకయితే లెక్కే లేదు.

పంచాయతీరాజ్ చట్ట సవరణకు అనుగుణంగా ఎన్నికలలో ఓటర్ల ప్రలోభ పెట్టకుండా ఏ ఒక్క చర్యా ప్రధాన పార్టీల నుంచి కనిపించలేదు. అధికార వైకాపా అయితే, ఏకగ్రీవాలు, ప్రతిపక్షాల వారిని కొనుగోలు చేయటానికి కూడా డబ్బు గుమ్మరించినట్లు మీడియా సమాచారం. తెలుగుదేశం అధ్యక్షుడి సొంత నియోజకవర్గమయిన కుప్పం ఈ రకమైన డబ్బు రాజకీయానికి బ్లోఅప్ ఉదాహరణగా నిలిచింది. రాయలసీమ, గోదావరి జిల్లాలు, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని పలు పంచాయతీల్లో ఓటుకు రూ.1500కు తక్కువ కాకుండా పంచారు.

ఎస్.సి, ఎస్.టిలకు రిజర్వు అయిన మేజర్ పంచాయతీల్లో ఉప సర్పంచ్ పదవిని దక్కించుకునేందుకు వార్డు సభ్యులుగా పోటీ చేసిన వాళ్లలో కొందరు ఓటుకు రూ.8,000 దాకా పంచినట్లు చెబుతున్నారు. ప్రవాస భారతీయులు కూడా ఈ డబ్బు రాజకీయంలో భాగమయ్యారు. ఈ ఎన్నికలు పార్టీల గుర్తులపై జరగకపోయినా, వైకాపా, తెలుగుదేశం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పోటీపడ్డాయి. అభ్యర్థులకంటే పార్టీలే ఎక్కువ చోట్ల డబ్బు వెదజల్లాయి. మొత్తంగా ధన ప్రభావం తగ్గటం మాట అలా ఉంచి, ఎన్నడూ లేనంత విచ్చలవిడిగా ఈసారి ఏపీ పంచాయతీ ఎన్నికల్లో చట్టవిరుద్ధంగా డబ్బు పంపిణీ జరిగిందని ఆ బహిరంగ రహస్యంపై విశ్లేషణలు చెబుతున్నాయి.

ఆ తర్వాత 2021 మార్చిలో జరిగిన ఏపీ మునిసిపల్ ఎన్నికల్లో కూడా అదే తరహా ధనరాజకీయం కొనసాగింది.

పట్టణ ప్రాంతాలు కావటంతో సాంకేతికతకు దొరకకుండా పలు జాగ్రత్తల్ని పార్టీలు పాటించాయి. సీసీ కెమెరాలలో చిక్కకుండా జాగ్రత్తలు పాటించటం, వాటి సంఖ్య మరీ ఎక్కువ ఉన్న వీధుల్లో పంపిణీ చేయకుండా ఉండటం, డిజిటల్ లావాదేవీల రూపంలో చెల్లింపులు వంటి పద్ధతుల్ని అనుసరించాయి. రోజువారీ కూలి చేసుకునేవారి మీద అభ్యర్థులు ఎక్కువ దృష్టి పెట్టారు. తమకు ఓటు పడదని అనుమానం ఉన్న చోట రెట్టింపు డబ్బును పంచారు. కొన్నిచోట్ల మేళతాళాలతో ఇంటింటి ప్రచారం చేస్తూ జాకెట్ ముక్కల్లో రూ.2,000 నోటు పంచారు. కొందరు అరటిగెలలను పంచారని వార్తలొచ్చాయి. అధికారులకు ఈ అంశాలపై ఫిర్యాదులు వచ్చినా, కొన్నిచోట్ల లెక్కచెప్పని నగదును స్వాధీనం చేసుకున్నా మొత్తంగా అయితే ఓటుకు నోటును నిలువరించటంలో మాత్రం వారు నిస్సహాయులే అయ్యారు.

పంచాయతీ, మునిసిపల్ ఎన్నికల్లో అధికార వైకాపాకు లభించిన ఘనవిజయం, ఓట్ల శాతం కేవలం డబ్బు పంపిణీతో వచ్చాయనటం అసంబద్ధం. ఏ కారణాల చేతయినా కావచ్చు.. ఆ పార్టీ ప్రజాదరణ చెక్కుచెదరలేదని ఈ ఎన్నికలు విస్పష్టంగా రుజువు చేశాయి. అయితే డబ్బు వెదజల్లకుండా ఉంటే మాత్రం వైకాపాకు ఈ స్థాయి గెలుపు సాధ్యమై ఉండేది కాదన్నది కూడా వాస్తవం. డబ్బు రాజకీయం చేయకుంటే తెలుగుదేశం, ఇంకొన్ని పక్షాల అభ్యర్థులు చాలాచోట్ల అసలు బరిలోనే ఉండేవారు కాదు. ఓటుకు నోట్లు పంచిన ప్రధాన పార్టీల మధ్య వైకాపా పట్ల సగానికిపైగా ఓటర్లు స్వేచ్ఛగా మొగ్గు చూపారు.. అంటే సముచితంగా ఉంటుందేమో.

పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించి మరీ ఓటర్లపై డబ్బు, ఇతర ప్రలోభాల నిరోధించేందుకు చర్యలు ప్రారంభించిన ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆత్మపరిశీలన చేసుకోవాలి. అన్ని సాంప్రదాయ పార్టీలూ డబ్బు రాజకీయం అనే విషవలయంలో కూరుకుపోయి ఉన్నందున.. మీరు మాట తప్పారు అనే విమర్శ ముఖ్యమంత్రినుద్దేశించి ప్రధాన పార్టీల నుంచి రాకపోవచ్చు. కానీ ఈ వైఫల్యానికి ఏదోక రోజు జవాబు చెప్పాల్సి వస్తుంది. రాజకీయ సంకల్పం ఉండాలేగానీ.. ఇందుకు ఆచరణసాధ్యమైన వ్యవస్థీకృత పరిష్కారాలు సిద్ధంగా ఉన్నాయి. 2020లో కూడా ఇందుకు పెద్ద ప్రయత్నం జరిగింది. జయప్రకాష్ నారాయణ్ ఆధ్వర్యంలోని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా చొరవతో 'ఇండియన్ డెమోక్రసీ ఎట్ వర్క్' వేదికగా ధనరాజకీయాలు (మనీపవర్ ఇన్ పాలిటిక్స్)పై పార్టీలకతీతంగా హైదరాబాద్‌లో జాతీయ సదస్సు జరిగింది. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ), యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (హెచ్‌సీయూ) కూడా భాగస్వాములుగా ఉన్న ఈ సదస్సులో.. రాజకీయ నాయకులు, పౌర సమాజ బృందాలు, సామాజిక కార్యకర్తలు, మీడియా ప్రతినిధులు, సివిల్ సర్వెంట్లు, న్యాయకోవిదులు, వ్యాపారవేత్తలు, విద్యావేత్తలు, ఇతర పలు రంగాలకు చెందిన వారూ దేశవిదేశాల నుంచి పాల్గొన్నారు. రాజకీయాల్లో మనుగడకు, నిజాయతీగా ఏదైనా సాధించటానికి డబ్బు పెద్దభారంగా మారిందని అందరూ అంగీకరించారు. ఇంత డబ్బు రాజకీయాన్ని ఎన్నికల సంఘం మాత్రమే కట్టడి చేయలేదు. రాజకీయ సంకల్పం, సమగ్ర ఎన్నికల సంస్కరణలే పరిష్కార మార్గం. ఇందుకు ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక జరగాలని, దామాషా ఎన్నికల పద్ధతిని ప్రవేశపెట్టాలని, స్థానిక ప్రభుత్వాలకు నిధుల్ని, అధికారాల్ని బదిలీ చేయాలని సదస్సు ముగింపులో ఏకాభిప్రాయ కార్యాచరణ పరిష్కారాలతో విడుదల చేసిన 'హైదరాబాద్ డిక్లరేషన్' పత్రం పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ సచివాలయాల వ్యవస్థ వికేంద్రీకరణ దిశగా మంచి అడుగేగానీ, అధికారాలు మళ్లీ పైస్థాయిలోనే ఉండటం వల్ల పెద్ద ఫలితాలు రావు. అందువల్ల ధనరాజకీయాల కట్టడికి, వ్యవస్థలో మార్పునకు మరింత లోతైన, ఆచరణసాధ్యమైన పరిష్కారాల మీద ముఖ్యమంత్రి దృష్టి పెట్టటం అవసరం. తగిన సంస్కరణలు లేకపోతే ప్రజాదరణ ఎలా కరి మింగిన వెలగపండులా మారిపోతుందో తెలుగుదేశం అనుభవం నుంచయినా వైఎస్ జగన్ గుర్తించాలి.

**పథకాల ఫలితాలపై శాస్త్రీయ మదింపు జరగాలి**

ఎన్నికల అక్రమాల్లో కేవలం డబ్బు మాత్రమే కాదు.. ఉచితాలు, తాత్కాలిక పథకాలు కూడా ప్రభావం చూపుతున్నాయి. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో తమిళనాడులో, పశ్చిమ బెంగాల్‌లో హామీల్ని యథాతథంగా అమలు చేస్తే చివరికి ప్రజల పరిస్థితి ఏమవుతుందన్న ఆవేదన కలుగక మానదు. వెనిజులా ఉదాహరణ కళ్ల ముందే కనిపిస్తున్నా హామీల్ని ఆ రకంగా ఇచ్చేస్తున్నారు. ఏపీలో నవరత్నాల పేరుతో తన ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అద్భుత ఫలితాలనిస్తున్నాయని వైఎస్ జగన్ భావిస్తుండవచ్చు. కానీ వాటి వాస్తవ ఫలితాలేంటో, ప్రజల ఎదుగుదలకు అవి ఎంతమేర దోహదం చేస్తున్నాయో తులనాత్మక అధ్యయనం అవసరం. ప్రజలకు బదిలీ చేస్తున్న నగదు.. లక్షించిన అంశాలకు ఖర్చవుతోందా, వృథా అవుతోందా విస్తృత శాంపిల్ సర్వే చేయించాలి. కొవిడ్ వల్ల జనజీవితంలో తలెత్తిన ఆర్థిక అస్తవ్యస్త పరిస్థితుల్ని పరిగణలోకి తీసుకుంటూనే శాస్త్రీయంగా ఈ మదింపు జరగాలి. ఉచితాల అంశాన్ని కూడా ధనరాజకీయాలపై ఇండియన్ డెమోక్రసీ ఎట్ వర్క్ (ఐడీఏడబ్ల్యూ) సదస్సు 2020 చర్చించింది. "పార్టీల, వ్యక్తిగత ఎన్నికల ప్రయోజనాల కోసం ప్రజాదరణ పొందిన పథకాల రూపంలో ప్రభుత్వాలు అందించే స్వల్పకాలిక ప్రయోజనాలు పేదలు, మధ్యతరగతి ప్రజల దీర్ఘకాలిక ప్రయోజనాలను ప్రతికూలంగా ప్రభావితం చేస్తున్నాయి. రాష్ట్రాల్లో ఎడాపెడా పార్టీలు ఇస్తున్న హామీలను కట్టడి చేసేందుకు ఎఫ్ఆర్‌బీఎం చట్టం తరహాలో చట్టం తీసుకురావాల్సి ఉంది. బడ్జెట్‌లో ఎంత మేర హామీల వ్యయం ఉండాలో స్పష్టమైన గీత గీయాలి. పాలన దివాలా తీయకుండా ఆర్థిక పరిస్థితికి తగ్గట్లుగా హామీలు ఉండేలా చేయాలి. 70 ఏళ్ల స్వతంత్ర భారతంలో ఇంకా 20 శాతం మంది పేదరికంలో, 20 శాతం మంది నిరక్షరాస్యులుగా

ఉండటంపై పార్టీలు, ఆర్థిక వేత్తలు, సామాజిక వేత్తలు, మీడియా, పౌర సమాజం ఆలోచన చేయాలి. స్వల్పకాలిక ప్రయోజనాలు–దీర్ఘకాలిక అభివృద్ధి–పేదరిక నిర్మూలన లక్ష్యాల మధ్య సహేతుక సమతుల్యతకు కృషి చేయాలి" అని సదస్సు విజ్ఞప్తి చేసింది.

డబ్బు రాజకీయాలు, శాస్త్రీయ మదింపు లేకుండా ఉచితాలు, తాత్కాలిక పథకాలను కొనసాగించటం తెలంగాణలోనూ సమస్యగా ఉన్నాయి. ఈసారి ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ ఓటుకు నోట్లు, ఇతర పంచుళ్లు యధేచ్ఛగా జరిగాయి. పట్టభద్రులకు కూడా ఓటుకు రూ.3,000 - 6,000 దాకా పంచినట్లు సమాచారం. ఆన్ డిమాండ్ కొన్ని సంఘాలకు కూడా లక్షల్లో పంపిణీ జరిగినట్లు చెబుతున్నారు. చదువుకున్నవారు మద్యం, స్వీటు బాక్సులు, గొర్రెలు వంటి వాటిని కూడా అడిగిమరీ పుచ్చుకున్నట్లు సమాచారం. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో ఓటర్లకు గూగుల్‌పే, పేటీఎం ద్వారా కొన్ని రాజకీయ పార్టీలు నగదు బదిలీ చేసినట్లు వచ్చిన ఫిర్యాదులను సైబర్ నేరాల కింద దర్యాప్తు చేయాలని పోలీసు శాఖను కోరినట్లు తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి డాక్టర్ శశాంక్ గోయల్ చెప్పారు.

డబ్బు, ప్రలోభాలు లేకుండా గెలవటమనే అరుదైన సంఘటనల్ని, ప్రత్యేక పరిస్థితుల్ని సాధారణ రాజకీయంగా మార్చే సంస్కరణలు ఇప్పుడు భారతదేశం మొత్తానికీ అవసరం. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఈ అంశాలపై తెలంగాణ ముఖ్యమంత్రితో కూడా చర్చించి ప్రయత్నాన్ని ప్రారంభించాలి. ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా పార్టీలకతీతంగా చేస్తున్న విస్తృత కృషిని, సహకారాన్ని ఇందుకు ఉపయోగించుకోవచ్చు. స్థానిక ప్రభుత్వాల ఎన్నికల్లో తనకు లభించిన అద్భుత విజయాన్ని ధనరాజకీయాలను సంస్కరించేందుకు వైఎస్ జగన్ పెట్టుబడిగా పెడతారని ఆశిద్దాం.

## ఏపీ స్థానిక ఎన్నికల వ్యయం రూ.6,900 కోట్లు

ఆంధ్రప్రదేశ్‌లో తాజాగా జరిగిన ఈ స్థానిక ప్రభుత్వాల ఎన్నికల్లో రాజకీయ పార్టీలన్నీ కలిపి రూ. 6,900 కోట్ల వరకు ఖర్చు చేసినట్లు ఎడిటర్స్ అసోసియేషన్, జనవిజ్ఞాన వేదిక, బెటర్ ఆంధ్రప్రదేశ్ (బాప్) సంస్థల సంయుక్త అధ్యయనం అంచనా వేసింది. ప్రచారం, కార్యకర్తల నిర్వహణ, మద్యం, ఓట్ల కొనుగోళ్లు, ఏకగ్రీవాల కోసం వెచ్చించిన వ్యయం మొత్తం కలిపి అంచనాలు రూపొందించామని ఎడిటర్స్ అసోసియేషన్ వెల్లడించింది.

+ రాష్ట్రంలోని పంచాయతీల్లో ఏకగ్రీవాలతో కలిపి 1,31,023 వార్డులకు ఎన్నికలు జరిగాయి. ఒక్కో వార్డులో వైకాపా, తెదేపా, ఇతర పార్టీలన్నీ కలిపి మూడో వర్గంగా లెక్కిస్తే ఒక్కొక్కరు కనీసం రూ.లక్ష వ్యయం చేశారు. వార్డుకు రూ.3 లక్షలు ఖర్చు లెక్కేసినా.. మొత్తం వ్యయం రూ.3,900 కోట్లు దాటుతోంది.

+ మునిసిపాలిటీల్లో ఒక్కో వార్డులో ఒక్కొక్కరు రూ.20 లక్షల చొప్పున మూడు వర్గాలు రూ.60 లక్షలు ఖర్చు చేశాయి. మొత్తంగా 1634 వార్డుల్లో రూ.980 కోట్లకు పైగా వెచ్చించారు.

+ నగర పాలక సంస్థల్లో ఒక్కో డివిజన్‌లో ఒక్కో వర్గం కనీసం రూ.కోటి చొప్పున మూడు వర్గాలు డివిజన్‌కు రూ.3 కోట్లకు పైనే ఖర్చు చేశాయి. మొత్తం 671 డివిజన్లకు కలిపి రూ.2 వేల కోట్లకు పైనే ఖర్చయింది.

## తెలంగాణ మునిసిపల్ ఎన్నికల్లో ఓటుకు రూ.30,000

ధనరాజకీయాల్లో తెలంగాణ పరిస్థితి కూడా భిన్నంగా లేదు. ఏపీ కంటే ఒక ఆకు ఎక్కువే అన్నట్లుంది. ఒక్కో డివిజన్‌కు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఒక్కొక్కరు కోటి నుంచి రూ.3 కోట్ల వరకు ఖర్చు చేసిన జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పంచుడును అలా ఉంచితే.. 2020 జనవరిలో జరిగిన తెలంగాణ మునిసిపల్ ఎన్నికలలో ఓటుకు రేట్లు గంటగంటకీ పెరిగాయి. చౌటుప్పల్‌లో అత్యధికంగా ఓటు రూ.30,000 పలకగా, ఆదిభట్లలో 15,000, బండ్లగూడలో 10,000 పలికింది. మెజారిటీ మునిసిపాలిటీల్లో ఓటుకు రూ.1000 నుంచి 5,000 దాకా పంచారు. బంగారం, చీరలు, కుంకుమ భరిణెలు, చికెన్, మద్యం.. ఇవన్నీ అదనం. రంగారెడ్డి జిల్లా తుర్కయాంజాల్‌లో ఓ కుటుంబంలో ఆరుగురు ఓటర్లుండగా, రెండు ప్రధాన పార్టీలు రూ.30,000 చొప్పున ఇవ్వగా, మరో పార్టీ ఓటుకు మూడు వేల చొప్పున రూ.18,000 ఇచ్చింది. దీంతో మొత్తంగా ఆరు ఓట్లకు రూ.78,000 వచ్చాయని ఓ పత్రిక సవివరంగా రిపోర్టు చేసింది.


నోటు ముందు ఓటు విలవిల

ఓటుకు రూ. 30 వేలు!


ఓటర్లకు ప్రలోభాలు

ప్రలోభాల పే!

# హల్వా మ్యానిఫెస్టోలు

- శైలేష్ నిమ్మగడ్డ

ఎందుకండీ నవ్వుతున్నారు? ఓహో... అన్నాడీఎంకే ప్రకటించిన 'ఓటుకు వాషింగ్ మెషిన్' పథకం గురించా? ఏముంది ఇందులో అంతలా నవ్వుకోవడానికి? కారు కొంటే ఫ్రిజ్ ఉచితం... ఫ్రిజ్ కొంటే జ్యూసర్ ఉచితమంటున్నప్పుడు- ఓటేస్తే వాషింగ్ మెషిన్ ఉచితమంటే తప్పేముంది? అంటే... వ్యాపారానికో నిబంధన, రాజకీయానికో నియమమా? ఇదెక్కడి అన్యాయమండీ! అసలు వ్యాపారస్తులతో పోలిస్తే రాజకీయ నాయకులు ఎందులో తక్కువ? కొనుగోలుదారులకు గరికో పరకో ఉచితంగా ఇచ్చేవారి కంటే... ఎదురు కట్నాలిచ్చి మరీ ఓట్లు కొనుక్కునే వాళ్లెంత గొప్పవారు! ఆ ధర్మప్రభువుల దయాగుణానికి దండం పెట్టాల్సిందిపోయి- పరిహాసాలు చేయడం మర్యాదస్తుల లక్షణమేనా?




ఓట్లు పడాలంటే నోట్లు పంచాలన్నది నిన్నటితరం నమ్మకం. నోట్లతోపాటు నోరూరించే హామీలూ గుప్పించాలన్నది నేటి మేటి నాయకశ్రేణుల అనుభవజ్ఞానం. కాబట్టి ప్రజాసేవలో పండిపోయిన పెద్దల దృష్టిలో ఎన్నికల హామీలంటే... హల్వా పళ్లాలే! మ్యానిఫెస్టో రూపకల్పన అంటే హల్వా వండటమే! దినుసులన్నీ సరిగ్గా పడి రుచి కుదిరిందా... ఓట్లు వరదలై పారతాయి. ఓటర్లతో లొట్టలేయించి వారిని బుట్టలో వేసుకునే ఈ హల్వా మ్యానిఫెస్టోలే మన ప్రజాస్వామ్య కీర్తికిరీటంలో కలికితురాళ్లు! వీటి తయారీలో చెయ్యితిరిగిన మన పార్టీల ప్రతిభ ముందు పిట్టలదొరలూ దిగదుడుపే!

ఎన్నికల పండగను పురస్కరించుకుని ఓటర్ల పంచభక్ష్య పరమాన్నాలు వడ్డించడంలో తమిళనాడు నాయక నలభీములతో పోటీపడేవారే లేరు. కలర్ టీవీలు, ల్యాప్‌టాప్‌లతో మొదలైన వారి వడ్డన ఇప్పుడు ఇంటింటికీ వాషింగ్ మెషీన్లు, ఉచిత డేటాల వరకూ వచ్చింది. 'అమ్మ' దయతో కుర్చీలెక్కిన అధికారపక్ష 'అన్నలు' ఈసారి ఆడపడుచులకు పుట్టింటి కట్నంగా వాషింగ్ మెషిన్లు కొనిస్తామంటున్నారు. ఏడాదికి ఆరు ఉచిత గ్యాసుబండలతోపాటు సోలార్ స్టవ్‌లనూ ఇంటికి పంపిస్తామంటున్నారు. వీటన్నింటికీ మించి ఏకంగా బంగారమే పెడతామంటున్నారు. ఎంత మంచి అన్నయ్యలు! ఇలా చెమటోడ్చి మరీ రాష్ట్రం అప్పులను ఆరు లక్షల కోట్ల దాకా తీసుకొచ్చినవారు, కావాలంటే ఇంకో అరవై లక్షల కోట్ల అప్పులు చేసైనా సరే- ఈ పెట్టుపోతల్లో ఏ లోటూ రానివ్వరు!

అధికారపక్షమేనా అన్నీ పెట్టేదీ... మేమూ పులిహోర కలపగలమంటూ రంగంలోకి దిగింది ప్రతిపక్ష డీఎంకే. ఏకంగా అయిదొందల హామీలతో 'ఫ్యామిలీ ప్యాక్' ప్రకటించింది. వాటిలో ముఖ్యమైంది... గృహిణులకు నెలకు వెయ్యి రూపాయలిస్తామన్న వాగ్దానం! దీన్ని చూడగానే 'లోకనాయకుడి' పార్టీ లబోదిబోమంది. ఈ 'రెసిపీ' మీద పేటెంట్ హక్కులు మావే... మీ పేరెలా వేసుకుంటారంటూ వెర్రి ఆవేశం తెచ్చుకుంది. నిజానికి కమలహాసనుడు ఉదారంగా ప్రసాదించిన వరమేమిటంటే... వారి పార్టీ అధికారంలోకి వస్తే గృహిణులకు జీతమిస్తారట! ఎన్ని పని గంటలకు ఎంత వేతనమన్నది వారు చెప్పలేదు. అన్నట్టు జీతభత్యాలనగానే హాజరుపట్టికలు తప్పనిసరి కదా! అంటే గృహిణులందరికీ బయోమెట్రిక్ ఐడెంటిటీ కార్డులిస్తారో ఏమిటో మరి! ఇలాంటి సృజనాత్మక హామీలకు మరికొన్ని కలిపితే బాగుండేది... చంటిపిల్లలకు చంద్ర మండలం మీద ఉయ్యాలలు కట్టిస్తాం, సకుటుంబ సపరివార సమేతంగా అంతరిక్ష యాత్రలకు పంపిస్తాం లాంటివి ఏవైనా ప్రకటించాల్సింది... ఇంకా కొత్తగా ఉండేది!! కనీసం మధ్యతరగతి వారికి 'సులభ వాయిదాల్లో సొంత విమానాలు' అనైనా చెప్పి ఉండాల్సింది... హల్వా రుచీ అమోఘంగా ఉందని చెప్పుకొనేవారందరూ!!

తమిళనాడు నుంచి అటు కేరళ వెళ్తే... ముఖ్యమంత్రి పినరయి విజయన్ తనకు తానే మార్కులేసుకుంటున్నారు. 2016 ఎన్నికల్లో ఇచ్చిన 600 హామీల్లో 570 నెరవేర్చేశామని చెప్పేశారు. ఆయన చెప్పారంటే చేసినట్టేనని అనుచరులు స్తుతికైవారాలు పాడుతున్నారు. నిజమేమిటో... ఆ అనంత పద్మనాభుడికే తెలియాలి! వచ్చే అయిదేళ్లలో యువతకు 20 లక్షల కొత్త ఉద్యోగాలిస్తామంటున్న అధికార పక్షం ఇప్పటికే ఆ పని చేసి ఉంటే వద్దనేవారెవరు? అంతేలెండి... ఊరించడానికి ఏదో ఒకదాన్ని అట్టిపెట్టుకోకపోతే ఓట్లెలా పడతాయి? సరే... అలా తూర్పువైపు తిరిగితే ఏటా అయిదు లక్షల ఉద్యోగాలు, కుర్రాళ్లకు క్రెడిట్ కార్డులు వంటి హామీలతో మమతా బెనర్జీ బెంగాలీ బాబులకు రంగుల చిత్రమే చూపించేశారు. అదే ఊపులో ప్రతిపక్షాలు ఇంకాస్త రెచ్చిపోయి సృజనాత్మక హామీలతో జనానికి పగటిపూటే నక్షత్రాలను దర్శింపజేశాయి.

ఏది ఏమైనా- ఎన్నికలంటే ఎన్ని కలలు... ఎందరి నేతల ఆశలు? అవి తీరాలంటే ఓటర్లకు బెల్లంముక్కలు తినిపించాల్సిందేనని తీర్మానించుకుని మరీ తెగ పెడుతున్నారు. కానీ, తీపి మరీ ఎక్కువైనా వెగటు పుడుతుందన్న విషయం వారికి తెలుసో లేదో!

(కర్టెసీ: ఈనాడు)

# జుగాడ్ ఓటర్ల ఉద్యమం

ప్లాట్ నం: బి- 64, రోడ్ నం. 10, హుడా కాలనీ,
సరూర్‌నగర్, హైదరాబాద్ - 500 035
ఈమెయిల్: mpstexer@gmail.com



ఎం. పార్థసారథి
(ఫౌండర్ ప్రెసిడెంట్)

## స్వాగతం!

మేధావి, విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి గౌరవనీయులైన చంద్రకుమార్ గారు, స్వయంగా విరాళమిచ్చి జుగాడ్ ఓటరుగా నమోదు అయ్యారని తెలియచేయడానికి సంతోషిస్తున్నాను. నేతాజీ సుభాష్ చంద్ర బోస్ నెలకొల్పిన ఆజాద్ హింద్ ఫవుజ్‌లో కార్యకర్తగా పనిచేసిన స్వాతంత్ర్య సమరయోధుడు రాంచందర్ మరియు వారి సతీమణి భగీరథీ బాయిలకు జన్మించిన చంద్రకుమార్ గారు సూక్ష్మగ్రాహి, రచయిత, సమాజసేవాతత్పరులు. పార్టీ ఫండ్ కొరకు ప్రజల మీదనే ఆధారపడాలని విశ్వసిస్తారు చంద్రకుమార్ గారు. అందుచే, కార్మికుల నుండి, రైతుల నుండి, ఉపాధ్యాయుల నుండి, ఉద్యోగుల నుండి, మేధావుల నుండి, కులవృత్తులవారి నుండి, చేతివృత్తులవారి నుండి కార్యకర్తలు ముందుకు వచ్చి ఫండ్-సేకరణకు, పార్టీ నిర్మాణానికీ పూనుకోవాలి.

అత్యధిక జుగాడ్ ఓటర్ల సమాంతర ఆలోచనలతో, మన కష్టార్జితమైన డబ్బుని మన కోసం నిర్మించతలబెట్టిన ఉద్యమ/పార్టీ ఖర్చుల నిమిత్తం (పారదర్శకంగా 50+25+15+10 ప్రాతిపదికగా) పరిమిత విరాళాల రూపేణా (రూ.2 వేలు, 5 వేలు, లేదా 10 వేలు) ధనసమీకరణ జరుగుతుంది. ఏ ప్రభుత్వమైనా, "సంపదని సృష్టిస్తేనే సంపదను ఖర్చు పెట్టగల అధికారానికి అర్హతను సంపాదించుకుంటుంది". ప్రతీ **MLA** నియోజకవర్గానికీ మూలనిధిగా ఒక కోటి రూపాయలు సేకరించుకోవాలి. రాజ్యాంగంలోని పదాలకు అందరికీ అర్థమయ్యే రీతిలో వివరణాత్మక నిర్వచనాలతో- నమ్మకంపై ఆధారపడిన పరస్పర సహకారం ప్రాతిపదికగా మన పార్టీని మనమే నిర్మించుకుని, తద్వారా స్వయంపాలన సాధించుకుందాం. పార్టీ నిర్మాణంలోనూ విధి విధానాల నిర్ణయాలలోనూ క్రమసంఖ్యలో మొదట వచ్చిన 25 మంది కార్యకర్తలకూ ప్రాధాన్యత ఉంటుంది.

స్వతఃసిద్ధంగా ప్రతి వ్యక్తిలోనూ, ప్రతి వ్యవస్థలోనూ అంతర్లీనమైయున్న అవినీతినీ లంచగొండితనాన్నీ "లొసుగులులేని చట్టబద్ధ పాలనా వ్యవస్థ ద్వారా" నిర్మూలించడమే ఏకైక లక్ష్యంగా కృషి చేస్తూ, అందరికీ అవసరమైన విద్యా, ఆరోగ్యం వంటి మౌలిక అవసరాల నిర్మాణం కోసం మొదటి అయిదు సంవత్సరాలూ ఉభయ తెలుగు రాష్ట్రాలలోనూ పనిచేద్దాం. ఈ సందర్భంలో ఒక విశ్రాంత **IAS** మేధావి ఫిబ్రవరి నెలలో నిర్వహించిన 'రూల్ ఆఫ్ లా' అనే సదస్సులో విడుదల చేసిన హైదరాబాద్ డిక్లరేషనుకి జుగాడ్ ఓటరుగా నాయొక్క వ్యక్తిగతమైన మద్దతుని ప్రకటిస్తున్నాను. చట్టబద్ధపాలన పేరుతో ప్రస్తుతం జరుగుతున్న చట్టబద్ధదోపిడీని కూడా ఓటర్లందరూ సంఘటితంగా ఎదుర్కోవాలి. మనది ఓటర్ల జాతి. కూలిపని చేసుకునే ఓటరైనా, **IAS** అధికారైనా, ప్రభుత్వోద్యోగి అయినా, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తియైనా, ఓటు విలువ అందరికీ సమానమే. మనకి రాజ్యాంగం ప్రసాదించిన స్వయంపాలనాధికారాన్ని ధనికవర్గాలకు చెందిన కొందరు వ్యక్తులు నేడు వివిధ రకాల పార్టీల పేర్లతో హస్తగతం చేసుకుని మనని శాసిస్తున్నారు. రాబోయే, ఓటర్ల పార్టీ ద్వారా నమూనా మార్పు **(paradigm shift)** సంభవిస్తుంది. డబ్బు మనది - పార్టీ మనది - ప్రభుత్వం మనది - అధికారం మనది. అదే మనం సంకల్పించిన ఆత్మవంచనలేని స్వపరిపాలన!

ఓటర్లుగా కోల్పోయిన అధికారాన్ని పునఃకైవసం చేసుకుందాం రండి. ఆలస్యం అమృతం విషం!

**Please contact: M.Parthasarathy (9866416798) with (1) your MLA Constituency name (2) your name and gender (3) your age (4) your Contact. Cell No:**

**Advt.**

# అదిరే అంకెలతో తెలంగాణ బడ్జెట్ 2021-22

కొవిడ్ వల్ల తలెత్తిన నిన్నటి నష్టాల్ని, నేటి భయాల్ని లెక్కచేయకుండా రేపటి ఆదాయం పట్ల ఆశావహ దృక్పథంతో తెలంగాణ ప్రభుత్వం భారీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. గతేడాది కరోనా విపత్తుకు ముందు రూ. 1.82 లక్షల కోట్లతో ప్రవేశపెట్టిన (కరోనా సమస్యల నేపథ్యంలో రూ. 1.66 లక్షల కోట్లకు కుదించారు) బడ్జెట్ కంటే తాజా బడ్జెట్ రూ. 48,000 కోట్లు ఎక్కువ. అప్పులు, కేంద్ర గ్రాంట్లు, భూముల అమ్మకాలు, పన్నుల్ని ఆదాయ మార్గాలుగా లెక్కేశారు.

ఈ ఆర్థిక సంవత్సరం పన్నుల రాబడి కింద రూ. 92,910 కోట్లను (16,000 కోట్ల పెరుగుదల) చూపెట్టగా.. పన్నేతర ఆదాయం కింద రూ. 30,557 కోట్లు వస్తాయని అంచనా వేశారు. కేంద్ర పన్నుల్లో వాటా గతం కంటే తక్కువగా రూ. 13,990 కోట్లు, గ్రాంట్స్ ఇన్ ఎయిడ్ పద్దు గతం కంటే ఎక్కువగా రూ. 38,669 కోట్లు చూపెట్టారు. ఆదాయవనరుల్లో జీఎస్‌టీ, అమ్మకపు పన్ను కలిపి రూ. 57,500 కోట్లు, మద్యం ద్వారా రూ. 17,000 కోట్లు, రిజిస్ట్రేషన్ల ద్వారా రూ. 12,500 కోట్లు వస్తాయని అంచనా వేశారు. బహిరంగ మార్కెట్ నుంచి రుణాల ద్వారా రూ. 47,500 కోట్లు సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ లెక్కన అప్పులు కాకుండా రెవెన్యూ వసూళ్ల ద్వారానే దాదాపు రూ. 1.76 లక్షల కోట్లు ఖజానాకు సమకూరాల్సి ఉంది. ఇక రెవెన్యూ ఖర్చు రూ. 1.69 లక్షల కోట్లకు పైగా ఉంటుందని బడ్జెట్ అంచనాల్లో పేర్కొన్నారు. రెవెన్యూ మిగులు రూ. 6,743 కోట్లుగా, ద్రవ్యలోటు రూ. 45,509 కోట్లుగా అంచనా వేశారు. కరోనా ప్రభావం తీవ్రంగా ఉన్న 2020-21 బడ్జెట్‌లో కేటాయింపుల ఆదాయం మొత్తం ఖర్చయిందని, గత బడ్జెట్‌లో రెవెన్యూ మిగులు లేకపోగా ద్రవ్యలోటు రూ. 42,399 కోట్లు ఉందని సవరించిన అంచనాలను సభకు ప్రభుత్వం తెలియచేసింది.

బడ్జెట్లో సాగునీరు, పంచాయతీరాజ్, పురపాలక రంగాలకు ప్రాధాన్యత పెరగగా, రైతుబంధు, రుణమాఫీ, వ్యవసాయ యాంత్రీకరణ, సంక్షేమాలకు గణనీయ కేటాయింపులు చేశారు. ప్రాంతీయ రింగ్‌రోడ్డుక భూసేకరణకు కేటాయింపుల ద్వారా రాజధాని రియల్ ఎస్టేట్‌కు ఊపు తెచ్చే ప్రయత్నం చేశారు. సీఎం దళిత సాధికారత పేరుతో దళితుల అభివృద్ధికి కొత్త పథకాన్ని ప్రవేశపెట్టారు. ఎన్నికలు జరిగే కార్పొరేషన్లపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. సాగర్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పలు ఎత్తిపోతల పథకాలకు బడ్జెట్లో నిధులిచ్చారు. ఎమ్మెల్యేలకు ప్రత్యేక అభివృద్ధి నిధులను 3 నుంచి 5 కోట్లకు పెంచటంతోపాటు



తొలిసారిగా ఎంపీపీలు, జడ్పీలకు ప్రత్యేక అభివృద్ధి నిధుల కింద రూ. 500 కోట్లు కేటాయించారు. గిరిజన సాగు భూములకు త్రీఫేజ్ విద్యుత్, గొల్లకుర్మలకు గొర్రెల పంపిణీకి ప్రాధాన్యమిచ్చారు. విద్యుత్ సబ్సిడీలకు రూ. 11,000 కోట్లు ఇచ్చారు. సమగ్ర భూసర్వేకు రూ. 400 కోట్లు కేటాయించారు. బడ్జెట్ పెంపుతో పోలిస్తే వైద్యం, విద్యలకు నామమాత్రంగానే పెంచారు. ఎంఎంటీఎస్ రెండో దశ ప్రాజెక్టుకు వరుసగా రెండోసారీ కేటాయింపు చేయలేదు.

రాష్ట్ర 2021-22 బడ్జెట్‌ను ఆర్థికమంత్రి హరీష్‌రావు శాసనసభలో ప్రవేశపెట్టారు. రూ. 2,30,825.96 కోట్ల ఆదాయ, వ్యయ అంచనాలను ప్రతిపాదించారు. మండలిలో బడ్జెట్‌ను మంత్రి వేముల ప్రశాంతరెడ్డి ప్రవేశపెట్టారు.

ప్రభుత్వం ఈసారి బడ్జెట్‌లో వ్యవసాయం, సహకారానికి రూ. 25 వేల కోట్లు కేటాయించింది. అన్ని స్థాయిల్లో విద్యకు రూ. 13,500 కోట్లు ఇచ్చింది. బడుల్లో మౌలిక వసతుల పెంపునకు వచ్చే రెండేళ్లలో రూ. 4,000 కోట్లు వెచ్చిస్తున్నట్లు ఆర్థికమంత్రి తెలిపారు. వైద్య, ఆరోగ్యానికి 6,295కకేటాయించారు. ఇందులో వ్యాధుల నివారణకు ప్రాధాన్యమిస్తూ ఆరోగ్యమిషన్‌కు రూ. 1213 కోట్లు ప్రతిపాదించారు. పంచాయతీరాజ్ శాఖకు రూ. 29,271 కోట్లు, పురపాలక శాఖకు రూ. 15,000 కోట్లు ఇచ్చారు. సాగునీటి రంగానికి రూ. 16,391 కోట్లకు పైగానే కేటాయించారు. మెట్రో రైలుకి రూ. 1000 కోట్లు, హైదరాబాద్ తాగునీటి పథకాలకు రూ. 2,381 కోట్లు, వరంగల్, ఖమ్మం కార్పొరేషన్లకు రూ. 250, 150 కోట్ల చొప్పున కేటాయించారు. ఆర్టీసీకి బడ్జెట్‌లో రూ. 1500 కోట్లు కేటాయిస్తూనే, మరో రూ. 1500 కోట్ల మేర రుణాలకు పూచీకత్తు ఇచ్చేలా ప్రతిపాదనలు చేశారు.

**ఇంకొన్ని కేటాయింపులు (రూ. కోట్లలో):**

ఆర్థిక శాఖ- 45,923, రవాణ, రోడ్లు భవనాలు- 8,788,

ప్రణాళిక విభాగం- 7,182, హోం- 6,465, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి- 5,588, వెనుకబడిన తరగతుల సంక్షేమం- 5,522, రెవెన్యూ- 3,246, గిరిజన సంక్షేమం- 3,056, ఆహార పౌర సరఫరాల సంఖ్య- 2,363, ఉన్నత విద్య- 1,873, మహిళా, శిశు, వికలాంగులు, సీనియర్ సిటిజన్లు- 1,702, మైనారిటీ సంక్షేమం- 1,606, పర్యావరణ-అటవీ-సాంకేతికత- 1,276, పరిశ్రమలు, వాణిజ్యం- 1,260, యువత, పర్యాటక, సాంస్కృతిక- 726, సాధారణ పరిపాలన- 532, కార్మిక, ఉపాధి కల్పన- 436, ఐటీ, కమ్యూనికేషన్స్- 360, లెజిస్లేచర్- 150.

- అలాగే డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకానికి రూ.11,000 కోట్ల నిధుల్ని ప్రతిపాదించారు. తెలంగాణలో ఇప్పటి వరకు గ్రామాలు, మునిసిపాలిటీలు, గ్రేటర్ హైదరాబాద్‌లో మొత్తం 52,456 డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం పూర్తి చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా 2.84 లక్షల ఇళ్లు మంజూరు చేయగా, వీటిలో 2.63 లక్షల ఇళ్ల నిర్మాణానికి పాలన అనుమతులిచ్చారు. మొత్తం అంచనా వ్యయం రూ.18,706 కోట్లు కాగా, మరో 50 శాతం మొత్తాన్ని ఖర్చు చేయాల్సి ఉంది. సొంత స్థలం కలిగిన బడుగులకు సైతం ఇక ఇంటి నిర్మాణానికి ఆర్థికసాయం అందిస్తామని ప్రభుత్వం తెలిపింది.
- సచివాలయం నూతన భవన నిర్మాణానికి రూ.610 కోట్లను ప్రభుత్వం ప్రతిపాదించింది.
- రాష్ట్ర రహదారుల నిర్వహణ మెరుగుదలకు రూ.1,945 కోట్లు కేటాయించారు. గ్రామీణ రహదారుల అభివృద్ధికి రూ.960 కోట్లు వెచ్చిస్తారు.
- రాష్ట్రంలో ఆరు చోట్ల ప్రాంతీయ విమానాశ్రయాల నిర్మాణానికి రూ.100 కోట్లు కేటాయింపు.
- 'కంపా' (కాంపెన్సేటరీ అఫారెస్టేషన్ ఫండ్)కు రూ.807 కోట్లు ఆమోదించారు.
- గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ పరిధిలోని స్వయం సహాయక బృందాలకు వడ్డీలేని రుణాలు ఇచ్చేందుకు ప్రభుత్వం రూ.2,249.99 కోట్లు కేటాయించింది.
- జాతీయ పౌష్టికాహార మిషన్, ఆరోగ్యలక్ష్మి పథకాల కింద పోషకాహారాన్ని అందించేందుకు రూ.704.77 కోట్లు ఇచ్చింది.
- హైదరాబాద్‌లో 'షి' బృందాలు, భరోసా కేంద్రాలున్నా మూడు కమిషనరేట్లకు కలిపి రూ.33 లక్షలు మాత్రమే కేటాయించారు. సేఫ్‌సిటీ ప్రాజెక్టు కింద నిర్భయ నిధికి కేవలం రూ.40 లక్షలు ఇచ్చారు.
- ఐటీ శాఖలో మౌలిక వసతులకు తొలిసారిగా రూ.150 కోట్లు కేటాయించారు.
- ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉచిత విద్య పథకం కింద తొలిసారిగా ప్రభుత్వం రూ.3 కోట్లు ఇవ్వనుంది.
- పారిశ్రామిక రంగానికి రూ.3,077 కోట్లు. రాయితీలు, ప్రోత్సాహకాలకు రూ.2,500 కోట్లు ప్రతిపాదించారు.
- చేనేత కార్మికుల సంక్షేమానికి రూ.338 కోట్లు కేటాయించారు.
- ఎస్.సి, ఎస్.టి ప్రత్యేక అభివృద్ధి నిధి (ఎస్‌డీఎఫ్) కింద రూ.33,611.06 కోట్లు చూపారు. ఇందులో జనాభా ప్రాతిపదికన ఎస్.సిలకు 15.81 శాతం మేర రూ.21,306.84 కోట్లు కేటాయించారు.
- నీరా పాలసీకి రూ.25 కోట్లు ఇవ్వనున్నారు.
- పర్యాటక శాఖకు కేటాయింపుల్లో కాళేశ్వరం టూరిజం సర్క్యూట్‌కే 350 కోట్లు కేటాయించారు. రాష్ట్రానికి వచ్చిన దేశీయ పర్యాటకుల సంఖ్య 2014లో 7.2 కోట్లు ఉండగా, 2019కి అది 8.3 కోట్లకు పెరిగింది. అదే సమయంలో విదేశీ పర్యాటకుల సంఖ్య 75,171 నుంచి 3.23 లక్షలకు పెరిగింది. 477 పర్యాటక ప్రదేశాల్ని గుర్తించారు.

## తెలంగాణ బడ్జెట్ సమగ్ర స్వరూపం (రూ. కోట్లలో)

| | 2019-20 (వాస్తవ) | 2020-21 (బడ్జెట్ అంచనా) | 2020-21 (సవరించిన అంచనా) | 2021-22 (బడ్జెట్ అంచనా) |
|---|---|---|---|---|
| రెవెన్యూ వసూళు | 1,02,544 | 1,43,152 | 1,17,758 | 1,76,127 |
| మూలధన వసూళ్లు | 75,965 | 39,550 | 48,984 | 53,850 |
| మొత్తం వసూళ్లు | 1,78,508 | 1,82,702 | 1,66,742 | 2,29,977 |
| రెవెన్యూ వ్యయం | 1,08,797 | 1,38,670 | 1,33,984 | 1,69,383 |
| మూలధన వ్యయం | 16,859 | 22,061 | 10,561 | 29,047 |
| రుణాలు, అడ్వాన్సులు | 8,700 | 15,662 | 15,662 | 23,256 |
| రుణాల చెల్లింపు | 45,748 | 6,521 | 6,521 | 9,139 |
| మొత్తం వ్యయం | 1,80,104 | 1,82,914 | 1,66,729 | 2,30,826 |
| రెవెన్యూ మిగులు | -6,254 | 4,482 | -16,226 | 6,743 |
| ద్రవ్య లోటు | 31,751 | 33,191 | 42,400 | 45,510 |

# తెలంగాణ తలసరి ఆదాయం రూ.2,27,145

కొవిడ్ సంక్షోభంలోనూ రాష్ట్ర ప్రభుత్వం సామాజిక సహాయ కార్యక్రమాలను కొనసాగించిందని, సంక్షోభాన్ని అవకాశంగా మలచుకొని మౌలిక సదుపాయాల కల్పనను వేగంగా పూర్తి చేసిందని, దీంతో జీఎస్‌డీపీ, తలసరి ఆదాయంలో జాతీయ సగటును మించిందని తెలంగాణ సామాజిక, ఆర్థిక దృక్పథం-2021 తెలిపింది. నివేదిక రూపొందించేనాటికి కరోనా నుంచి 98.8 శాతం మంది కోలుకున్నారని వెల్లడించింది. దేశవ్యాప్తంగా కొవిడ్ మరణాలు 1.4 శాతం ఉండగా, తెలంగాణలో మాత్రం 0.5 శాతం మంది మాత్రమే మరణించారు. జాతీయస్థాయిలో వృద్ధి రేటు -3 శాతానికి పడిపోగా, తెలంగాణ మాత్రం 1.3 శాతం పాజిటివ్ వృద్ధిరేటును కనబరిచింది. గ్రామీణాభివృద్ధితోపాటు వ్యవసాయ రంగం రాష్ట్రానికి వెన్నెముకగా నిలిచిందని సర్వే తెలిపింది. కొన్ని ముఖ్యాంశాలు:

- కొవిడ్ ఉధృతిలోనూ రాష్ట్రంలో వ్యవసాయం 20.9% వృద్ధి నమోదు చేసింది.
- సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, పునరాకృతి, 24 గంటల విద్యుత్తు, రైతు బంధు, ఇతర పథకాల కారణంగా కరోనా ప్రభావం నుంచి వ్యవసాయం వేగంగా కోలుకుంది.
- 2014లో పంటల సాగు విస్తీర్ణం 1.08 కోట్ల ఎకరాల్లో ఉండగా 2019-20 నాటికి 26% వృద్ధి చెంది 1.36 కోట్ల ఎకరాలకు చేరుకుంది.
- కరోనా జాగ్రత్తలు తీసుకుంటూనే ప్రభుత్వం రూ.9,199 కోట్ల విలువైన ధాన్యాన్ని, రూ.10,167 కోట్ల పత్తిని కొనుగోలు చేయటం ద్వారా రైతులకు భరోసా ఇచ్చింది.
- గొర్రెల పంపిణీతో గ్రామీణ ప్రజల ఆదాయాన్ని సుస్థిరం చేయగా, 29.76 లక్షల మంది సన్న, చిన్నకారు రైతులు బీమా పరిధిలో ఉన్నారు.
- మత్స్య శాఖ, పశుసంవర్ధక శాఖ, పాడి పరిశ్రమ, ఉద్యాన శాఖలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుండటం, పంట నిల్వలకు గోదాముల నిర్మాణం, రైతుల ఐక్యతకు రైతు వేదికలు, రైతు సమన్వయ సమితుల తోడ్పాటు కలసివస్తోంది.
- రాష్ట్రంలో 88 శాతం కమతాలు 4.94 ఎకరాల విస్తీర్ణంలోపే ఉన్నాయి. 0.1 శాతం మాత్రమే పెద్ద రైతులు ఉండగా, రైతు బంధు పథకంతో పేదలు ఎక్కువగా లబ్ధి పొందుతున్నారు.
- భూ దస్త్రాల నవీకరణ, ధరణి పోర్టల్‌తో భూ లావాదేవీలను ప్రభుత్వం సులభతరం చేసింది.
- పరిశ్రమల రంగం 2020 డిసెంబరు నాటికి +4 శాతం వృద్ధిని సాధించింది.




- 2020 ఫిబ్రవరిలో తెలంగాణ నిరుద్యోగిత జాతీయ సగటు కన్నా ఎక్కువగా 8.3 శాతంగా ఉంది. ఆ తర్వాత కరోనా దెబ్బకు ఆర్థిక వ్యవస్థలన్నీ కుదేలయ్యాయి. కానీ సంక్షోభం నుంచి కోలుకోవటంలో తెలంగాణ ముందుంది. డిసెంబరులో జాతీయస్థాయి నిరుద్యోగిత 9.1 శాతం ఉండగా, తెలంగాణలో ఏడు శాతం మాత్రమే ఉంది.
- అత్యధిక విద్యుత్ వినియోగంలో దేశంలోనే తెలంగాణ ముందు వరుసలో ఉంది. 2018-19తో పోలిస్తే 2019-20లో రాష్ట్రంలో తలసరి వినియోగం 9.2 శాతం పెరిగింది. 2018-19లో 1,896 కిలోవాట్లుండగా, 2019-20కి 2,071 కిలోవాట్లకి పెరిగింది.
- జనగామ జిల్లాలో అత్యధికంగా వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. హైదరాబాద్ జిల్లాలో మొత్తం 20,42,015 కనెక్షన్లకుగాను వ్యవసాయ కనెక్షన్ల సంఖ్య సున్నా. వాణిజ్య కనెక్షన్లు దాదాపు 19 శాతం కాగా, మిగిలినవి గృహావసరాలకు సంబంధించినవి.
- ప్రజలకు తాగునీరు అందించటంలో దేశంలోనే తెలంగాణ, గోవా రాష్ట్రాలు ముందంజలో ఉన్నాయి. ఈ రెండు రాష్ట్రాల్లో వంద శాతం కుటుంబాలకు తాగునీటి కనెక్షన్లున్నాయి. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ 38 శాతంతో 14వ స్థానంలో ఉంది.
- దేశ తలసరి ఆదాయం తగ్గినా తెలంగాణలో పెరిగింది. గత ఏడాది కంటే 0.6 శాతం వృద్ధి ఉంది. రాష్ట్ర తలసరి ఆదాయం రూ.2,27,145 గా ఉంది. 2020-21 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర జీఎస్‌డీపీ రూ.9,78,373 కోట్లు. ప్రాథమిక రంగం (వ్యవసాయం, మైనింగ్ తదితరాలు)లో 17.7 శాతం వృద్ధి, ద్వితీయ రంగం (తయారీ, నిర్మాణం, నీటి సరఫరా వగైరాలు)లో 5.3 శాతం తరుగు, సేవా రంగంలో 1.9 శాతం తగ్గుదల నమోదైంది. గత ఆర్థిక

సంవత్సరంలో వృద్ధి రేటు 13.5 శాతం.

+ జాతీయ రహదారులకు 20 పట్టణాలను అనుసంధానం చేస్తారు. ఇది పూర్తయితే రైతులకు ఎంతో అవసరమైన రోడ్ లింకు ఏర్పడుతుంది. చిన్న మధ్య తరహా పరిశ్రమలు, కోల్డ్ చెయిన్లు, ఆగ్రో ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, ఐటీ పార్కులు, కొత్త టౌన్‌షిప్పులకు దోహదం చేస్తుంది.
+ కొవిడ్ సృష్టించిన విపత్కర పరిస్థితుల నేపథ్యంలో ఫార్మా రంగాన్ని బలోపేతం చేశారు. ఫలితంగా హైదరాబాద్ నగరానికి చెందిన కంపెనీలు వ్యాక్సిన్ల సృష్టి, తయారీలో కీలక పాత్ర పోషించాయి.
+ హైదరాబాద్ చుట్టుపక్కల ఐటీ రంగాన్ని విస్తరించేందుకు ప్రణాళికలు అమలు చేస్తున్నారు.
+ గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ కొత్త చట్టం ద్వారా జీహెచ్ఎంసీ కౌన్సిల్‌లో 50 శాతం మహిళలకు కోటాను అమలు చేస్తున్నారు. నగర నిర్వహణలో ప్రజలను భాగస్వాముల్ని చేస్తూ 4 పౌర కమిటీలు ఏర్పాటు కానున్నాయి. ఇవి గ్రీన్ కవరేజ్, సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్, ప్రభుత్వ ఆస్తుల ఆక్రమణలను అడ్డుకోవటం, క్రీడల అభివృద్ధి మొదలైన అంశాల్లో భాగస్వాములుగా పనిచేస్తాయి.

## జీడీడీపీలో అగ్రగామి రంగారెడ్డి జిల్లా

రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో తెలంగాణ పురోగమించింది. ప్రస్తుత ధరల్లో చూస్తే.. రాష్ట్రం 2017-18లో 7,50,000 కోట్లు, 2018-19లో రూ.8,50,596 కోట్లు, 2019-20లో రూ.9,65,395 కోట్ల స్థూల ఉత్పత్తి సాధించింది. జిల్లాలవారీగా.. రంగారెడ్డి జిల్లా 2019-20లో రూ.1,82,561 కోట్లను సాధించగా, హైదరాబాద్ రూ.1,71,435 కోట్లను పొందింది. మేడ్చల్ మల్కాజిగిరి రూ.72,354 కోట్లు, సంగారెడ్డి రూ.36,915 కోట్లు, నల్గొండ రూ.36,532 కోట్లు, నిజామాబాద్ జిల్లా రూ.30,235 కోట్లు సాధించాయి. ఈ జాబితాలో రూ.5,716 కోట్లతో ములుగు జిల్లా అట్టడుగు స్థానంలో ఉంది.

స్థిర ధరల్లో చూస్తే.. రాష్ట్రం 2017-18లో రూ.5,57,410 కోట్లు, 2018-19లో రూ.6,03,897 కోట్లు, 2019-20లో రూ.6,50,655 కోట్ల స్థూల ఉత్పత్తిని సాధించింది. జిల్లాల వారీగా.. రంగారెడ్డి జిల్లా రూ.1,25,934 కోట్లు, హైదరాబాద్ రూ.1,17,417 కోట్లు, మేడ్చల్ మల్కాజిగిరి రూ.52,568 కోట్లతో మొదటి మూడు స్థానాలు పొందాయి.

# హైదరాబాద్‌లో 80 శాతం విద్యార్థులు ప్రయివేటు స్కూళ్లలోనే

కుమురం భీం, ములుగు, మెదక్ జిల్లాల్లో సుమారు 73 శాతం మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతుంటే.. హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల్లో ఈ సంఖ్య 25 శాతం కంటే తక్కువే. బాలికల విద్యకు మాత్రం సర్కారీ బడులే వేదికగా ఉన్నాయి. ముఖ్యంగా 11-16 సంవత్సరాల పిల్లల్లో బాలుర కంటే బాలికలే ప్రభుత్వ పాఠశాల్లో ఎక్కువగా చదువుతున్నారు.

+ మొత్తం 33 జిల్లాల్లో ఆరింటిలో మాత్రం సగం కంటే తక్కువ మంది సర్కారీ బడుల్లో చదువుతున్నారు.
+ నిజామాబాద్ జిల్లాలో 47.60 శాతం, పెదపల్లి 46.80 శాతం, కరీంనగర్ 35.50, వరంగల్ అర్బన్ 29.20, రంగారెడ్డి 26.20, హైదరాబాద్ 20.10, మేడ్చల్ జిల్లాలో 14.60 శాతం విద్యార్థులే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారు.
+ 60.10 లక్షల మంది విద్యార్థులకు 28 లక్షల మందే ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నారు. 54 శాతం మంది ప్రయివేటు స్కూళ్లలోనే చదువుతున్నారు.
+ ప్రస్తుతం రాష్ట్రంలో పాఠశాలల పరిస్థితి ఒక ఉపాధ్యాయుడు, అయిదు తరగతులుగా ఉంది. దగ్గరలోని రెండు మూడు చిన్న పాఠశాలలను విలీనం చేసి రవాణా సౌకర్యం కల్పిస్తే ఉపాధ్యాయుల సంఖ్య పెరిగి నాణ్యమైన విద్య లభిస్తుందని సర్వే సూచించింది.
+ రాష్ట్రంలో 26,065 ప్రభుత్వ పాఠశాలలుండగా అందులో 38 శాతం బడుల్లో.. అంటే 7819 చోట్ల 30 మందిలోపు పిల్లలున్నారు. కుమురం భీం జిల్లాలో 54.40 శాతం, ములుగు 52.30, మహబూబాబాద్ 51.30, ఆదిలాబాద్ 50.20, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 50.10 శాతం బడుల్లో 30 మందిలోపే పిల్లలున్నారు.
+ ప్రతి వెయ్యి జనాభాకు అత్యధికంగా కుమురం భీం జిల్లాలో 2.22 పాఠశాలలుండగా.. అత్యల్పంగా మేడ్చల్ జిల్లాలో 0.22 బడులే నడుస్తున్నాయి. అంటే ఈ జిల్లాలో దాదాపు 5 వేల మందికి ఒక పాఠశాల ఉంది.

## మూడో వంతు బాలలు వయసుకు తగ్గ బరువులేని వారే

రాష్ట్రంలో అయిదేళ్లలోపు వయసున్న పిల్లల్లో 31.80 శాతం మంది వయసుకు తగ్గ బరువులేని వారే. తల్లులతోపాటు పిల్లలకు సరైన పోషకాహారం అందకపోవటమే ఇందుకు కారణం. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే 2019-20లో వెల్లడైన పలు అంశాలను తెలంగాణ సామాజిక, ఆర్థిక నివేదిక ప్రస్తావించింది.

+ అత్యధికంగా ఆదిలాబాద్ జిల్లాలో 52 శాతం మంది వయసుకు తగ్గ బరువులేని వారుండగా, అత్యల్పంగా హైదరాబాద్‌లో 18.90 శాతం ఉన్నారు.

+ మొత్తం 25.30 శాతం మంది తక్కువ బరువున్న పిల్లలతో భద్రాద్రి కొత్తగూడెం మూడో స్థానంలో ఉంది.

+ రాష్ట్రంలో 6-23 నెలల పిల్లలకు తగినంత పోషకాహారం అందుతున్న వారి శాతం సగటున 9.20గా ఉంది. మహబూబాబాద్ జిల్లాలో అది 3.40 శాతమే.

+ పిల్లల్లో పెరుగుదల సరిగానే ఉందా, లేదా? అని ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయటానికి కృత్రిమ మేధను ఉపయోగించాలని సర్వే సూచించింది.

## పరిశ్రమలో మేడ్చల్, ఉపాధి కల్పనలో రంగారెడ్డి

రాష్ట్రంలో పారిశ్రామిక అనుమతుల విధానంలో పలు మార్పులతో 2015లో అమల్లోకి తెచ్చిన తెలంగాణ పారిశ్రామిక ప్రాజెక్టు అనుమతులు, స్వీయధృవీకరణ (టీఎస్ఐపాస్)తో 14,268 యూనిట్లు, పరిశ్రమల ఏర్పాటుకు రూ.2.07 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని సామాజిక ఆర్థిక సర్వే తెలిపింది. 14.58 లక్షల మంది యువతకు ఉద్యోగాలు లభించాయంది. రాష్ట్రంలోనే అత్యధికంగా పెట్టుబడులు, ఉద్యోగాల కల్పన రంగారెడ్డి జిల్లాలో ఉంటే, ఎక్కువ పరిశ్రమలు మేడ్చల్-మల్కాజిగిరిలో ఏర్పడ్డాయి. పరిశ్రమల యూనిట్ల పరంగా నారాయణపేట చివరి స్థానంలో ఉంది. పెట్టుబడుల్లో రంగారెడ్డి జిల్లా రూ.67,431 కోట్లతో అగ్రస్థానంలో ఉంటే, ములుగు జిల్లా రూ.3 కోట్లతో చివరి స్థానంలో ఉంది. ఉపాధి కల్పనలో రంగారెడ్డి జిల్లా 8,81,050 మందితో తొలిస్థానంలో ఉండగా.. ములుగు జిల్లా 96 మందితో చివర ఉంది. ఉద్యోగాలపరంగా రంగారెడ్డి తర్వాత వరంగల్ నిలిచింది. ఈ జిల్లాలో 1.90 లక్షల మందికి ఉద్యోగాలు లభించగా, తర్వాతి స్థానాల్లో మేడ్చల్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్‌లు నిలిచాయి. హైదరాబాద్ జిల్లా మెదక్ తరువాత ఏడో స్థానం పొందింది. పెట్టుబడుల్లోనూ ఇది 23 స్థానంలో నిలిచింది. రంగాలవారీగా, స్థిరాస్తి, ఐటీ, పరిశ్రమలు, ఫార్మా, కెమికల్స్, ఆహారశుద్ధి, ఇంజినీరింగ్, టెక్స్‌టైల్స్‌లో ఎక్కువ ఉపాధిని కల్పించాయి.

## ఆర్థిక సంఘం నిధుల్లో తగ్గిన వాటా

కేంద్ర ఆర్థిక సంఘం బదిలీ చేసే వాటా నిధుల్లో రాష్ట్రానికి కోత పడింది. 2015 నుంచి 2020 వరకు 2.437 వాటా ఇచ్చిన కేంద్రం 2020-21లో 2.133 శాతానికి తగ్గించింది. 2021-26 వరకు గల 15వ ఆర్థిక సంఘం వాటాలో తెలంగాణకు దక్కేది 2.102 శాతం మాత్రమే. ఫలితంగా తెలంగాణ వచ్చే ఐదేళ్లలో రూ.14,151 కోట్లను కోల్పోవలసి వస్తోంది. కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటాను 15వ ఆర్థిక సంఘం 42 నుంచి 41 శాతానికి తగ్గించటం, వెయిటేజీల్ని మార్చటం వల్ల కొన్ని రాష్ట్రాలతోపాటు తెలంగాణకు కూడా వాటా తగ్గింది.

## తగ్గిన సొంత పన్నుల ఆదాయం

రాష్ట్ర సొంత పన్నుల ఆదాయం కరోనా కారణంగా పడిపోయింది. 2019 ఏప్రిల్‌తో పోలిస్తే 2020 ఏప్రిల్‌లో87.7 శాతం తగ్గింది. మే మాసంలో 50.8 శాతం తగ్గింది. 2020 జూన్‌కు సాధారణ స్థాయికి చేరింది. ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు ఎనిమిది నెలల్లో కేవలం రూ.36,806 కోట్ల సొంత పన్ను ఆదాయాన్ని గడించింది. వ్యాట్, ఎస్‌జీఎస్‌టీ, స్టాంపులు మరియు రిజిస్ట్రేషన్‌లు, మోటారు వాహనాల పన్ను, ఎక్సయిజ్ ద్వారా ఈ ఆదాయాన్ని పొందింది. 2019తో పోలిస్తే 9.4 శాతం తక్కువ. 2020-21లో ఆదాయానికి మించి ఖర్చు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. దాంతో రూ.33,191 కోట్ల లోటు తప్పలేదు. 2016 నుంచి 2019 వరకు సగటు తలసరి వ్యయంలో తెలంగాణ రూ.24,496తో దేశంలో రెండవ స్థానంలో ఉంది.


## కరోనా ఖర్చు రూ.5,268 కోట్లు

తెలంగాణ ప్రభుత్వం కరోనా తీవ్రంగా ఉన్న సమయంలో రూ.5,268 కోట్లు ఖర్చు చేసింది. వైద్య సౌకర్యాలకు రూ.1177 కోట్లు, కుటుంబానికి రూ.1500 చొప్పున రెండుసార్లు ఇవ్వటానికి రూ.2,628 కోట్లు, నిత్యావసరాలకి రూ.1103 కోట్లు, వలస కార్మికులకు రూ.124 కోట్లు వెచ్చించింది. స్థానిక ప్రభుత్వాలకి రూ.182 కోట్లు, పోలీసు శాఖకి రూ.54 కోట్లు ఇచ్చింది.

## తలసరి అప్పు రూ.1,05,000

2020-21 ఆర్థిక సంవత్సరం చివరికి రాష్ట్ర ప్రభుత్వం నేరుగా తీసుకున్న అప్పుల మొత్తం రూ.2.45 లక్షల కోట్లు. ఇవి కాకుండా వివిధ పథకాలు అమలు చేస్తున్న ప్రభుత్వ సంస్థలకు.. ప్రత్యేకించి సాగునీటి ప్రాజెక్టులు, మిషన్ భగీరథ తదితర కార్పొరేషన్లకు విడిగా పూచీకత్తు ఇచ్చిన రుణాలు మరో లక్షా 5 వేల కోట్లున్నాయి. రాష్ట్ర జనాభా 2018 నాటికి 3.72 కోట్లు. ఈ లెక్కన తెలంగాణలో ప్రస్తుతం తలసరి అప్పు రూ.94,086. వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఇప్పటికే ప్రభుత్వం ప్రతిపాదించిన రుణంతో కలిపితే తలసరి అప్పు రూ.1,05,000కు చేరుతుంది. 2016-19 మధ్యకాలంలో ఏటా అప్పులపై వడ్డీల చెల్లింపులకే రాష్ట్ర ఆదాయంలో 11.7 శాతం సొమ్ము వెచ్చించారు. జాతీయస్థాయిలో ఈ సగటు 13.1 శాతమని సర్వే తెలిపింది. మొత్తమ్మీద ప్రతి నెలా సగటున రూ.2,000 కోట్లు పాత అప్పుల చెల్లింపులకే ప్రభుత్వం వెచ్చించాల్సిన పరిస్థితి. ✦

# రూ.70,983.11 కోట్లతో ఏపీ ఓట్ ఆన్ అకౌంట్




ఆంధ్రప్రదేశ్‌లో 2021-22 ఆర్థిక సంవత్సరం తొలి మూడు నెలల కాలానికి రూ.70,983.11 కోట్లతో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ఆమోదించారు. ఆర్డినెన్స్ రూపంలో ఈ బడ్జెట్‌ను ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. ఓట్ ఆన్ అకౌంట్‌లో సాంఘిక, వెనుకబడిన తరగతులు, స్త్రీ, శిశు సంక్షేమం, గిరిజన, మైనారిటీ, దివ్యాంగులకు రూ.10,000 కోట్లు కేటాయించారు. వ్యవసాయ రంగానికి రెవెన్యూ వ్యయం కింద రూ.7,171.26 కోట్లు, పెట్టుబడి వ్యయం కింద రూ.167.64 కోట్లు ప్రతిపాదించారు. ఖరీఫ్‌కు ముందే రైతు భరోసా నిధులు చెల్లించాల్సి ఉండటంతో ఈ మొత్తం కేటాయించినట్లు చెబుతున్నారు. భారీ, మధ్యతరహా, చిన్న నీటిపారుదల ప్రాజెక్టుల కోసం సుమారు రూ.2,000 కోట్లు కేటాయించారు. ఈ రంగానికి మొత్తం మీద రూ.2,653 కోట్లు చూపారు. వైద్య ఆరోగ్య రంగానికి రూ.3,567 కోట్లు, విద్యారంగానికి సుమారు రూ.7,972 కోట్లు కేటాయించారు. రాష్ట్రంలో 2020-21 ఆర్థిక సంవత్సరానికి రూ.7,955.66 కోట్లతో అనుబంధ పద్దుకు కూడా ఆర్డినెన్స్ ద్వారా ఆమోదం తెలిపారు. 2020 ఆర్థిక సంవత్సరంలో నవంబరు 26 నుంచి మార్చి 31 వరకు శాఖలవారీగా బడ్జెట్ కేటాయింపులకు మించి ఖర్చు చేయాల్సి వచ్చింది. కన్సాలిడేటెడ్ ఫండ్ కింద రూ.13.59 కోట్లు, శాఖల వారీగా అదనపు ఖర్చుకు రూ.7,942.07 కోట్ల మేర ఆమోదం తెలిపారు.

**తొలి మూడు నెలల్లో మరికొన్ని ముఖ్యమైన శాఖలకు కేటాయింపులు (రూ. కోట్లలో):**

| శాఖ | రెవెన్యూ వ్యయం | పెట్టుబడి వ్యయం |
|---|---|---|
| రోడ్లు, భవనాలు | 1254.08 | 520.78 |
| పురపాలక, పట్టణాభివృది | 3,222 | 432.54 |
| గృహనిర్మాణం | 1239.10 | |
| పంచాయతీరాజ్ | 3,268.41 | 1985.75 |
| గ్రామీణాభివృద్ధి | 2,537.45 | 20.31 |
| ఇంధనం | 2,551.69 | ...... |
| పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు | 347.00 | 299.18 |
| పౌర సరఫరాలు | 852.49 | ....... |
| రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు | 916.30 | 630.87 |
| రవాణా | 38.69 | 6.25 |
| ప్రణాళిక, సర్వేలు, గణాంకాలు | 6094.73 | 48.75 |

## జిందాల్ రైతులకి ఇంకెప్పుడు న్యాయం చేస్తారు?

విజయనగరం జిల్లా ఎస్.కోట మండలంలో జెడ్ఎస్‌డబ్ల్యూ జిందాల్ అల్యూమినియం లిమిటెడ్ నిర్మించేందుకు జరిగిన భూసేకరణలో అన్యాయానికి గురైన రైతులకు న్యాయం చేయాలని లోక్‌సత్తా పార్టీ ఏపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ డిమాండ్ చేశారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం 2008లో బొడ్డవర, ముసిడిపల్లి, చినఖండేపల్లి, మూల బొడ్డవర, కిల్తంపాలెం ప్రాంతాల్లో 1050 ఎకరాలు గిరిజనుల నుంచి సేకరించి జిందాల్‌కు ఇచ్చిందని, ఇందులో డి పట్టా భూములు, ప్రభుత్వ భూమి కూడా ఉన్నాయని, భూసేకరణలో అప్పటి అధికారపార్టీ నాయకులు, అధికారులు చేతివాటం ప్రదర్శించి నిజమైన లబ్ధిదారులైన గిరిజనులకు అన్యాయం చేశారన్నారు. భూసేకరణ జరిగి నేటికి 14 సంవత్సరాలవుతున్నా నేటికీ కర్మాగారం రాలేదని, భూమిని ఇచ్చిన కొంతమంది రైతులు ఆందోళనతో మరణించారన్నారు. వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. భూసేకరణలో కొంతమందికి భూములు లేకపోయినా దొంగ రికార్డులతో, అధికారుల అండతో లక్షల రూపాయలు స్వాహా చేశారని లోక్‌సత్తా ఆధారాలతో సహా నిరూపించినా ఇప్పటికీ బినామీల నుంచి రికవరీ చేయలేకపోయారన్నారు. బాధితులకు న్యాయం చేయకపోతే లోక్‌సత్తా నుంచి మరోసారి ఉద్యమం చేపడతామన్నారు. లోక్‌సత్తా పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు, ఎస్.కోట నియోజకవర్గ అధ్యక్షుడు కాంగ్రెగుల ప్రసాద్, రఘురాం తదితర నేతలతో కలిసి విజయనగరం ఆర్డీవోకి కూడా ఈ మేరకు విజ్ఞాపన అందచేశారు.



(పార్ట్-1)

# షష్ఠమ భూతం

**- సత్య వెలిగట్ల, ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్**







నేల, నీరు, నిప్పు, గాలి, ఆకాశం అనేవి పంచభూతాలని అందరికీ తెలుసు. ఈ షష్ఠమ భూతం గురించి ఎక్కువమందికి అంతగా తెలియదు. షష్ఠమ భూతం అంటే మన 'ట్యాక్స్ మనీ'! పంచభూతాలతో ఏర్పడిన మనిషిని నవీన మానవుడిగా తీర్చిదిద్దేదే షష్ఠమ భూతం.

ముందుగా పంచభూతాల గురించి ఒకింత ప్రస్తావన.

పంచభూతాలతో ఏర్పడిందే మానవ శరీరం. ఈ పంచభూతాలు లేకుంటే ప్రపంచం ఒక్క క్షణం కూడా బతికి బట్టకట్టజాలదు. నిలవడానికి నేల, తాగడానికి నీరు, వంట చేసుకోవడానికి నిప్పు, పీల్చడానికి గాలి, శబ్దాలను వినడానికి ఆకాశం ఉండవలసిందే. వీటిలో ఏ ఒక్కటి లేకున్నా జీవితం లేదు.

నేలకు సహనగుణం ఎక్కువ. అందుకే నేలను తల్లితో పోలుస్తారు. తనలో బాధల బడబాగ్నులు రగులుతున్నా, కీడుల అగ్నిపర్వతాలు బద్దలవుతున్నా, ముప్పుల ఉప్పెనలు ముంచెత్తుతున్నా నిశ్చలంగా నిలిచి, జీవరాశులను కాపాడుతున్న కరుణాంతరంగ భూమి. మనిషి మట్టిలోంచి పుడతాడని శాస్త్రం చెబుతోంది. అలాంటిది తన జన్మకు కారణమైన నేల తల్లిని క్షోభ పెట్టకుండా కాపాడి రుణం తీర్చుకోవలసిన బాధ్యత మన పైనే ఉంది.

ఈ ప్రపంచంలో నీరే లేకపోతే ఏ జీవీ కొద్దికాలం కూడా మనుగడ సాగించలేదు. అందుకే నీటికి 'జీవనం' అని పేరుంది. జీవికి ప్రాణప్రదమైంది నీరు. మనిషి అన్నం లేకుండా బతకగలడు కానీ నీరు లేకుండా జీవించలేడు. సకల జీవజాలానికి, ప్రకృతికీ చైతన్యాన్ని ప్రసాదిస్తున్న నీటిని అమూల్యంగా కాపాడుకోవలసిన బాధ్యత కూడా మన పైనే ఉంది!

పంచభూతాల్లో మూడోది అగ్ని. సూర్యుడి నుండి వెలువడే ఉష్ణశక్తి మానవ లోకానికి అదృష్టవరం. సూర్యుడు ఉజ్జ్వలంగా ప్రకాశించకపోతే లోకం అంధకారబంధురమే. సూర్యకాంతి లేనిదే చూపు లేదు. చూపు లేకుంటే అంతా శూన్యమే. ప్రకృతి వికాసానికి మూలకారణం, జీవుల శారీరక వికాసానికి, ఆరోగ్యానికి మూలం- తేజస్సే. సూర్యుడి కాంతి తేజోరూపంలో నిరంతరం లోకానికి మార్గదర్శనం అవుతున్నందువల్లనే మానవుడి జీవయాత్ర నిర్విఘ్నంగా కొనసాగుతోంది.

పంచభూతాల్లో నాలుగోదైన గాలి కారుణ్యం వర్ణనాతీతం. ఒక్క క్షణం గాలి వీచకపోతే ప్రాణాలు ఆగిపోతాయి. శరీరంలో ఏ అవయవాలూ పనిచేయవు. రక్త ప్రసరణ నిలిచిపోతుంది. ప్రపంచమే స్తంభించిపోతుంది. గాలి అనుకూలంగా వీస్తేనే మేఘాలు ఏర్పడతాయి. వానలు కురుస్తాయి. పంటలు పండుతాయి. అటువంటి గాలిని కూడా రసాయనాలతో కలుషితం చేస్తే ప్రాణుల మనుగడ సాధ్యమా?

మనిషికి ఆకాశం చేసే మేలు ఎంతో గొప్పది. మనిషి నిత్యజీవనం కొనసాగాలంటే శ్రవణేంద్రియానికి అన్ని ధ్వనులూ వినిపించాలి. ధ్వని మనిషి జీవితావసరం. ఇతరుల మనోభావాలు తెలుసుకోవాలన్నా, తన మనోభావాలను ఇతరులకు తెలపాలన్నా మాటలే కదా శరణ్యం! ఆ మాటలు వినబడటానికి ఆకాశమే ప్రబల యావకం. ఆకాశం లేకుంటే అంతా నిశ్శబ్దమే ఆవరిస్తుంది. మనిషి జీవనం అగమ్యగోచరం అవుతుంది. తన శక్తితో ఈ ప్రపంచాన్నే ధ్వనిమయం చేసి, ప్రపంచాన్ని నడుపుతోంది.

పంచభూతాత్మకమైన ఈ ప్రపంచంలో జీవించే మనిషి ఆ ప్రకృతిని రక్షించుకోవడానికి బదులుగా భక్షించాలనుకొంటున్నాడు. ప్రాణదాతలైన పంచభూతాల ప్రాణాలు తీయాలనుకొంటున్నాడు. అన్నింటినీ కలుషితం చేసి మృత్యువును కౌగలించుకొంటున్నాడు. సౌరకుటుంబంలోనే జీవుల మనుగడకు మనకు తెలిసి సురక్షిత స్థానమైన భూమండలాన్ని నిర్జీవ గోళంగా మార్చేందుకు స్వార్థ యత్నాలను కొనసాగిస్తున్నాడు. దయతలచి తనను రక్షిస్తున్న పంచభూతాల పట్ల అపచారం చేస్తున్నాడు. ఇప్పటికైనా కళ్లు తెరిచి, పంచభూతాలకు తాము చేస్తున్న ద్రోహానికి అడ్డుకట్ట వేయకపోతే మనిషిని ఏ దేవుడూ క్షమించడు!

ఇప్పుడు షష్ఠమ భూతం గురించి.

పంచభూతాల సరసన ఆరవ భూతంగా 'ట్యాక్స్ మనీ' రూపంలో మనమంతా అందరి ఉమ్మడి అవసరాల కోసం ఏర్పాటు చేసుకున్నాము. పంచభూతాల ప్రమేయంతో మానవ జీవితం ముడిపడి ఉంటే.. ప్రజల జీవన ప్రమాణాలు పెరిగి, మనకు ఉజ్వల భవిష్యత్తు 'ట్యాక్స్ మనీ'తో ముడిపడి ఉంది. మానవుని జీవన ప్రమాణాలు పెరగాలంటే అనేకమైన కనీస ఉమ్మడి అవసరాలు మరియు ఉమ్మడి సౌకర్యాలు ఏర్పాటు చేసుకొని నిర్వహించుకోవాలి. ఈ బాధ్యతని నిర్వహించుకోవడానికే రాజకీయ ప్రక్రియ ద్వారా ప్రభుత్వాలు, తద్వారా వ్యవస్థలు ఏర్పాటు చేసుకున్నాము.

ఈ వ్యవస్థలను సక్రమంగా, నిజాయతీగా, నిబద్ధతతో నడపటానికి (ఓటు) ఎలెక్ట్ ద్వారా ప్రజాప్రతినిధులను, సెలెక్ట్

ద్వారా ప్రభుత్వ ఉద్యోగులను నియమించుకున్నాము. ప్రకృతి మానవునికి పంచభూతాలు ఇస్తే మనమంతా ప్రభుత్వాల పరిపాలనకు ప్రతిరోజూ ట్యాక్స్ మనీ (పన్నుల సొమ్ములు) రూపంలో షష్ఠమ భూతాన్ని ఇస్తున్నాము. తద్వారా విద్య, వైద్యం, రక్షిత తాగునీరు, రోడ్లు, ఎలక్ట్రిక్, డ్రైనేజ్ లాంటి ఉమ్మడి అవసరాలను తీర్చుకుంటున్నాము.

నీటిపారుదల ప్రాజెక్టులు, దేశ రక్షణ, న్యాయవ్యవస్థ, పేదలకు సంక్షేమ పథకాలు, ప్రపంచాన్ని కుగ్రామంగా మార్చేసిన ఉపగ్రహ సాంకేతిక సౌకర్యాలు.. ఇవన్నీ ప్రభుత్వాలు మన ట్యాక్స్ మనీతోనే అందుబాటులోకి తెస్తాయి. ఇవన్నీ పంచభూతాల ప్రమేయంతో షష్ఠమ భూతమైన ట్యాక్స్ మనీతోనే సాధ్యమవుతుంది. అందుకే ట్యాక్స్ మనీని షష్ఠమ భూతంగా గుర్తించాల్సిన అవసరం ఎంతయినా ఉంది. వీటిని అమూల్యంగా కాపాడుకోవలసిన బాధ్యత మనందరిపై ఉంది!

అయితే మన అత్యాశతో ముఖ్యంగా ప్రజాప్రతినిధులు మరియు ప్రభుత్వ ఉద్యోగులు పంచభూతాలతో పాటు మన ట్యాక్స్ మనీని కూడా ఎలా దుర్వినియోగం చేస్తున్నారో తరువాతి వ్యాసంలో పార్ట్-2గా తెలియజేస్తాను. ✦

## మానవాభివృద్ధి రంగాల్ని నిర్లక్ష్యం చేయటం వల్లే అసమానతలు



వృద్ధి ఫలాలను కొద్దిమంది మాత్రమే సొంతం చేసుకోవటం వల్ల దేశంలో అసమానతలు పెరుగుతున్నాయని ప్రముఖ ఆర్థికవేత్త చెన్నమనేని హనుమంతరావు అన్నారు. ఆ కొద్దిమంది సంపన్నులే రాజకీయ వ్యవస్థను కూడా శాసిస్తున్నారన్నారు. రాజకీయాల్లో ధన ప్రభావం మితిమీరటంతో ప్రజాస్వామ్యంపై సామాన్యుల్లో విశ్వాసం సన్నగిల్లుతోందన్నారు. "భారతదేశంలో ఆదాయ అసమానతల పెరుగుదలలో సామాజిక, రాజకీయ కారణాలు"పై తాను రూపొందించిన పరిశోధనా పత్రాన్ని ఆయన హైదరాబాద్‌లో విడుదల చేశారు. విద్య, వైద్య రంగాలపై ప్రభుత్వం అతి తక్కువ ఖర్చుపెట్టటం, అణగారిన వర్గాలను సామాజికంగా సమ్మిళితం చేయటంలో వైఫల్యాలు, పాతికేళ్లలో పన్ను రేట్ల సడలింపులు, అభివృద్ధి కేంద్రీకరణ వంటివన్నీ మన దేశంలో ఆర్థిక సమానత్వానికి అవరోధంగా నిలుస్తున్నాయన్నారు. దేశ ఆరోగ్య వ్యవస్థ అసలు రూపురేఖలను కొవిడ్ బట్టబయలు చేసిందన్నారు. అధిక తలసరి ఆదాయం కలిగిన మహారాష్ట్రలో కొవిడ్ మరణాలు ఎక్కువ నమోదు కావటం ఆశ్చర్యకరమని, ఆరోగ్య రంగంపై తక్కువ ఖర్చు చేయటమే అందుకు కారణమని అన్నారు. ఆరోగ్యరంగంపై ప్రభుత్వ వ్యయం పెంచటం అత్యవసరమన్నారు. సామాజిక ప్రజాస్వామ్య పద్ధతిని అనుసరించే స్కాండినేవియన్ దేశాలు మానవాభివృద్ధి సూచీలో ముందున్నాయన్నారు. పంచాయతీరాజ్ సంస్థలకు నిధుల కేటాయింపులో బీహార్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వెనుకంజలో ఉన్నాయన్నారు. భూతాపం సైతం అసమానతలపై తీవ్ర ప్రభావం చూపుతోందని, వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల పేదలే అధికంగా నష్టపోతున్నారన్నారు. అల్పాదాయ వర్గాల ఆర్థిక, సామాజిక సాధికారతపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాలన్నారు. రాజకీయ పార్టీల నిర్మాణాన్ని ప్రజాస్వామీకరించి అణగారిన వర్గాల భాగస్వామ్యానికి అధిక ప్రాధాన్యతనివ్వాలన్నారు. ✦

## ముఖ్యమంత్రి బాధ్యతల్ని పెంచిన విజయం

రాష్ట్ర పంచాయతీ, పురపాలక, కార్పొరేషన్ ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ప్రజలు అసాధారణస్థాయిలో పట్టం కట్టారని, ఈ విజయం ఆయన ప్రభుత్వం మీద బాధ్యతల్ని పెంచిందని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ కార్యనిర్వాహక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ విజయనగరంలో మీడియాతో మాట్లాడుతూ అన్నారు. తాగునీటి నుంచి అనేక సమస్యలు స్థానిక ప్రభుత్వాల్ని వేధిస్తున్నాయని, వీటిని పరిష్కరించటం మీద దృష్టి పెట్టాలన్నారు. ప్రతిపక్షాన్ని తొక్కేసాం కాబట్టి అడిగేవారు లేరన్నట్లు వ్యవహరిస్తే ప్రజలే ప్రతిపక్షంగా మారతారన్నారు. పంచాయతీలు, మునిసిపాలిటీల్లో సుపరిపాలనను అందించేందుకు వలంటీర్ల వ్యవస్థ చాలదని, స్థానికంగా నిధులు, ప్రజల భాగస్వామ్యం ఉండేలా చట్టబద్ధ ఏర్పాట్లు ఉండాలన్నారు. ✦



# సవాళ్లకు జనతంత్ర సంస్కృతే సమాధానం

## – నిఖిలేశ్వర్, ప్రముఖకవి, కేంద్ర సాహిత్య అకాడమీ 2020 పురస్కార గ్రహీత

దేశంలో ప్రతి ఒక్కరం వ్యక్తిగతంగా, సమాజంలో భాగంగా ఆయా రంగాలలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. ఇక్కడ మనం అంటే– రచయితలుగా, మేధావులుగా, బుద్ధిజీవులుగా మాట్లాడుకుంటున్నాం. సమకాలీన సమాజంలో అందరికంటే ముందుగా మేల్కొని హెచ్చరిస్తున్న వాళ్లుగా ఆలోచిస్తున్నాం.


శుష్క వాగ్దానాలతో, నినాదాలతో అధికారానికి వస్తున్న పాలకులు నేలపైనున్న వాస్తవాలను మరచి, ఆకాశంలో అంచనాలు వేస్తున్నారు. సమస్యల మూలాల నుంచి దారి మళ్లించి తాత్కాలిక ఉపశమనంతో బతుకు భారాన్ని మోయమంటున్నారు. ఆయా పథకాల ద్వారా ఉచితంగా ప్రజల డబ్బును పంచిపెడుతూ వారినే బిచ్చగాళ్లుగా మార్చేస్తున్నారు.

అంతరిక్షంలోకి దూసుకుపోయే ప్రయోగాలతో వైజ్ఞానికంగా, సాంకేతికంగా ఎదిగిన ఇండియాను ఒకవైపు, ఇక్కడి నేలపై రుణభారంతో, వ్యవసాయం గిట్టుబాటుకాక ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతుల దీనమైన భారత్‌ను మరోవైపు చూస్తున్నాం.

రాజకీయ, ఆర్థిక రంగాలలో ఉన్న వైరుధ్యాలు, అంతరాల మధ్యనే సామాజికంగా మతతత్వం, కులజాడ్యం విస్తరించిన ఈ వ్యవస్థలో భావప్రకటన, అభివ్యక్తి స్వేచ్ఛ అనే మౌలికమైన ప్రాథమిక, మానవ హక్కులను బంధించాలని కుట్రలు జరుగుతున్నాయి. మరోవైపు ప్రజల పక్షాన నిలబడి ప్రతిపక్షంలో ఉండవలసిన కవులు, కళాకారులు, మేధావులు పదవులకు, సన్మానాలు, పురస్కారాలకు ఎగబడుతున్న వాస్తవాన్ని మనం విస్మరించలేం.

మన రాజకీయ నాయకులు, పాలకులు భూస్వామ్య ఫ్యూడల్ మానసికతతో పాలిస్తున్నారు. ఇంతవరకు అణగారిన కులాలు, తమ అస్తిత్వ పోరాటాల ద్వారా ఉనికిని చాటుకోవడం న్యాయమే. అయితే తాత్కాలికంగానైనా రాజ్యాధికారంలో తమ వంతు వాటాను సాధించుకోడానికి ఆయా కులసంఘాలు షార్ట్‌కట్ మార్గాలను వెదుకుతున్నాయి. సమష్టి ప్రజా పోరాటాల నుండి విడిపోయి తమ కుల పంచాయితీలలో, రిజర్వేషన్ల ఉద్యమంలోనే తమ విముక్తి ఉందని భావిస్తున్నాయి.

ప్రస్తుతం మనకు రాజ్యాంగపరమైన హక్కులున్నా, వాటిని కాపాడవలసిన న్యాయవ్యవస్థ బలహీన పడుతున్నది. ప్రజల మాన, ప్రాణాలను రక్షించవలసిన చట్టాలన్నీ అవినీతి పాలకుల కీలుబొమ్మలుగా మారిపోతున్నాయి. సోషలిజం, సెక్యులరిజం నామమాత్రంగా అలంకారప్రాయంగా మిగిలిపోయాయి. మరోవైపు గ్రామీణ ప్రజల కులవృత్తులు ధ్వంసమైన తర్వాత, ఉపాధి కోల్పోయి, పేదల సంఖ్య పెరిగి నగరాలకు వలసబాట పడుతున్నారు.




ఇక సహజ వనరుల విధ్వంసం జరిగి పర్యావరణ సమతౌల్యం పెద్దసవాలుగా మన ముందున్నది. విద్య, వైద్యం సామాన్యుడికి అతి ఖరీదైపోగా, ఈ సోకాల్డ్ సంక్షేమ పథకాలు కాగితాలకే పరిమితమైనాయి. విగ్రహాలు, మందిరాల నిర్మాణమే ప్రాధాన్యతను సంతరించుకోగా, ఆయా మతాచార్యులు కాలం చెల్లిన సంప్రదాయాలతో సామాజిక జీవితాల్ని నిర్దేశిస్తున్నారు. పాలకులు తమ పదవుల భద్రత కోసం స్వాములవార్లకు సాష్టాంగ నమస్కారాలు చేస్తున్నారు. ఎన్నికలు జూదంగా పరిణమించి, ఓటర్లను కొనివేయగలమనే ధీమా ఏర్పడింది.

ఇలాంటి స్థితిలో ఈ రాజకీయ, సామాజికమైన సవాళ్లను ఎదుర్కొనే శక్తిని ప్రజాపోరాటాల ద్వారానే సాధించుకోగలమనే నమ్మకం మిగిలి ఉంది.

మరో ముఖ్యమైన సవాలు– వర్తమాన సాంఘిక వ్యవస్థలోకి మార్కెట్ ఆర్థిక విధానాల వల్ల వాడకం దినుసుల వ్యామోహంతో విలాసాలకు ఎగబడే మనస్తత్వం వ్యాపించింది. మానవ సంబంధాలు విచ్ఛిన్నమైపోతున్నాయి. వికృతమైన వినోదం, లైంగిక విశృంఖలత మూలంగా స్త్రీ, పురుష సంబంధాలలో, సహజమైన ప్రేమానుబంధాలు నశించిపోతున్నాయి. వ్యక్తితోపాటు, కుటుంబాలు మానసిక సంక్షోభంలో కూరుకుపోతున్న పరిస్థితి ఇది.

ఈ సంక్షోభాన్ని, మానవ సంబంధాలలో వచ్చిన మార్పును మన సమకాలీన సాహిత్యం చిత్రించడం లేదు. ఇప్పటికీ మధ్యతరగతి మనస్తత్వంతో, సంకుచిత వ్యక్తి స్వార్థంతో కొట్టుమిట్టాడుతున్నది. పాలకుల ఫాసిస్టు చర్యలను ఎండగట్టే ప్రజలకు మనోధైర్యాన్ని, ప్రతిఘటనా శక్తిని ఇవ్వవలసిన రచయితలు మౌనం వహిస్తున్నారు. పాలకులు భజనపరులైన కవులు, కళాకారుల అవకాశవాదాన్ని సహిస్తున్నారు.

అంతిమంగా మానవీయ విలువల కోసం, సమసమాజ స్వప్నాన్ని నిజం చేయగల శక్తి ఈ దేశ ప్రజలకే ఉన్నదని నమ్ముతున్నాం. మన ప్రజాపోరాటాల వారసత్వం ఇచ్చిన ఆత్మవిశ్వాసంతో, రచయితలు తమ సృజనాత్మక శక్తితో వివిధ ప్రక్రియలలో పాప్యులిస్టు, కాలక్షేప రచయితలకు సమాంతరంగా శక్తిమంతంగా రచనలు చేయడమే ప్రత్యామ్నాయ మార్గం. ✦

# లోక్‌సత్తా అభిమానుల సేవల్ని సద్వినియోగం చేసుకోవాలి

**- ఎ. అన్నపూర్ణ, కాలిఫోర్నియా**

ఇటీవల తెలంగాణలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తన పార్టీ టీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవటానికి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు అష్టకష్టాలు పడ్డారు. పార్టీ మొత్తాన్నీ మోహరించి శక్తియుక్తులన్నిటినీ ఉపయోగించి నెగ్గారు. కానీ ఎల్లవేళలా ఇలా సాధ్యం కాదు. అంతకుముందు గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పుని కేసీఆర్, ఆయన పార్టీ ఓసారి గుర్తుతెచ్చుకోవాలి. నగర పాలన అంటే.. రెండు సెంటీమీటర్ల పైన వర్షం పడితే డిజాస్టర్ రెస్పాన్స్ టీంలతో మేనేజ్ చేయటం, నిజంగా డిజాస్టర్ స్థాయి వర్షం పడితే చేతులెత్తేయటం, స్థానిక సమస్యలకు మంత్రి, ముఖ్యమంత్రుల దాకా వెళ్లాల్సి రావటం, అవినీతి కళ్ల ముందు కనిపిస్తున్నా నిస్సహాయంగా ఉండాల్సి రావటంగా ఉంటే నేతలు, పార్టీలు ఎంత గీపెట్టినా ఓట్లు వేయటం వేస్టు అని జీహెచ్ఎంసీ ఓటింగ్ రోజున ప్రజలు తేల్చి చెప్పారు. వేసిన ఓట్లతో కూడా కేసీఆర్ పార్టీకి వార్నింగ్‌తో కూడిన అధికారావకాశాన్నిచ్చారు. కేంద్రీకృత పాలన స్థానంలో తమ అవసరాలు, తమ కుటుంబాల భవిష్యత్తుకు కావలసిన నాణ్యమైన విద్య, ఆరోగ్యం, చట్టబద్ధపాలన చుట్టూ పాలనను తిప్పాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. ప్రభుత్వోద్యోగుల జీతాల్ని కమిటీ సూచించినదానికంటే నాలుగు రెట్లు ఎక్కువగా పెంచటం, పదవీ విరమణ వయసు పెంపు, ఎమ్మెల్సీ ఎన్నికలైన వెంటనే విద్యాసంస్థల మూసివేత వంటి నిర్ణయాలు పరిణతి, ముందుచూపు గల నాయకులు చేయాల్సినవి కావు. పునస్సమీక్ష చేసుకుని ప్రజాస్వామ్య తెలంగాణ దిశగా మార్పుల్ని తీసుకురాకపోతే.. రాబోయే ఎన్నికలు తెలంగాణ రాష్ట్ర సమితికి పెనుసవాళ్లుగానే మారతాయి. అలాగే టీఆర్ఎస్‌కు బలమైన ప్రత్యర్థిగా తెలంగాణలో ఎదుగుతున్న బీజేపీకి కూడా ఈ ఎన్నికలలో ప్రజలు కొన్ని పాఠాలు చెప్పారు. అధికార టీఆర్ఎస్‌ను నిలువరించటానికి బీజేపీని ఉపయోగించుకుంటూనే, ఆ పార్టీకి మరీ ఎక్కువగా మద్దతివ్వటానికి ప్రజలు సుముఖత వ్యక్తం చేయటం లేదు. కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీని అధికారానికి ఆమడ దూరంలో ఉంచారు గ్రేటరాబాదీలు. బీజేపీ తన భావజాలాన్ని, రాజకీయ సంస్కృతిని హేతుబద్ధీకరించుకోవటం, ప్రజాస్వామీకరించుకోవటం ఎంతో అవసరం. మరోవైపు.. టీఆర్ఎస్, బీజేపీలోని అభ్యర్థుల కంటే ఎక్కువ అర్హతలుండి, నిజాయతీకి మారుపేరుగా నిలిచి ఈ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిన సుప్రసిద్ధులు ప్రజల ఎజెండా కోసం కృషి చేయటంతోపాటు ఎన్నికల సంస్కరణలు, పార్టీల ప్రజాస్వామీకరణ కోసం కూడా పోరాడాల్సి ఉంది.

ఇక లోక్‌సత్తా విషయానికి వద్దాం.

'వెబినార్లతో తరచూ సమావేశాలు జరుపుదాం, చర్చించుకుందాం' అని అక్టోబర్, 2020లో లోక్‌సత్తా పార్టీ వార్షికోత్సవం సందర్భంగా సభ్యులతో జేపీ అన్నారు. అనేక




సమావేశాల్లో జేపీ పాల్గొంటున్నారుగానీ లోక్‌సత్తా వారితో మాట్లాడటానికి మాత్రం పెద్దగా సమయం ఇవ్వటం లేదనిపిస్తోంది. ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) ఆధ్వర్యంలో ఇటీవల 'చట్టబద్ధపాలన'పై వర్చువల్‌గా జరిగిన ఇండియన్ డెమోక్రసీ ఎట్ వర్క్ (ఐడీఏడబ్ల్యూ) రెండవ జాతీయ సదస్సు ఎంతో ప్రయోజనకరంగా జరిగింది. ఆ సదస్సు విడుదల చేసిన హైదరాబాద్ డిక్లరేషన్‌లోని పరిష్కారాలు త్వరలో అమల్లోకి వస్తాయని భావిస్తున్నాం. జేపీతో సమావేశాల్ని ఎలా ప్లాన్ చేస్తున్నారో లోక్‌సత్తా బాధ్యుల నుంచి తెలుసుకోవాలనుకుంటున్నాం.

తగిన జాగ్రత్తలు తీసుకుంటూనే కరోనా వల్ల మందగించిన కార్యక్రమాలను నెమ్మదిగానైనా లోక్‌సత్తా పట్టాలెక్కించాలి. లోక్‌సత్తా ఉద్యమ సంస్థకి కొత్త సభ్యులను పిలిచి రుసుమును కోరటం సముచితం. పాతవారు కూడా రుసుముతో సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోవాలని సూచించండి. ముందుగా నాకు అవకాశం ఇవ్వండి. "ఎలా అడుగుతాం" అని అనుకోవద్దు. మీరు గుర్తించిన వారికి లేఖ రాస్తే.. "మాకు ప్రియార్టీ ఇచ్చారని, వ్యక్తిగతంగా గుర్తుపెట్టుకున్నారని" సభ్యులు తప్పక సంతోషంతో ముందుకు వస్తారని నమ్ముతున్న. చాలామంది యువతకు ఒక బాధ ఉంది. చదువుకున్నవారిని గుర్తించినంతగా పనిచేసేవారిని గుర్తించరు అని. దయచేసి అభిమానంతో ఆదరించి వారి అపోహను, నిరాశను తొలగించండి. లోక్‌సత్తా పట్ల ఎంతో అభిమానంతో ముందుకొచ్చేవారి సేవల్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలి.

మరొక విషయం. ఈనాటి సీనియర్ సిటిజన్లలో పనిచేయగలవారూ ఉన్నారు. కాలం మారింది. రిటైరయ్యారని దూరం పెట్టొద్దు. సలహాదారులుగా వారి సేవలను వినియోగించుకోవచ్చు (మరీ చాదస్తులు, పనిచేయనివారుంటే అప్పుడే తొలగిద్దాం). ఎటూ యువసత్తా ఉంది. బలాన్ని పెంచుకోవటానికి అందరి అవసరం ఉంది. కొత్తవారికి కూడా ఎందుకు చోటు కల్పించకూడదు? మీరు అనుమతివ్వండి, నేను తీసుకొస్తాను. వారికీ కాలము, మేధ సద్వినియోగం కాగలదు. మన లక్ష్యం దిశగా కూడా అడుగులు వేగవంతమవుతాయి. జేపీ గారు మనసులోని ఆలోచనలను పంచుకునేందుకు, చర్చించి కార్యాచరణ నిర్ణయాలు తీసుకునేందుకు వీలుగా సమావేశాలకు చొరవ తీసుకోవలసిందిగా లోక్‌సత్తా మిత్రులను కోరుతున్నా. ✦

# రసవత్తర కుంభకోణాల నుంచి పాలనా సంస్కరణల వైపు మనం దృష్టిని మళ్లించాలి





ప్రతి నెలా రూ.100 కోట్లు వసూలు చేయాలని మహారాష్ట్ర హోంమంత్రి అనిల్ దేశ్‌ముఖ్ ఓ పోలీసు అధికారికి లక్ష్యంగా పెట్టారని ముంబయి మాజీ పోలీసు కమిషనర్ పరమ్ వీర్ సింగ్ ఆరోపించిన ఉదంతం.. మన వ్యవస్థలోని విషవలయానికి అద్దం పడుతోందని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. బదిలీలు, పోస్టింగులు, పలుకుబడి, వసూళ్లు వంటి జాడ్యాలతో భారత పాలనా వ్యవస్థలో ఒక 'ప్రమాదకరమైన సమతుల్య స్థితి' నెలకొని ఉందని సుమారు 40 ఏళ్ల క్రితం రాబర్ట్ వేడ్ అభివర్ణించారన్నారు. ఇలాంటి వ్యవస్థను ఎదిరించటం వల్ల లాభం కంటే నష్టం ఎక్కువ అనే భయంతో ప్రతి ఒక్కరూ ఏదోకరకంగా అవినీతికి తలొగ్గుతారని చెప్పారన్నారు. ఇలాంటి అవినీతి భారతానికి రాజకీయ సంస్కరణే విరుగుడని జేపీ అన్నారు. చాలా రాష్ట్రాల్లో ప్రధాన పార్టీలకి చెందిన ఒక్కో ఎమ్మెల్యే అభ్యర్థి రూ.5 నుంచి 15 కోట్ల దాకా ఖర్చు పెడుతున్నారని, అయినా గెలుస్తారనే గ్యారంటీ ఉండదన్నారు. అయితే డబ్బు వెదజల్లకుంటే చాలా సందర్భాల్లో ఓటమి మాత్రం గ్యారంటీ అన్నారు. భారీ అవినీతిని చూసి ఆశ్చర్యాన్ని అభినయించటం వల్ల ఫలితం ఉండదన్నారు. మనకిప్పుడు కావలసింది నిజమైన రాజకీయ సంస్కరణ అన్నారు. ఈలోగా ప్రభుత్వం చేయాల్సిన మౌలిక బాధ్యతల్ని స్పష్టంగా గుర్తించటం, ఆర్థిక స్వేచ్ఛ, జవాబుదారీతనానికి పటిష్ట ఏర్పాట్లు, చట్టబద్ధపాలన సక్రమంగా అమలయ్యేలా చూడటం అవసరమన్నారు. ఉమ్మడి అవసరాల నిర్వహణలో రాజ్య వ్యవస్థ పాత్ర కీలకమని, అయితే ఎన్నికల్లో గెలుపు భారీఎత్తున నల్లడబ్బు ద్వారా జరుగుతుంటే, అవినీతి కొనసాగుతూనే ఉంటుందన్నారు. కనీసం ఒక పరిధి దాటిన నేరాలలోనయినా దర్యాప్తు, ప్రాసిక్యూషన్‌లను రాజకీయ జోక్యం నుంచి వేరు చేసి స్వతంత్ర ప్రతిపత్తి, జవాబుదారీతనాలతో ప్రభావశీలంగా జరిగేలా చేయాలన్నారు. నిజమైన, పటిష్ఠమయిన చట్టబద్ధపాలన, వేగంగా న్యాయం కీలక మొదటి అడుగులన్నారు. రసవత్తర కుంభకోణాల నుంచి మన దృష్టి పాలనా సంస్కరణల వైపు మళ్లాలన్నారు. ప్రజాస్వామిక జవాబుదారీతనాన్ని, ఎన్నికైన ప్రజాప్రతినిధుల భాగస్వామ్యాన్ని, శాంతి భద్రతల నిర్వహణలో రాజకీయ నిర్ణయాధికారాన్ని, చట్టబద్ధపాలనను మనం జాగ్రత్తగా సమతుల పరచాలన్నారు. విజయవంతమైన, పరిణతి గల పలు ప్రజాస్వామ్యాలు ఈ సమతూకాన్ని సాధించగలిగాయని, నిజమైన చట్టబద్ధపాలన కోసం మనం ఇప్పటికైనా ప్రారంభం కావాలని జేపీ అన్నారు.

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HD-913/2021-2023 Published on 10th April, 2021 Posting Date 15 &16th of every month

‘భద్రత-స్వేచ్ఛ-ఉపాధి-ఆర్థికవృద్ధి-సామాజిక భరోసా’



# చట్టబద్ధపాలన నిత్యావసరం..
# సంస్కరించుకోకుంటే
# తప్పవు తిప్పలు నిత్యం!

*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*Tulips Apartments, 6-3-655,*
*Flat.No. 407,*
*Behind civil supplies office,*
*Somajiguda,*
*Hyderabad - 500 082*

**Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, Tulips Apartments, 6-3-655, Flat.No. 407, Behind civil supplies office, Somajiguda, Hyderabad - 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC “X” Roads, Hyderabad 500 020**